


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 63 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 14 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 63 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 14 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## చైనా, పాక్ మనకంటే ముందున్నాయి....

### భారత్‌కు కూడా 'రాకెట్ ఫోర్స్' అవసరం: ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది



- భారత్‌కు ప్రత్యేక రాకెట్ ఫోర్స్ కమాండ్ అవసరమన్న ఆర్మీ చీఫ్
- చైనా, పాకిస్థాన్‌లు ఇప్పటికే ఇలాంటి దళాలను ఏర్పాటు చేశాయని వెల్లడి
- పినాకా, ప్రళయ్, బ్రహ్మోస్ వ్యవస్థలతో ఈ కమాండ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- పినాకా శ్రేణిని 300 కిలోమీటర్లకు పైగా పెంచేందుకు ప్రయత్నాలు
- ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ కూడా ఇదే బాటలో యోచిస్తున్నట్టు వెల్లడి

వివరాలు 2లో..

## ఇరాన్ లో భగ్గుమన్న ప్రజాగ్రహం...

### నిరసనల్లో 2 వేల మంది మృతి

- ఇరాన్‌లో నిరసనల్లో వేల మంది మృతి
- రాయిటర్స్‌కు వెల్లడించిన ఇరాన్ ప్రభుత్వ అధికారి
- ఆర్థిక సంక్షోభంతో దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనలు
- అల్లర్ల వెనుక విదేశీ శక్తుల హస్తం ఉందని ప్రభుత్వ ఆరోపణ
- దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేత



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్‌లో గత రెండు వారాలుగా కొనసాగుతున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ నిరసనల్లో భద్రతా సిబ్బందితో సహా దాదాపు 2,000 మంది మరణించినట్లు ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి

వివరాలు 2లో..



# ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు

### ఖరీఫ్ సీజన్‌లో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### గతంలో 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించినట్లు వెల్లడి

### రైతుల భాగస్వామ్యంతో రికార్డు సాధ్యమైందని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలుస్తూ రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేసింది. ఈ సీజన్ లో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. 14 లక్షల మంది రైతులకు రూ.16 వేల 606 కోట్లు చెల్లించింది. రూ.1,425 కోట్ల బోనస్ ను వారి ఖాతాలో జమచేసింది. గత బీఆర్ఎస్ పాలన 2020-21 లో 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం అధిగమించింది. ఇది రాష్ట్ర వ్యవసాయ చరిత్రలోనే ఒక చారిత్రక ఘట్టం. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన ట్విట్టర్లో వెల్లడించారు.రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో వరి సాగైంది. సుస్థిర పాలన, రైతులకు లాభం చేకూర్చే విధానాలు, విస్తరణ ఫలితాలతో రాష్ట్రంలో వ్యవసాయం ఏటేటా వర్ధిల్లుతోంది. గడిచిన రెండేండ్లలో తెలంగాణ దేశమందరి దృష్టిని ఆకర్షించేలా పంటల సాగులో కొత్త రికార్డులు నెల కొల్పింది.

**రైతుల మేలుకోరే పథకాలు**

తొలి రెండేండ్లలోనే ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. రైతుల మేలుకోరే పథకాలకు భారీ బడ్జెట్ కేటాయిం చింది. తెలంగాణ రైతులను దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలనే సంకల్పంతో రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసింది. రూ. 54,280 కోట్లతో వివిధ పథకా లను అమలు చేసింది. దేశంలోనే వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా గతంలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను అదుకునేం దుకు ప్రభుత్వం వెనుకాడలేదు. గత ఏడాది మార్చి, సెప్టెంబర్లో వడగం డ్లు. వర్షాలతో నష్టపోయిన 94462 మంది రైతులకు రూ. 95.39 కోట్ల పరిహారం అందించింది. ఇటీవల మార్చి, ఏప్రిల్లో వచ్చిన భారీ వర్షా లకు నష్టపోయిన 36449 మంది రైతులకు రూ.44,19కోట్ల పరిహారం అందించింది.

## చైనా మాంజాపై సీపీ సజ్జనార్‌కు HRCనోటీసులు

- అడ్వకేట్ దాఖలు చేసిన పిటిషన్లపై..
- తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్
- ఫిబ్రవరి 26వ తేదిలోపు రిపోర్టు ఇవ్వాలని కోరిన కమిషన్




**హైదరాబాద్ పెన్ పవర్:**చైనా మాంజా వినియోగంపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ కు తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎ=జ) నోటీసులు జారీ చేసింది. చైనా మాంజా వినియోగించకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో రిపోర్టు ఇవ్వాలని ఆదేశించింది. పతంగులకు చైనా మాంజా వినియోగం మనుషుల ప్రాణాలు తీస్తున్న క్రమంలో పలువురు అడ్వకేట్ లు మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న ఎ=జ ఫిబ్రవరి 26లోగా మాంజా వినియోగంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో రిపోర్టు ఇవ్వాలని సీపీ సజ్జనార్ ను ఆదేశించింది. పతంగుల ఎగురవేతకు చైనా మాంజా వినియోగంతో అటు పక్షులు, ఇటు మనుషుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.గత పది రోజులుగా చైనా మాంజా కారణంగా కొందరు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.చైనా మాంజాతో బైకర్స్ కి, పక్షులకు ప్రాణాపాయం ఉందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. చైనా మాంజా వినియోగం తో ప్రమాదాలు పెరుగుతున్న క్రమంలో రాష్ట్రంలో కఠిన చర్యలు అమలు చేస్తున్నారు. చైనా మాంజా అమ్మకం, వాడకంపై జీరో టోలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు. లక్షల విలువైన చైనా మాంజాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



## కుక్క కరిస్తే రాష్ట్రప్రభుత్వాలదే బాధ్యత..

## ప్రతీ కుక్క కాటుకు భారీ ఫైన్

- వీధి కుక్కల దాడిలో ఎవరైనా గాయపడితే వాటికి తిండిపెట్టిన వారిదే బాధ్యత: సుప్రీంకోర్టు
- అంత ప్రేమ ఉంటే ఇంటికి తీసుకెళ్లి పెంచుకోవాలని సూచన
- రాష్ట్ర ప్రభుత్వాలే పరిహారం చెల్లించాలని హెచ్చరిక
- చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు బాధ్యత వహించాల్సిందే

**పెన్ పవర్ డెస్క్:**వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్న పిల్లలు, వృద్ధులపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరిస్తే.. వాటికి తిండి పెడుతున్న వారిదే బాధ్యత అని స్పష్టం చేసింది. వీధి కుక్కలపై అంత ప్రేమ ఉంటే వాటిని ఇంటికి తీసుకెళ్లి పెంచుకోవాలని సూచించింది.వీధి కుక్కల విషయంలో తమ ఆదేశాలను పాటించని రాష్ట్ర ప్రభుత్వాలపైనా సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గాయపడ్డ వారికి పరిహారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలని స్పష్టం చేసింది. చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు తాము నిర్దేశించిన పరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుందని జస్టిస్ విక్రమ్ నాథ్ హెచ్చరించారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య వైసీపీ, బీఆర్ఎస్ చిచ్చు పెడుతున్నాయి

- వైసీపీ, బీఆర్ఎస్ కలిసి తెలుగు ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయన్న పట్టాభి
- సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికలు ఉమ్మడిగా తప్పుడు కథనాలు రాస్తున్నాయని ఆగ్రహం
- జగన్ తన ఆస్తుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్‌కు తాకట్టు పెట్టారని విమర్శలు
- రాయలసీమ లిఫ్ట్, పోలవరంపై జగన్, కేసీఆర్ నాటకాలు ఆడారని వ్యాఖ్యలు
- చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవడం తమ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ




**పెన్ పవర్ డెస్క్:**తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా వైసీపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడి కుట్రకు పాల్పడుతున్నాయని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా ఆరోపించారు. మంగళగిరిలోని

వివరాలు 2లో..

## ఇకపై నో 10 మినిట్స్ డెలివరీ..

## డెలివరీ బాయ్స్‌కు కేంద్రం గుడ్ న్యూస్

- 10 నిమిషాల డెలివరీ విధానానికి స్వస్తి పలికిన క్విక్ కామర్స్ సంస్థలు
- డెలివరీ పార్ట్‌నర్ల భద్రతపై కేంద్ర కార్మిక శాఖ ఆందోళన
- సంస్థల ప్రతినిధులతో సమావేశమై సూచనలిచ్చిన మంత్రి మన్‌సుఖ్ మాండవీయ
- ఇప్పటికే '10 నిమిషాల డెలివరీ' ట్యాగ్‌లైన్‌ను తొలగించిన బ్లింకిట్
- త్వరలో జెప్టో, స్విగ్గీ, జొమాటో కూడా అనుసరించే అవకాశం




**పెన్ పవర్ డెస్క్:**డెలివరీ రంగంలో తీవ్ర విమర్శలకు దారితీసిన '10 నిమిషాల డెలివరీ' విధానానికి ముగింపు పడ నుంది. డెలివరీ పార్ట్‌నర్ల (గిగ్ వర్కర్లు) భద్రత, సంక్షేమంపై వెల్లువెత్తిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుంది. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ, జొమాటో

వివరాలు 2లో..

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

### వైద్యారోగ్య శాఖలో త్వరలోనే జాబ్ నోటిఫికేషన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** నిరుద్యోగులకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా గుడ్ న్యూస్ చెప్పారు. వైద్యారోగ్య శాఖలో త్వరలోనే మరిన్నీ జాబ్ నోటిఫికేషన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశాఖలో గత రెండేళ్లలోనే సుమారు 10 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని.. ఇంకో 7 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ అవుతున్నాయని చెప్పారు. మంగళవారం (జనవరి 13) సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వివరాలు 2లో..

## సంక్రాంతి పండగ వేళ గ్రామ పంచాయతీలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండగ వేళ గ్రామ పంచాతీయలకు తెలంగాణ సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ.277 కోట్ల నిధులు విడుదల చేసింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మంగళవారం (జనవరి 13) ఆర్థిక శాఖ ఫండ్స్ రిలీజ్ చేసింది. నిధులను గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉపయోగించాలని ప్రభుత్వం సూచించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లకు భట్టి విక్రమార్క సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, 2025, డిసెంబర్ నెలలో మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర తర్వాత 2025, డిసెంబర్ 22న గ్రామ పంచాయతీల్లో

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# పురాణ పురుషులు... మల్లాది చంద్ర శేఖరులు

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే.ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిం దే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ధ ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి.మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు.తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుం డడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా-లక్ష్మి అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతో త్తములు చంద్రశేఖర శాస్త్రి...

96 ఏళ్ళ వయసులో జనవరి 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

# చైనా, పాక్ మనకంటే ముందున్నాయి...

ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, దేశ రక్షణ కోసం ప్రత్యేకంగా ఒక రాకెట్ ఫోర్స్ కమాండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న భద్రతా పరిస్థితుల్లో ఇది వ్యూహాత్మకంగా చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్మీ డే సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రస్తుత యుద్ధ క్షేత్రంలో రాకెట్లు, మిసైళ్ల మధ్య వ్యత్యాసం తగ్గిపోయిందని, రెండూ నిర్ణయాత్మక ఫలితాలను ఇవ్వగలవని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. మన పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్‌లు ఇప్పటికే ప్రత్యేక రాకెట్ ఫోర్స్ లను ఏర్పాటు చేశాయని, వాటికి దీటుగా భారత్ కూడా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన నొక్కి చెప్పారు. ఈ దిశగా సైన్యం తన దీర్ఘ శ్రేణి దాడి సామర్థ్యాలను గణనీయంగా పెంచుకుంటోందని తెలిపారు.స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పినాకా రాకెట్ వ్యవస్థను ఇప్పటికే 120 కిలోమీటర్ల శ్రేణితో విజయవంతంగా పరీక్షించామని, దాని సామర్థ్యాన్ని 150 కిలోమీటర్లకు పెంచేందుకు ఒప్పందాలు కూడా జరిగాయని జనరల్ ద్వివేది వివరించారు. భవిష్యత్తులో దీని శ్రేణిని 300 నుంచి 450 కిలోమీటర్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. పినాకా, ప్రళయ్, బ్రహ్మోస్ వంటి శక్తివంతమైన వ్యవస్థలను సమన్వయం చేస్తూ ఈ రాకెట్ ఫోర్స్ కమాండ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' గురించి మాట్లాడుతూ, పాకిస్థాన్ నుంచి వచ్చిన అణు బెదిరింపులు కేవలం రాజకీయ స్థాయిలోనే ఉన్నాయని, సైనిక స్థాయిలో (డీజీఎంవోల మధ్య) అలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఆ ఆపరేషన్ సమయంలో భారత దళాలు కేవలం 88 గంటల్లోనే భూతల దాడులకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయని, పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని గుర్తుచేశారు. ఈ ఆపరేషన్ తర్వాత, పాకిస్థాన్ కూడా ప్రత్యేక రాకెట్ ఫోర్స్ ఏర్పాటు దిశగా ఆలోచిస్తోందని నివేదికలు వస్తున్నాయని ఆయన తెలిపారు.

# ఇరాన్ లో భగ్గుమన్న ప్రజాగ్రహం...

- మొదటి పేజి తరువాయి

వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఇంత పెద్ద సంఖ్యలో మరణాలను అంగీకరించడం ఇదే మొదటిసారి.దేశంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, అధిక ద్రవ్యోల్బణం, స్థానిక కరెన్సీ (రియాల్) విలువ పడిపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. డిసెంబర్ 28, 2025న తెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో మొదలైన ఈ నిరసనలు, అనతికాలంలోనే దేశంలోని 31 రాష్ట్రాలకు విస్తరించాయి. ఈ మరణాలకు ఉగ్రవాదులే కారణమని, వారే ప్రజలు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని సదరు అధికారి ఆరోపించారు. అయితే, మృతుల్లో పౌరులు ఎంతమంది, భద్రతా సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలు వెల్లడించలేదు.1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికారంలోకి వచ్చిన మతపరమైన నాయకత్వానికి, గత మూడేళ్లలో ఇదే అతిపెద్ద అంతర్గత సవాలుగా మారింది. ఆర్థిక సమస్యలపై నిరసనలు చట్టబద్ధమే అని చెబుతూనే, ప్రభుత్వం కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. ఈ అల్లర్ల వెనుక అమెరికా, ఇజ్రాయెల్ హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో సమాచార వ్యాప్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణలు, కాల్పుల ఘటనలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## తెలుగు రాష్ట్రాల మధ్య వైసీపీ, బీఆర్ఎస్ చిచ్చు పెడుతున్నాయి

- మొదటి పేజి తరువాయి

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రెండు పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం తెలుగు ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు రెండు రాష్ట్రాలు బాగుండాలని ఆలోచిస్తే, వైసీపీ-బీఆర్ఎస్ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.ఈ కుట్రలో భాగంగానే వైసీపీ, బీఆర్ఎస్ పార్టీల అధికారిక పత్రికలైన 'సాక్షి', 'నమస్తే తెలంగాణ' సమన్వయంతో పనిచేస్తూ ప్రజలను రెచ్చగొట్టేలా తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని పట్టాభిరామ్ ఆరోపించారు. "తెలంగాణ నీటికి చంద్రబాబు అడ్డుపడుతున్నారని 'నమస్తే తెలంగాణ' రాస్తుంది. అదే సమయంలో, రాయలసీమకు ద్రోహం చేసి తెలంగాణకు న్యాయం చేస్తున్నారని 'సాక్షి' కథనం ప్రచురిస్తుంది. రెండు పత్రికలు, రెండు పార్టీలు, రెండు కుటుంబాలు కలిసి తెలుగు ప్రజలను మోసం చేస్తున్నాయి" అని ఆయన దుయ్యబట్టారు.

గతంలో ఇరు పార్టీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాన్ని పట్టాభిరామ్ గుర్తుచేశారు. "పోలవరం ప్రాజెక్టు ఎత్తు ఒక మీటర్ తగ్గించుకుంటే ఏమవుతుందని కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడితే, అప్పటి సీఎం జగన్ ఖండించకపోగా ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తారు. జగన్ పుట్టినరోజున తాడేపల్లి ప్యాలెస్ ముందు కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతో ఫ్లెక్సీలు కడతారు. ఇలాంటి బంధం రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా, కేవలం వారి రాజకీయ మనుగడ కోసమే" అని విమర్శించారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలోనూ ఈ రెండు పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని పట్టాభి ఆరోపించారు. "ఈ ప్రాజెక్టును తామే ఆపామని హరీశ్ రావు, సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నా... జగన్ వారిని ప్రశ్నించకుండా, కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం వెనుక మ్యాచ్ ఫిక్సింగ్ ఉంది. 'నీ రాష్ట్రంలో నువ్వు డ్రామా ఆడు, నా రాష్ట్రంలో నేను ఆడుతా' అన్నట్లుగా జగన్, కేసీఆర్ వ్యవహరించారు. ఈ ప్రాజెక్టుపై ఎన్జీటీ అభ్యంతరం వ్యక్తం చేసినప్పుడు జగన్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు? కేవలం డీపీఆర్ అంటూ రూ.1000 కోట్లు దోచుకున్నారు" అని ఆరోపించారు.

హైదరాబాద్‌లోని తన ఆస్తులు, ప్యాలెస్‌లను కాపాడుకోవడం కోసమే జగన్.. బీఆర్ఎస్ నేతలతో దోస్తీ చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన అన్నారు. కేవలం విందులు, చేపల పులుసు కోసమే తప్ప, రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్ ఏనాడూ పనిచేయలేదని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు వద్దని, చర్చల ద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నదే తమ కూటమి ప్రభుత్వ విధానమని పట్టాభి స్పష్టం చేశారు. వైసీపీ, బీఆర్ఎస్ కుట్రలను ప్రజలు గత ఎన్నికల్లోనే గ్రహించి బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదని, ప్రజలు ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇకపై నో 10 మినిట్స్ డెలివరీ.. డెలివరీ బాయ్స్‌కు కేంద్రం గుడ్ న్యూస్

- మొదటి పేజి తరువాయి

వంటి ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థలు ఈ వేగవంతమైన డెలివరీ హామీని ఇకపై తమ యాడ్స్‌లో, బ్రాండింగ్‌లో ఉపయోగించకూడదని నిర్ణయించాయి.వివరాల్లోకి వెళితే, కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం న్యూఢిల్లీలో క్విక్ కామర్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. గడువులోగా డెలివరీ చేయాలనే తీవ్ర ఒత్తిడితో డెలివరీ సిబ్బంది రోడ్లపై ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. డెలివరీ సమయానికి సంబంధించిన కఠిన నిబంధనలను తొలగించాలని ఆయన కోరారు. మంత్రి సూచనకు కంపెనీలు సానుకూలంగా స్పందించి, ఈ హామీని స్వచ్ఛందంగా తొలగిస్తామని హామీ ఇచ్చాయి.ఈ నిర్ణయం వెలువడిన వెంటనే, ప్రముఖ సంస్థ బ్లింకిట్ తన బ్రాండింగ్‌ను మార్చేసింది. '10,000కు పైగా ఉత్పత్తులు 10 నిమిషాల్లో డెలివరీ' అనే పాత ట్యాగ్‌లైన్‌ను తొలగించి, దాని స్థానంలో '30,000కు పైగా ఉత్పత్తులు మీ ఇంటి వద్దకే' అనే కొత్త ట్యాగ్‌లైన్‌ను చేర్చింది. ఈ మార్పు ద్వారా డెలివరీ వేగం కంటే సేవల నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు సంకేతాలిచ్చింది.గత కొంతకాలంగా '10 నిమిషాల డెలివరీ'

విధానంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తమ భద్రత, వేతనాల గురించి గిగ్ వర్కర్ల యూనియన్లు, ముఖ్యంగా ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (×ఖీూ) వంటి సంస్థలు ఆందోళనలు, సమ్మెలు కూడా నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జోక్యం ప్రాధాన్యత సంతరించుకుంది. బ్లింకిట్ బాటలోనే జెప్టో, స్విగ్గీ, జొమాటో వంటి ఇతర సంస్థలు కూడా రానున్న రోజుల్లో తమ బ్రాండింగ్‌లో మార్పులు చేయనున్నట్టు తెలుస్తోంది.

## యూట్యూబర్ అన్వేష్‌పై మరోసారి కరాటే కల్యాణి ఆగ్రహం

**భారత పాస్‌పోర్టు పట్ల అన్వేష్ అనుచిత వ్యాఖ్యలు చేశాడన్న కరాటే కల్యాణి**

**భారతదేశంలో పౌరసత్వం ఎంత ముఖ్యమో పాస్‌పోర్టు కూడా అంతే ముఖ్యమని వ్యాఖ్య**

**పాస్‌పోర్టుపై రాజముద్ర ఉంటుందన్న కరాటే కల్యాణ**



**హైదరాబాద్ పెన్ పవర్:** 'నా అన్వేషణ' యూట్యూబర్ అన్వేష్‌పై ప్రముఖ సినీ నటి కరాటే కల్యాణి మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారత పాస్‌పోర్టును దరిద్రపు పాస్‌పోర్టు అని అన్వేష్ వ్యాఖ్యానించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లే భారతీయులకు పాస్‌పోర్టు ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. పాస్‌పోర్టు గురించి పోలీస్ వెరిఫికేషన్ కూడా జరుగుతుందని, దీనికి ఎంతో విలువ ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. అతడి పాస్ పోర్టును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.పాస్‌పోర్టుపై రాజముద్ర ఉంటుందని, అలాంటి పాస్‌పోర్టును ఎంతో జాగ్రత్తగా చూసుకుంటామని ఆమె అన్నారు. మనం ఎంతో జాగ్రత్తగా చూసుకునే పాస్‌పోర్టును అన్వేష్ దూషిస్తున్నాడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.నాలుగు గంటలు వెరిఫికేషన్ కోసం నిరీక్షించేలా చేశారని అన్వేష్ చెబుతున్నాడని, కానీ అతని ప్రవర్తన చూసి వెయిట్ చేయించారని ఆమె విమర్శించారు. అన్వేష్ పాస్‌పోర్టు రద్దయ్యేంత వరకు తాము పోరాడతామని ఆమె అన్నారు. అన్వేష్ భారత్‌లో అడుగుపెట్టిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సంక్రాంతి పండగ వేళ గ్రామ పంచాయతీలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

- మొదటి పేజి తరువాయి

కొత్త పాలకవర్గాలు ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలోనే గ్రామ పంచాయతీలకు నిధులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతి పండగ సందర్భంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్..వైద్యారోగ్య శాఖలో త్వరలోనే జాబ్ నోటిఫికేషన్స్

- మొదటి పేజి తరువాయి

ఉగాది నాటికి సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని చెప్పారు.

హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని.. ఎలక్ట్రికల్ వర్క్స్ కొన్ని పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్, ఇతర ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కూడా చివరి దశలో ఉందన్నారు. ఇప్పటికే అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎంఆర్ఐ వంటి భారీ యంత్రాల ఫిట్టింగ్ పూర్తయిందని తెలిపారు. మాది ప్రచార ఆర్భాటం ఉండదని.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే మా ఆరాటమని పేర్కొన్నారు. అన్నిరకాలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉగాది నాటికి పేషెంట్లకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.

వెయ్యి బెడ్ల ఈ హాస్పిటల్‌లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా సనత్‌నగర్ టిమ్స్ ఉంటుందని.. ఇక్కడే అవసరమైన రీసెర్చ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఇక్కడే అత్యాధునిక ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్నిరకాల అవయవమార్పిడి సర్జరీలు చేసేలా అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో తెస్తున్నామన్నారు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఎలాంటి కొరత ఉండదని తెలిపారు.


## వివేకా కేసులో కీలక పరిణామం.. మరోసారి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కుమార్తె

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తదుపరి దర్యాప్తు పరిధిని కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే పరిమితం చేస్తూ హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలు చేశారు.ట్రయల్ కోర్టు నిర్ణయం, తాము లేవనెత్తిన అంశాలకు, సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరంపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు ట్రయల్ కోర్టును ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకు విచారణ జరిపిన సీబీఐ కోర్టు, ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన అంశాలపై మాత్రమే దర్యాప్తును పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాక్షిక ఉత్తర్వులనే సునీతారెడ్డి తాజాగా సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు.దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి సోదరుడైన వివేకానందరెడ్డి, 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలోని తన నివాసంలో దారుణహత్యకు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో దర్యాప్తు, విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని ఆందోళనలు వ్యక్తమవడంతో, ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేసింది. ఈ కేసులో కడప ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి సహా పలువురిని నిందితులుగా చేర్చి సీబీఐ ఛార్జిషీట్లు దాఖలు చేసింది.సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాధారాలను తారుమారు చేయడం వంటి అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని సునీత మొదటి నుంచి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. సునీత దాఖలు చేసిన ఈ తాజా పిటిషన్‌ను, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఈ పరిణామంతో ఆరేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసులో దర్యాప్తు భవిష్యత్తు ఎలా ఉండబోతోందనే అంశంపై సుప్రీంకోర్టు తీర్పు కీలకం కానుంది.

## సార్లంకపల్లె అగ్నిప్రమాదం: బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా... తక్షణ సాయం, పక్కా ఇళ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లె గ్రామంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 26 గిరిజన గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదం కారణంగా 33 కుటుంబాలు నిలువ నీడ కోల్పోయి నిరాశ్రయులయ్యాయి. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయి.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. అధికారులతో మాట్లాడి బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆదేశించారు. తక్షణ సహాయంగా ప్రతి బాధిత కుటుంబానికి రూ.25,000 నగదు అందించాలని, ఇల్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పక్కా గృహం మంజూరు చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు తాత్కాలిక వసతి, ఆహారం అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ ఎంపీ తంగళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జి రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. బాధితులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ సాయంపై భరోసా ఇచ్చారు.తహసీల్దార్ ఎస్వీ నరేశ్ మాట్లాడుతూ, 33 కుటుంబాలకు రూ.25 వేల చొప్పున నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. బాధితులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వారికి ఆహారం, ఇతర నిత్యావసరాలు అందించే పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

# అక్కర్లేనివి మంటల్లో.. ఆనందాల భాగ్యాల్లో




పాతవి.. పనికిరానివి.. భోగి మంటల్లో వేసేస్తాం... అలాంటివి మన ఇంట్లోనే కాదు.. మనలోనూ చాలా ఉంటాయి! ఆడంబరాల నుంచి.. అబద్ధాల వరకు.. ప్రతికూల ఆలోచనల నుంచి.. పట్టరాని కోపం వరకు.. మనలో చెడు భావాల్ని ప్రోది చేస్తుంటాయి. అందుకే ఈసారి వీటిని భోగి మంటల్లో కాల్చేయండి. ఆనందాల సందడి చేయండి.

-మిగతా 4లో

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



సూరారం విలేజ్‌కి వెళ్ళేదారిలో, బ్రిడ్జ్‌పై అనధికారిక శాశ్వత దుకాణాలు(రోడ్డుపైనే)



సూరారం భీమా గార్డెన్‌లో ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డికి రవిందర్ ముదిరాజ్ ఫిర్యాదు..

# వారాంతపు సంతలతో... జనం ఉక్కిరిబిక్కిరి

## భీమా గార్డెన్‌లో ట్రాఫిక్ భద్రతా వారోత్సవాల్లో సామాజిక వేత్త ఫిర్యాదు..!



శాశ్వత దుకాణాల తోపాటు, బ్రిడ్జ్‌పై వారాంతపు సంతలు, ట్రాఫిక్ జామ్..

- వారాంతపు సంతలపై, విమర్శలు పలు కీలక అంశాలతో ఫిర్యాదుల వెల్లువ..
- ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన సామాజిక వేత్త రవీందర్ ముదిరాజ్..


- సూరారం భీమా గార్డెన్‌లో మంగళవారం ట్రాఫిక్ భద్రతా వారోత్సవాల సమీక్ష..
- పలు కీలక అంశాలపై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదుల వెల్లువ..
- వారాంతపు సంతలు రహదారిపై నిర్వహణ, ప్రమాదాలకు నిలయంగా మారాయని..
- నిర్దిష్టమైన స్థలం కేటాయింపు లేక..! విచ్చలవిడిగా రోడ్లపైనే సంతల నిర్వహణ..
- సంతల నిర్వహణకు కమిటీలు ఏర్పడి, షాపుల నుండి డబ్బులు వసూళ్ళు..!
- 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డును అధికారులు 60 ఫీట్లకే పరిమితం చేసినప్పటికీ..!
- కొందరు స్థానిక లీడర్ల అండతో సూరారం దారిలో బ్రిడ్జ్‌పై ఇరువైపులా శాశ్వత షాపులు..

**ప్రతి శనివారం..! ట్రాఫిక్‌తో నరకమే..!**

సూరారం విలేజ్ రహదారిపై వారాంతపు సంత నిర్వహణ.. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌ల విషయం ట్రాఫిక్ అధికారులకు తెలిసినా..! చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.. 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రహదారిని విస్తరించలేక 60 ఫీట్ల దారికే పరిమితం అయింది..కట్టు సంతతో పాటు.. రోడ్డుకు ఇరువైపులా శాశ్వత దుకాణాల ఏర్పాటు మరింత ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుంది..మియాపూర్ హైవేను కలిపే ఈ 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రహదారిలో వారాంతపు సంత నిర్వహణ, స్థానికులకు నరకం చూపిస్తుందని ఆరోపిస్తున్నారు..

- కుత్బుల్లాపూర్అబశ్రీశ్రీలో గృహజ్యోతి లబ్ధిదారులకు టీపీసీసీ భూపతిరెడ్డి గ్రీటింగ్స్ పంపిణీ..
- గృహజ్యోతి పథకంతో పేద కుటుంబాలకు విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి..
- నియోజకవర్గంలో ఈ పథకం కింద "లక్షా ఇరవై ఐదు" వేల కుటుంబాలకు లబ్ధి..
- పలువురు కాంగ్రెస్ నేతలతో పాటు విద్యుత్ శాఖ అధికారులతో గృహజ్యోతి పంపిణీ..

బౌరంపేట్అబశ్రీశ్రీలో గృహజ్యోతి లబ్ధిదారులతో నర్సారెడ్డి భూపతిరెడ్డి..



# మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ : నర్సారెడ్డి భూపతి రెడ్డి

## ఎన్నికల హామీతో.. పేదింట వెలుగులు నింపుతున్న 'గృహజ్యోతి' పథకం..

దుండిగల్, పెన్ పవర్, జనవరి 13:ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, పేద కుటుంబాలకు నిజమైన ఆసరాగా నిలుస్తున్నట్లు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిరూపించింది.. అందులో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా అమలవుతున్న 'గృహజ్యోతి' పథకం రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ఆర్థిక ఊరటనిచ్చే పథకంగా మారింది.. ఈ పథకం అమలులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 295 డివిజన్ బౌరంపేట్‌లో గృహజ్యోతి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన గ్రీటింగ్స్‌ను మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి పండుగ వాతావరణంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గృహజ్యోతి పథకం కింద సుమారు 1,25,000 కుటుంబాలు ఇప్పటికే లబ్ధి పొందుతున్నాయని వెల్లడించారు.. గృహజ్యోతి పథకం ద్వారా విద్యుత్ బిల్లుల భారం నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు విముక్తి కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.. రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకం కింద ఇప్పటివరకు రూ.3,593 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని, ఇది ప్రభుత్వ సామాజిక బాధ్యతకు నిదర్శనమని భూపతిరెడ్డి పేర్కొన్నారు.. ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్ పరిధిలో ప్రతి నెల 52 లక్షల కుటుంబాలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరాతో పేదల జీవితాల్లో నిజమైన వెలుగులు వెదజల్లుతుందని భూపతిరెడ్డి






కొనియాడారు.. ప్రత్యేకంగా మహిళలు, గృహిణులు ఎదుర్కొనే విద్యుత్ బిల్లుల భారం గృహజ్యోతి పథకం ద్వారా పూర్తిగా తగ్గిందని, ఇది తెలంగాణ ఆడబిడ్డలకు ఆర్థికంగా పెద్ద ఊరటగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, నర్సారెడ్డి తేజ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు డీఈ శ్రీనివాస్ గౌడ్, ఏడీఈ ప్రేమ్ కుమార్, ఏఈ సాయి కిరణ్, లైన్మెన్ శివకుమార్, సీనియర్ నాయకులు నర్సారెడ్డి బాల్ రెడ్డి, ఆర్కెల విజయ్ గౌడ్, జిల్లా ఫిషర్మెన్ అధ్యక్షుడు పోచి మహేష్, దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్, ఆంజనేయ వర్మ, జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ బి. చిరంజీవి, జీతయ్య తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్ చేతుల మీదుగా, గ్రీటింగ్స్ పంపిణీ..

# మున్సిపల్ ఎలక్షన్స్..ఫైనల్ ఓటర్ల లిస్ట్ రిలీజ్..మహిళా ఓటర్లే ఎక్కువ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న క్రమంలో మున్సిపల్ఓటర్ల ఫైనల్ లిస్ట్ ను ప్రకటించింది రాష్ట్ర ఎన్నికల కమిషన్. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో 2వేల 996 వార్డుల్లో 52లక్షల 43 వేల మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చింది. ఇందులో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని తెలిపింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలో 177 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లు ఉన్నాయి. ఈ కార్పొరేషన్లు, మున్సిపాలిటిల్లో త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఈ క్రమంలో ఈ మున్సిపాలిటీల్లోని 2వేల 996 వార్డుల్లో ఓటర్లను లిస్ట్ ను ఫైనల్ చేసి విడుదల చేసి ఎస్ ఈసీ. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో మొత్తం 52లక్షల 43వేల మంది ఓటర్లుండగా.. వారిలో 25లక్షల 62 వేల మంది పురుషులు, 26లక్షల 80 వేల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక అత్యధిక ఓటర్లున్న మున్సిపల్ కార్పొరేషన్లను కూడా ప్రకటించింది ఎస్ఈ సీ. 3లక్షల 56 వేల ఓటర్లతో నిజామాబాద్ మున్సిపాలిటీ మొదటి స్థానంలో ఉంది. 3లక్షల 80వేల 560 మంది ఓటర్లతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ రెండో స్థానంలో ఉందని ఎసీఈసీ తెలిపింది.

# భూసేకరణ వేగంగా పూర్తి చేయండి

## ఇంజినీర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రాజెక్టుల కింద బ్రాంచి, పిల్లకాలువల వ్యవస్థను పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇంజినీర్లకు సూచించారు. సీఎం మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో.. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితోపాటు పలువురు అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16న ప్రారంభోత్సవం చేయనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చనాఖా– కోర్ట ఎత్తిపోతల

-4 లో

# వారాంతపు సంతలతో.. జనం ఉక్కిరిబిక్కిరి..



ఇరుకు బ్రిడ్జ్‌పై శాశ్వత దుకాణాలతో, స్తంభించిన ట్రాఫిక్.. ఫైల్‌ఫోటో..



వాహనదారుల అవస్థలు.. పాత చిత్రం..

**దుండిగల్, పెన్ పవర్, జనవరి 13:**కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ ఏసిపి పరిధిలోని సూరారం విలేజ్ భీమా గార్డెన్‌లో నిర్వహించినట్రాఫిక్ భద్రత వారోత్సవాల సమావేశంలో పలు కీలక అంశాలు ప్రస్తావనకు తెచ్చారు.. నగరంలో పెరుగుతున్న రవాణా సమస్యలు, శబ్ద కాలుష్యం, అక్రమ రోడ్లు, బజార్లలో వారాంతపు సంతల ఏర్పాటు ప్రజల నిత్యజీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు.. ఈ మేరకు ఆయన కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డిని, భద్రతా వారోత్సవాల సమావేశంలో కలిసి, పలు కీలక అంశాలపై వినతిపత్రం సమర్పించారు.. ప్రధానంగా ప్రతివారం జరిగే వారాంతపు సంతలు రహదారులపైనే నిర్వహిస్తుండటం ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి పోతున్నదని ఆయన వివరించారు.. సూరారం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు, సూరారం కాలనీ రోడ్డు, సాయిబాబా నగర్‌కు వెళ్లే మార్గంలో ప్రతివారం గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర రోగుల రాకపోకల వాహనాలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు.ద రోడ్లపైనే కూరగాయల విక్రయాలతో, ట్రాఫిక్ నియంత్రించలేక పోతున్నారని,విచ్చలవిడిగా రోడ్లపై కూరగాయలు, పండ్లు విక్రయించడం వల్ల రహదారి వెడల్పు తగ్గిపోవడం, వాహనాలు, పాదచారులు ఎక్కడికక్కడ రోడ్లపైనే నిలిచిపోయి, ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని రవిందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.. నిత్యం చిన్నపాటి ప్రమాదాల తోపాటు, అత్యవసర పరిస్థితుల్లో, అటుగా అంబులెన్స్ వచ్చిందా ఇక అంతే సంగతులు అంటూ ప్రమాదాల స్థాయిని ఏసిపికి తెలియజేశారు..

## రహదారిపై సంతతో పాటు.. శాశ్వత మార్కెట్..

సూరారం క్రాస్ రోడ్డులో రద్దీ సంగతి తెలిసిందే..! దీనికి తోడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుండి సూరారం విలేజ్‌కి వెళ్లేదారి మియాపూర్ హైవేను కలిపే 100 ఫీట్ల హెచ్ఎండిఏ రోడ్డులో, వారానికోసారి ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు,పాదచారులు నరకం చూస్తున్నారు.. సూరారం వెళ్ళేదారిలో ఉన్న పెద్దచెరువు కట్టుకాలువపై ఉన్నఅబశ్రీశ్రీబ్రిడ్జ్ విశాలంగా ఉన్నప్పటికీ..! స్థానిక "చోటా మోటా" నాయకుల పెత్తనంతో బ్రిడ్జ్‌కి ఇరువైపులా శాశ్వత కూరగాయల మార్కెట్‌తో పాటు, ప్రతీ శనివారం వారంతపు సంత నిర్వహణతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులు త్వరితగతిన ట్రాఫిక్ జామ్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు, రహదారిపై ప్రయాణించే వాహన దారులు కోరుతున్నారు.. సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నుండి, సూరారం గ్రామానికి వెళ్ళేదారిలో లక్ష్మినగర్ వరకు, వారాంతపు సంత విస్తరించడం.. ట్రాఫిక్ సమస్యల తలెత్తుతున్నాయి.. బ్రిడ్జ్‌పై శాశ్వత మార్కెట్ దుకాణాలను తొలగించాలని, పలువురు కోరుతున్నారు..

## రహదారుల ఆక్రమణతో.. వ్యాపారాలు నియంత్రించాలి..

బస్తీకో వారాంతపు సంతల నిర్వహణ, కాలనీల ప్రజలకు, కూరగాయలు మొదలుకొని, పలు కిరాణా సంబంధిత వస్తువులు అందుబాటులోకి వస్తున్నప్పటికీ.. ఈ షాపుల నిర్వహణ రహదారులను నిర్భంధించి, ప్రమాదాలకు దారితీసే విధంగా తయారయ్యాయని.. సామాజిక వేత్త రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.. అందుకే వారాంతపు సంతలకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించి, రహదారులపై వ్యాపారాలు పూర్తిగా నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.. దీనికి తోడు సైలెన్సర్ లేని బైకులు, శబ్ద కాలుష్యంతో ప్రజలకు నరకం చూపించే పోకిరీల బెడద కూడా తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.. ఇలాంటి శబ్దాలు బరించలేక, వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, భయాందోళనకు గురై, కొందరు ఆసుపత్రుల పాలవుతున్న పరిస్థితి నెలకొందని వివరించారు.. అదేవిధంగా నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కుతూ రోడ్లపై తిరుగుతున్నాయని, అటువంటి వాహనాలను వెంటనే సీజ్ చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డిని కోరారు..

# అక్కర్లేనివి మంటల్లో.. ఆనందాల భాగ్యాల్లో

నిజమైన మార్పు కోసం కొన్ని అలవాట్లను వదిలేయడం అత్యంత కీలకం. అలాంటివాటితో కూడిన ఈ కింది జాబితాలో మనకెన్ని వర్తిస్తాయో... వాటిలో ఏవి వదలాలో చూద్దామా?

**పోలికలు**

చాలామందికి ఇతరుల జీవితాలతో తమ జీవితాన్ని తూకం వేసే అలవాటుంటుంది. అన్ని విషయాల్లో వారికంటే ఉన్నత స్థానంలో ఉండాలని ఆరాటపడుతుంటారు. దీనికి ఏమాత్రం భిన్నంగా జరిగినా ఓర్చుకోలేరు. దీంతో మనశ్శాంతి దూరమవుతుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. అందుకే ఇతరుల తో పోల్చుకోవడాన్ని మానేద్దాం. శాంతిని చంపే ఈ అలవాటును వదిలేద్దాం!

**మనల్ని మనమే తక్కువ చేసుకోవడం**

మనలోని శక్తిని మనమే చిన్న చూపు చూస్తాం. 'నేను చేయలేను' అంటూ ప్రయత్నానికి ముందే ఓటమిని అంగీకరిస్తాం. మనవల్ల కాదంటూ చేతులెత్తేస్తాం. అయితే మన మాటలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రతి మనిషిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇలా మనల్ని మనం తక్కువ చేసుకోవడం వల్ల ఎన్నో అవకాశాల్ని కోల్పోయి ఉంటాం. ఇక నుంచి అవకాశాలకు మాటలతో అడ్డుకట్ట వేయడం మానేద్దాం.

**ఆలస్యం..విషం**

చిన్న చిన్న పనులను సైతం వాయిదా వేసేవారెందరో. ఈ అలవాటు అవకాశాలను మింగేస్తుంది. వాయిదా వేసే చిన్న పని కూడా తర్వాత భారంగా మారుతుంది. ఒత్తిడిని పెంచుతుంది. అందుకే ఈ ధోరణికి స్వస్తి పలుకుదాం.

**అంత భయమెందుకు..?**

రేపు ఏం జరుగుతుందో, అనుకున్న పని అవుతుందో లేదో.. ఇలా మనల్ని వేధించే ప్రశ్నలెన్నో. కలిగించే భయం ఎంతో. రాని సమస్యలకు పరిష్కారాలు వెతికే క్రమంలో మనసు అలసిపోతుంది. శక్తీ వృథ అవుతుంది. ప్రతికూల ఆలోచనలతో గందరగోళానికి గురై ప్రస్తుతాన్ని ఆస్వాదించలేం. అందుకే రేపు మరింత బాగుంటుందన్న ధైర్యంతో ముందడుగు వేద్దాం!

**శక్తికి మించి సర్దుకుపోవడం**

మన శక్తిని పీల్చేసే బంధాలుంటాయి. మన ప్రేమను అభిమానాన్ని వారి అవసరాలకోసం ఉపయోగించుకునే మనుషులుంటారు. బంధం పేరుతో భరించలేని బాధనిచ్చేవారుంటారు. మనల్ని ఎప్పుడూ తక్కువ చేసి మాట్లాడతారు. ఇలాంటి బంధాలను వదిలేద్దాం. ఇది స్వార్థం ఏమాత్రం కాదు. బంధంలో శాంతి, ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం లేకుంటే వాటి నుంచి వీలైనంత త్వరగా బయటపడండి.

**గతంలో జీవించడం**

చాలామంది గతాన్ని తలుచుకుంటూ కుమిలిపోతుంటారు. ఆ బాధను మనతోనే మోసుకుంటూ వెళ్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా అది మన సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గతం ఒక పాఠం. అది మంచిదైనా.. చెడ్డదైనా.. అంగీకరిద్దాం. దాన్ని వదిలేసి ముందుకెళదాం.

**నమ్రత ముఖ్యం...**

అహంకారం మనల్ని ఒంటరిని చేస్తుంది. నేర్చుకునే తలుపుల్ని మూసేస్తుంది. . అన్నీ నాకే తెలుసు అనే అహంకారం ఏమాత్రం మంచిది కాదు. అందుకే ఎదుటివాళ్లు చెప్పింది వినడం అలవర్చుకుందాం. ఎదుటివారి తెలియనితనాన్ని అవహేళన చేయకుండా గౌరవంగా అంగీకరించే నమ్రత అవసరం.

**సమయాన్ని వృథ చేయడం**

మన సమయం బ్యాంకులో డబ్బులాంటిదే..! డబ్బు పోతే తిరిగి సంపాదించవచ్చు. కానీ గడిచిన కాలం వెనక్కిరాదు. సమయం విలువైంది. అది తెలిసిన వారు విజేతలవుతారు. గతంలో ఎంతో సమయాన్ని వృథ చేసి ఉంటాం. ఇకపై ఈ తప్పును పునరావృతం చేయొద్దు. ప్రతి నిమిషాన్నీ మన అభివృద్ధికి ఉపయోగపడేలా చూసుకుందాం. ప్రతి క్షణాన్ని అందివచ్చిన అవకాశంగా చూద్దాం!

**ఆ నిర్ణయాలు...**

జీవితంలో చాలా నిర్ణయాలు ఆలోచన లేకుండా, ఆ క్షణంలో వచ్చిన భావోద్వేగాల ఆధారంగా తీసుకుంటుంటాం. తాత్కాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు మంచిది కాదు. ఆవేశంలో తీసుకునే ఆ నిర్ణయాలు.. జీవితాన్ని అతలాకుతలం చేయొచ్చు. ఇది పశ్చాత్తాపాన్ని మిగుల్చుతుంది. కాస్త సమయం తీసుకుని నిర్ణయం తీసుకోవడం చాలా మేలు చేస్తుంది. మౌనంలో ఆలోచించి తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిస్తాయి.

**సాకులు చెప్పడం**

సాకులు చెప్పడం అంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే. ఇవి మన కాలాన్ని వృథ చేస్తాయి. ఒకపనిని చేయలేనని చెప్పే బదులు.. ఎందుకు చేయలేను, ప్రయత్నిస్తాను అంటూ మనల్ని మనం మోటివేట్ చేసుకుందాం. పనుల నుంచి తప్పించుకోవడం మానేద్దాం. బాధ్యతలు తీసుకుందాం. ఈ లక్షణం మనకు ఎన్నో అవకాశాలను తెచ్చిపెడుతుంది. చిన్న ప్రయత్నమైనా.. పెద్ద మార్పును తెచ్చిపెడుతుంది.

# భూసేకరణ వేగంగా పూర్తి చేయండి

- 3 పేజి తరువాయి


పంపులు, సదర్మాట్ బ్యారేజీ వివరాలపై ఆరా తీసినట్టు సమాచారం. వీటితోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలోని చిన్నకాళేశ్వరం ఎత్తిపోతలపైనా సమీక్షించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరావాస డిజైన్లను త్వరగా పూర్తిచేసి, వాటిని కేంద్ర జల సంఘానికి పంపించి ఆమోదం తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో భూసేకరణ ప్రక్రియ పురోగతి ఎలా ఉందని అడిగారు. ఏయే ప్రాజెక్టుల కింద ఏ మేరకు భూసేకరణ చేయాలో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

# పౌరహక్కుల పరిరక్షకులు దేశద్రోహులా: ప్రొ.హరగోపాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** : పౌరహక్కుల పరిరక్షకులు దేశద్రోహులు ఎలా అవుతారని ప్రొఫెసర్ హరగోపాల్ ప్రశ్నించారు. ప్రజల కోసం, వారి హక్కుల పరిరక్షణకు పనిచేసే పౌరహక్కుల సంఘ ప్రతినిధులకు రక్షణ, గౌరవం కల్పించాల్సిందిపోయి వారిపై దేశద్రోహం కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. మతోన్మాదం నశించాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ జరగాలని కోరడం దేశద్రోహమెలా అవుతుందన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని న్యూస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొ.హరగోపాల్ మాట్లాడారు.పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ 20వ రాష్ట్ర మహాసభల సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన బ్యానర్లలో దేశ చిహ్నా గౌరవానికి భంగం కలిగించారంటూ సంఘం ఏపీ ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్యపై, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడిపై దేశద్రోహం కేసులు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. సాక్ష్యాలు లేకుండానే గాదె ఇన్నయ్యను అరెస్టు చేశారని... ఇప్పుడు సాక్ష్యాల కోసం ఆయన ఇంటిపై, అనాథశ్రమంపై ఎన్ఐఏ దాడులు నిర్వహించి భయానక వాతావరణం కల్పించడం దారుణమన్నారు.పౌరహక్కుల సంఘం(సీఎల్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. పౌరహక్కుల సంఘం కార్యకర్తలపై ఉపా కేసులు పెట్టి జైళ్లకు పంపినా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాసంఘాల నేతలతో కలిసి ఉద్యమం చేపడతామని చెప్పారు. సమావేశంలో సీఎల్‌సీ ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గుంటి రవి, సహాయ కార్యదర్శులు మదనకుమారస్వామి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలోకి హరీష్ రావు!! ఖండించినబీ ఆర్ఎస్



హైదరాబాద్ పెన్ పవర్: గులాబీ పార్టీ అగ్రనేతల్లో ఒకరైన హరీష్ రావు కమలం గూటికి చేరతారని సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు కావాలనే చేస్తున్న ఇలాంటి చిల్లర ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మవద్దని తెలిపింది. మనందరి ముందున్న ఒకే లక్ష్యం బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమని, కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడడమే మన తక్షణ కర్తవ్యమని పేర్కొంది.అందరం ఐక్యంగా నిలబడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెబుతూ.. జై తెలంగాణ జై కేసీఆర్ అంటూ అని ట్వీట్ చేసింది. కాగా సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవల అమిత్ షాను కలిశారని.. 17 మంది గులాబీ పార్టీ ఎమ్మెల్యేలతో త్వరలోనే బీజేపీలోకి చేరతారని సోషల్ మీడియాలో, పలు వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం జరిగింది.

## రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలతో మూడు రోజుల పాటు సంక్రాంతి వైభవం కొనసాగుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లెలన్నీ రంగవల్లులు, గొబ్బెమ్మలతో కళకళలాడుతూ ప్రకృతి రమణీయతను సంతరించుకుంటాయని కేసీఆర్ తెలిపారు. సంక్రాంతి శోభతో రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయని అన్నారు.దక్షిణాయనం నుంచి ఉత్తరాయనానికి సూర్యుడు ప్రవేశించే మకర సంక్రాంతి పర్వదినం హిందూ శాస్త్ర పురాణాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉందని కేసీఆర్ తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన వ్యవసాయాభివృద్ధిని ఈ సందర్భంగా స్మరించుకున్న ఆయన, రాష్ట్ర వ్యవసాయ రంగం మరింత పుంజుకుని రైతాంగ సంక్షేమం తిరిగి గాడిన పడాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సంతోషంగా వర్ధిల్లాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

## కొత్త కాంతులను మోసుకొచ్చే సంక్రాంతి కావాలి..
## తెలుగు ప్రజలకు సీఎం రేవంత్ విషెస్



హైదరాబాద్ పెన్ పవర్: తెలుగు ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఇవాళ ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. భోగ భాగ్యాలను ప్రసాదించే భోగి, కొత్త కాంతులను మోసుకొచ్చే సంక్రాంతి పండుగలను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకం రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి చేరాలనేదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులు, సామాన్యుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.తెలంగాణ రాష్ట్రం కేవలం వ్యవసాయంలోనే కాకుండా.. పరిశ్రమలు, ఉత్పత్తి, సేవా రంగాల్లో కూడా తిరుగులేని పురోగతిని సాధిస్తుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌ను సాకారం చేసి, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన వివరించారు. ఇక తెలుగు సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించేలా ప్రజలందరూ ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం కోరారు. ముఖ్యంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా పతంగులు ఎగురవేసే సమయంలో పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలకు తావులేకుండా పండుగను ఆస్వాదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## కూకట్‌పల్లి పరిధిలో భారీ అగ్ని ప్రమాదం



హైదరాబాద్ పెన్ పవర్: కూకట్‌పల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఓ గ్యాస్ రీ-ఫిల్లింగ్ సెంటర్‌లో మంగళవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. రీఫిల్లింగ్ ప్రక్రియ జరుగుతున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనలో సుమారు ఎనిమిది గ్యాస్ సిలిండర్లు పేలినట్లు తెలుస్తోంది. పేలుళ్లతో పాటు భారీగా మంటలు ఎగిసి పడటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజిన్లు ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రస్తుతం ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది.

# భోగిపండ్లు ఎందుకు పోస్తారు?



హైదరాబాద్ పెన్ పవర్: సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే పుణ్యకాలం కేవలం కాల మార్పు మాత్రమే కాదు.. అది మన సంస్కృతికి చిహ్నం. ధాన్య రాశులు ఇల్లు చేరి.. రైతన్నల సంబరం అంబరాన్నంటే సమయం. సంక్రాంతి పండుగ(ఎఅఓఖితీ ఖిఅఏతిఖితీఆ టవర్‌అబఖిశ్రీ)లో మొదటిదైన భోగి(దీవ్వశ్రీవ్ఞఆ ఖీవర్‌అబఖిశ్రీ) అత్యంత విశిష్టమైంది. భోగి మంటలు, భోగిపండ్లు మనసును పరవశింపజేస్తాయి. భోగి అంటే అనుభవించడం అని అర్థం. ఈ రోజున ఇంద్రుడిని పూజిస్తారు. కాలానికి తగ్గట్టు వర్షాలు కురిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తారు.

**భోగి విశిష్టత?**

తెల్లవారుజామున భోగి మంటలు వేయడం ఆచారం. చీకటిని చీలుస్తూ ఆకాశమంత ఎత్తుకు లేచే అగ్నిశిఖలు కొత్త ఆశలను చిగురింపజేస్తాయి. చలిని తరిమేస్తాయి. ఆవుపేడతో చేసిన పిడకలతో భోగిమంటలు వేయడం ద్వారా వాటి నుంచి వచ్చే పొగ గాలిలోని సూక్ష్మజీవులను నశింపజేసి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. అలాగే ఇంట్లో విరిగిపోయిన చెక్కసామాను కూడా మంటల్లో వేస్తారు. ఇలా చేయడంలో.. మనలోని వెనకబడిన ఆలోచనలు, అభివృద్ధిని ఆటంకపరిచే అలవాట్లు, కోపం, ద్వేషం, స్వార్థం, కపటం వంటి మాలిన్యాలను దహింపచేయాలని, తద్వారా సర్వ శుభాలూ చేకూరతాయనేదే ఈ పండుగ ఆంతర్యం. 'మనలో, మనచుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించి కొత్త వెలుగులకు స్వాగతం పలకడమే భోగి' అని పండితులు నిర్వచిస్తుంటారు.

**భోగిపండ్లు వెనుక ఆంతర్యం తెలుసా?**

భోగి రోజు సాయంత్రం భోగిపండ్ల వేడుక ఆనవాయితీ. రేగుపండ్లు, చిల్లర నాణేలు, అక్షతలు, పూలరేకులు కలిపి పిల్లల తల మీద పోసే ఈ ఆచారం చిన్నారులకు రక్షణ కవచం. బంధుమిత్రులను పిలిచి.. పిల్లలకు హారతిచ్చి, దిష్టి తీసి, ఆశీస్సులనందిస్తారు. రేగుపండును బదరీ ఫలం అంటారు. ఇది విష్ణుమూర్తికి ప్రీతికరమైనది. ఈ పండ్లు తల మీద పోయడం వల్ల వారికి దృష్టి దోషాలు తొలగుతాయని, శ్రీమన్నారాయణుడి కృప కలుగుతుందని విశ్వసిస్తారు. ఈ ఆచారం బాలల్లో అందరూ కలసి మెలసి ఉండాలనే ధోరణిని, సానుకూల దృక్పథాన్ని అలవరుస్తుంది. ప్రేమానురాగాలను పెంచుతుంది. భోగిపండ్లు తలమీద పోయడం వెనక ఓ ఆంతర్యముంది. పురాణాల ప్రకారం శివుడికోసం నరనారాయణులు బదరీ వనంలో తపస్సు చేశారట. వారి తపస్సుకు మెచ్చి దేవతలు బదరీ ఫలాలు అంటే రేగుపండ్లనే వర్షంలా కురిపించారు. పిల్లలను ఆ నారాయణుడిలా భావించి, సంక్రాంతి ముందురోజు 'భోగిపండ్లు' పేరుతో ఇలా రేగుపండ్లను పోసే సంప్రదాయం వచ్చిందంటారు. పిల్లలు పుట్టినప్పుడు మాడు మెత్తగా ఉంటుందని తెలుసు కదా! దాన్ని బ్రహ్మరంధ్రంగానూ భావిస్తారంతా. రేగుపండ్లు తలమీద పోసినప్పుడు వాటి నుంచి వచ్చే సువాసనలు దాన్ని ప్రేరేపితం చేస్తాయట. తద్వారా జ్ఞానం పెరుగుతుంది, ఆరోగ్యంగా జీవిస్తారని నమ్మకం. ఎర్రగా, గుండ్రంగా ఉండే రేగిపండ్లను సూర్యుడికి ప్రతీకగా చెబుతారు. ఇవి ఆరోగ్యకారకం కూడా. బొమ్మల కొలువులతో సందడి చేస్తారు. గోదాదేవి శ్రీహరిని భర్తగా పొందిన శుభదినం కనుక దేవాలయాల్లో గోదా శ్రీరంగనాథుల కల్యాణం జరిపిస్తారు. శాస్త్రీయంగా చూస్తే.. రేగుపండ్లలో సి-విటమిన్ అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధకతనూ జీర్ణశక్తినీ పెంచుతుంది. ఆకర్షించే రంగుతో తెలిసీ తెలియక పిల్లలు వీటిని నోట్లో పెట్టుకున్నా ఆరోగ్యానికి మంచిదే. 'దీర్ఘాయుష్షు కలకాలం సంతోషంగా జీవించు' అని మనసారా మన బిడ్డను నలుగురూ దీవిస్తుంటే అదో ఆనందం కూడా.

# బతుకమ్మ కుంటలో ఎగిరిన పతంగి



హైదరాబాద్ పెన్ పవర్: అంబర్ పేటలోని బతుకమ్మకుంటలో ఎగిరిన పతంగులు ఇంద్రధనుస్సు తలపించాయి. ఒకదానితో ఒకటి పోటీ పడి నింగివైపు దూసుకెళ్లిన పతంగులను చూసి పిల్లలు కేరింతలు కొట్టారు. బతుకమ్మకుంట చెంత స్థానికులు ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్లో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ పాల్గొన్నారు. పార్లమెంట్ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంత రావుతో కలసి హైడ్రా కమిషనర్ గాలిపటాలు ఎగురవేశారు. దీంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఆక్రమణలు తొలగించి హైడ్రా రూపొందించిన బతుకమ్మ కుంటతో ఇక్కడ వాతావరణం మారిపోయిందని చెబుతూ స్థానికులు మిఠాయిలు తినిపించుకున్నారు. మహిళలతో పాటు స్థానికులు హైడ్రా కమిషనర్ ను కలసి బతుకమ్మ చెరువును పునరుద్ధరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉదయం, సాయంత్రం చెరువు చుట్టూ వాకింగ్ చేస్తున్నామని తెలిపారు. మా ఆరోగ్యాలు మెరుగవుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి, హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

**సౌకర్యాలు పెంచుతాం..**


చెరువు చెంత మహిళలు, చిన్నారులు వినియోగించేలా వ్యాయామ పరికరాలను సమకూర్చుతామని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. వృద్ధులు సేదదీరేలా మరిన్ని కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ఇక్కడ సెక్యూరిటీ సిబ్బందికి కూడా విశ్రాంతి గదులు నిర్మిస్తామన్నారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువు చెంత స్థానికులు పెద్దపెత్తున సేదదీరడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందని అన్నారు. నగరవ్యాప్తంగా మరిన్ని చెరువుల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తలచిందన్నారు. మొదటివిడత హైడ్రా చేపట్టిన 6 చెరువులలో ఇప్పటికే బతుకమ్మ కుంట ప్రారంభం అవ్వగా మిగతా 5 చెరువులు ఒకటి రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయన్నారు. మరో 14 చెరువులు ఈ ఏడాది కొత్తగా చేపడుతున్నామన్నారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత పండగ వాతావరణం నెలకొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ ఎంతో సాహసోపేతంగా చేస్తోందన్నారు. ఆక్రమణలు తొలగించి చెరువులను అభివృద్ధి చేయడం సాధారణ విషయం కాదన్నారు. తెలంగాణ ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ గారు, హైడ్రా అధికారులు తిరుమల్, ఉమామహేశ్వర రావు ఇన్స్పెక్టర్ బాలగోపాల్, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జనవరి 20న మరో పోరాటానికి సిద్ధమైన టీజీఎస్ఆర్టీసీ.. కార్మికులకు జేఏసీ పిలుపు



హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఆర్టీసీ కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎస్.కమ లాకర్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, బి.యాదగిరి అన్నారు. మంగళవారం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జేఏసీ అత్యవసర సమావేశం జరిగింది. గత ప్రభుత్వం అవలంబించిన విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అవలంబిస్తోం దని, ఎన్ని సార్లు ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ పరిష్కరించేవరకులో తగిన శ్రద్ధ చూపకపోవడంతోనే తాము పోరాటాలు చేయాల్సి వస్తోందని జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి గత ఏడాది మేడే సందర్భంగా స్పందించి ఆర్టీసీ కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నామని బహిరంగంగా ప్రకటించి 7 నెలలు కావస్తున్నా ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించలేదని విమర్శించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనగా మరో పోరాటానికి జేఏసీ శ్రీకారం చుట్టిందని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం నుంచి 19వ తేదీ వరకు పోస్ట్ కార్డు ఉద్యమం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. జనవరి 20న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు అందరూ ఎర్ర బ్యాడ్జీలు (రిబ్బన్లు) ధరించి పోరాట దినం పాటించాలని పిలుపునిచ్చారు. జేఏసీ చేపట్టిన ఈ ఉద్యమ కార్యాచరణను కార్మిక వర్గమంతా ఐక్యంగా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జె.రాఘవులు, కె.రామిరెడ్డి (ఈయూ), కోశాధికారి బి.యాదయ్య, సి.సత్తయ్య, ఎం.హెచ్.అలీ, బుద్ధ విశాల్, జి.రాములు (బీకేయూ), రాంచందర్, బి. శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ టీ, బీటీ విత్తనాలు కొనుగోలు చేస్తే అనేక నష్టాలు తప్పవు : రైతు కమిషన్



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో రైతులను మోసం చేసేందుకు పత్తి విత్తన కంపెనీలు విచ్చల విడిగా పుట్టగొస్తున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతు కమిషన్‌చైర్మన్ కోదండరెడ్డి కోరారు. పత్తి విత్తనాలు చాలా రకాల ఉన్నాయని, వాటిలో బాగా పండే విత్తనాలు కొనుగోలు చేయాలని, నాసిరకం విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోతారని సూచించారు. మంగళవారం తమ కార్యాలయంలో మీడియా సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ పత్తి విస్తీర్ణం బాగా పెరిగిందని, ఇదే అదునుగా భావించి మల్టీనేషనల్ కంపెనీలు జోరబడి నకిలీ విత్తనాలు తక్కువ ధరకే అమ్ముతాలు చేస్తూ రైతులను అప్పుల పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వం బీటీ, హెచ్‌టీ విత్తనాలు నిషేధించిన కంపెనీలు అక్రమ సంపాదనకు తెగబడ్డాయని మండిపడ్డారు. జెన్యూ మార్పిడి విత్తనాలు భారత్ లో విస్తారంగా అమ్ముకోవాలని అప్పట్లో మల్టీ నేషనల్ కంపెనీలు ప్రయత్నం చేశాయని 2006లో తెలంగాణలో వంకాయ మీద జెన్యూ మార్పిడి అమ్మడానికి ప్రయత్నం జరిగింది. ఆ కంపెనీలు రైతులను ఏసీ బస్సుల్లో తీసుకొచ్చి వారికి అనుకూలంగా అనుకూలంగా మాట్లాడించుకుని ఇక్కడ అమ్మకాలు చేసేందుకు ఎత్తుగడలు వేస్తే ఇక్కడ ప్రభుత్వం వీటితో ప్రమాదం ఉందని నాటి మంత్రి రోశయ్య జన్యు మార్పిడి విత్తనాలు తమ రాష్ట్రంలో అవసరం లేదని అప్పటి పీఎం మన్మోహన్‌సింగ్‌కు లేఖ రాశారు. మళ్లీ నేషనల్‌కంపెనీలు రాకుండా చర్యలు తీసుకున్నారు. మహబూబ్ నగర్ జిల్లా గద్వాల ప్రాంతాల్లో పత్తి ఎక్కువ పండిస్తారని అక్కడ రైతులకు నకిలీ విత్తనాలు కంపెనీలు అంట గడుతున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా రైతులు పత్తి చేనులో కలుపు పెరగకుండా ఉండేందుకు గ్లైఫోసైట్ మందును వాడటంతో భూమి విషంగా మారుతుందన్నారు. ఆదిలాబాద్ జిల్లాల్లో అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నారని మా దృష్టికి వచ్చిందని రైతులు ఈ కలుపు మందులు వాడొద్దని విజ్ఞప్తి చేశారు. అమెరికాలో ఉండే విత్తన కంపెనీలు కూడా అక్కడే పరీక్షలు చేసుకొని అక్కడి నుంచే సర్టిఫికెట్ తెచ్చుకొని ఇక్కడి రైతులకు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రం ఐటీఎల తెచ్చిన సీడ్ డ్రాఫ్ట్ కంపెనీలకు అనుకూలంగా ఉంది. వచ్చే బడ్జెట్ సెషన్ లో బిల్లు పెట్టాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతులు నకిలీ కంపెనీల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 15 క్వారీలు మూసివేతకు టీజీపీసీబీ ఆదేశాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** చెల్లుబాటు అయ్యే 'కన్సెంట్ ఫర్ ఆపరేషన్' (సీఎఫ్‌వో) లేకుండా కార్యకలాపాలు సాగిస్తున్న 15 రాయి, సున్నపురాయి, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ క్వారీ యూనిట్లను తక్షణమే మూసివేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆదేశించింది. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఈ యూనిట్లపై గాలి కాలుష్య నియంత్రణ చట్టం1981 కింద చర్యలు తీసుకుంది. జనవరి 6, 2026న జారీ చేసిన ఆదేశాల్లో, సీఎఫ్‌వో గడువు ముగిసిన తర్వాత కూడా పనులు కొనసాగించారని, అక్టోబర్ 13, 2025న ఇచ్చిన నోటీసులను పట్టించుకోలేదని టీజీపీసీబీ పేర్కొంది. డిసెంబర్ 22, 2025న నిర్వహించిన తనిఖీల నివేదికలు, అనుమతులు లేకుండా పరిశ్రమలు నడపరాదన్న కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలను బోర్డు ప్రస్తావించింది.

**తాండూరు బెల్ట్‌లోని క్వారీలు**

వికారాబాద్ జిల్లాలో తాండూరు మండలం ఒగిపూర్, మల్కాపూర్ గ్రామాల పరిధిలోని పలువురు లైమ్‌స్టోన్ స్లాబ్ క్వారీలు ఈ చర్యల్లో ఉన్నాయి. ఖాలిక్ స్టోన్ ఇండస్ట్రీస్, ఖాజా స్టోన్ క్వారీ, సి. శమల, సి. విజయరామారావు, బ్లూ స్టోన్ పాలిషింగ్ కంపెనీ, రెడ్డి స్టోన్ ఇండస్ట్రీ, అమీనుల్లాఖాన్, టీ. ఓబులారెడ్డి, వి. శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ లియాఖత్ అలీ, వి. వెంకటకృష్ణారెడ్డి నిర్వహిస్తున్న యూనిట్లు జాబితాలో ఉన్నాయి. 0.404 హెక్టార్ల నుంచి రెండు ఎకరాలకు పైగా లీజు విస్తీర్ణాలున్న ఈ క్వారీలలో చాలా వాటి సీఎఫ్‌వోలు ఫిబ్రవరి 2024 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య గడువు తీరినట్టు బోర్డు తెలిపింది. చట్టబద్ధ అనుమతులు పునరుద్ధరించుకోకుండా సున్నపురాయి తవ్వకాలు సాగించడం గాలి, నీటి చట్టాలకు విరుద్ధమని పేర్కొంది.

**రంగారెడ్డి జిల్లాలోనూ మూసివేత**

రంగారెడ్డి జిల్లాలో కడ్తాల్ మండలం చెరికొండ గ్రామంలోని కేఎస్‌ఆర్ మైన్స్ అండ్ మినరల్స్, కర్కల్‌పహాడ్ గ్రామంలో ఏ. రాహుల్‌కు చెందిన క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ క్వారీ, తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామంలోని శ్రీ ఆలేక్య మినరల్స్‌పై మూసివేత ఆదేశాలు జారీ అయ్యాయి. వీటిలో కొన్ని యూనిట్ల సీఎఫ్‌వోలు జనవరి 2023, జూలై 2025 నుంచే గడువు తీరినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**విచారణ లేకుండానే ఆదేశాలు**

గాలి కాలుష్య నియంత్రణ చట్టం ప్రకారం అధికారాలను వినియోగించిన టీజీపీసీబీ, పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని చెబుతూ విచారణ అవకాశాన్ని మినహాయించింది. అన్ని యూనిట్లు తక్షణమే పారిశ్రామిక కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత యూనిట్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని తెలంగాణ స్టేట్ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి సూచించింది. ఆదేశాలు అందిన తర్వాత కూడా పనులు కొనసాగిస్తే గాలి చట్టం కింద న్యాయస్థానాల్లో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది.

# గెలిచే కోడి జాతకం చూసెదలా? ఇలా తెలుసుకుంటారట




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతికి కనిపించే కోడిపందేలను ఏదో తమాషాగా మాత్రం నిర్వహించరు. సీరియస్ గా తొలినుంచి దీనిని ఒక గేమ్ గా తీసుకుంటారు. పట్టుదలతో కోళ్లను పెంచుతారు. దీనికి ఒక శాస్త్రం ఉంది. దానిని అధ్యయనం చేసి ఏ కోడి గెలుస్తుందో ముందుగానే తెలుసుకుని దానపై పందెం కడతారు. అందుకే దీనికి కుక్కుట శాస్త్రం అని పిలుస్తారు. సంక్రాంతి అంటే కోడిపందేలకు ఆంధ్రప్రదేశ్ ప్రసిద్ధి. ఇటీవల కాలంలో తెలంగాణలోనూ అక్కడక్కడా ఆ సంస్కృతి కనపడుతుంది. అయితే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే కోడిపందేలకు దేశంలోనే కాదు.. విదేశాల్లోనూ ప్రసిద్ధి. సంక్రాంతి కోడిపందేల కోసం ఏడాదంతా కోళ్లను యుద్ధానికి సైనికులను సిద్ధం చేసినట్లు చేస్తారు. ఒక్కొక్కొ పందెం కోడి యాభై వేల నుంచి లక్ష రూపాయల వరకూ ధర పలుకుతుంది. లక్ష రూపాయలు పైగా

**ఏ రంగు కోడిని...**

కోడి కాళ్లకు కత్తిని కట్టి వాటిని కదనరంగంలో దించినప్పుడు వారి ముఖాల్లో ఆనందం చూడాలి. ఎంత చూసినా తనవి తీరదు. ఆ హ్యాపీ నెస్ వేరుగా ఉంటుంది. తాను ఏడాది పెంచిన కోడి యుద్ధంలో గెలిచి విజయం సాధించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇది సంప్రదాయంగా వస్తున్నదే అయినప్పటికీ అనేక సెంటిమెంట్లుకూడా కోడి పందేల విషయంలో పాటిస్తారు. కోళ్ల యజమానుల నుంచి పందెంవేసేవారు సయితం కోడి పురాణం ప్రకారం పందేలు కాస్తారు.కుక్కుటశాస్త్రంలో చెప్పిన విధంగా పందేలను కాస్తూ డబ్బులు సంపాదించుకోవాలన్నప్రయత్నం బరి వద్ద ఉన్న ప్రతిఒక్కరిలోనూ కనపడుతుంది. కోడికి వేల రూపాయల్లో ఖర్చుచేశామన్నవిషయాన్నికూడా ఆ సమయంలో మర్చిపోతారు. కానీ కోడిని పెంచడానికి పడిన శ్రమంతా ఆ ఒక్క రోజుతో మర్చిపోతారు.

**శాస్త్ర ప్రకారమే...**

కుక్కుట శాస్త్ర ప్రకారం కోడి పందెంలో రెండు అంశాలు ప్రధానమైనవి. కోడి జాతి, రెండు దానికి ఇచ్చే శిక్షణ. కోడి పుంజుల్లో తెల్ల నెమలి, కోడి నెమలి, గౌడ నెమలి, కాకి దేగ, నెమలి కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కుక్కురాయి, అబ్రాస్, ఎర్ర దేగ వంటి జాతులు ఉంటాయని పందెం వేసేవాళ్లు చెబుతారు. రెక్కల రంగు, ఇతర శారీరక లక్షణాల ఆధారంగా వీటిని రకాలుగా విభజించారు. ఏడాదికి పైగా శిక్షణ ఇచ్చిన వీరు పందెం బరిలోకి వదులుతారు. కుక్కుట శాస్త్రం ప్రకారమే ఏ జాతి పుంజును బరిలోకి దింపాలా? అన్నది నిర్ణయిస్తారు. కోళ్లకు సంబంధించి ఈ శాస్త్రం లో కోడియజమాని పేరు, జన్మనక్షత్రాలను బట్టి కోడిపుంజును ఎంపిక చేస్తారు. ఆ శాస్త్ర ప్రకారం బరిలోకి దింపితే గెలుపు తథ్యమని భావిస్తారు. ఏ రోజున ఏ పుంజు వేయాలో ఈ శాస్త్రం చెబుతుందని పందెం రాయుళ్లు చెబుతారు.

**శాస్త్రీయత లేకపోయినా...**

ఏ రోజు ఏ రంగు కోడిని వేస్తే గెలిచివస్తుందో కూడా ఆ శాస్త్రం చెబుతుందట. మూడు రోజుల పాటు సాగే ఈ పందేలలో మూడు రకాలైన కోళ్లను బరిలోకి దింపడం సంప్రదాయంగా వస్తుంది. భోగి పండగ రోజు గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు , సంక్రాంతి పండగ రోజున యాసర కాకి దేగలు, కాకి నెమళ్లు, పసిమగల్ల కాకులు, కాకి దేగలకు చెందిన పుంజులు గెలుపొందు తాయన్నది నమ్మకం చాలామందిలో కనిపిస్తుంది. అయితే కుక్కుట శాస్త్రం ఎంత మేరకు ఫలిస్తుందో చెప్పలేం. ఎందుకంటే దానికి శాస్త్రీయత లేదు. అది నమ్మకం మాత్రమే. కానీ పందెం కోళ్లను పెంచేవారు మాత్రం కుక్కుట శాస్త్రాన్ని ఖచ్చితంగా ఫాలో అవుతారు. దానిని ఫాలో కాకుంటే పందెం బరిలోకి కూడా కోడిని దించరంటే అతిశయోక్తి కాదు. అందుకే శాస్త్రం అని వారి నమ్మకమైనా.. కోడి గెలిస్తే.. శాస్త్రం గెలిచినట్లే. ఓడితే మాత్రం దురదృష్టమని అనుకోవడం పరిపాటి.

# 10 నిమిషాల్లో డెలివరీ బంద్.. కేంద్ర మంత్రి ఆదేశాలతో బ్లింకిట్ నిర్ణయం




**హైదరాబాద్ పెన్ పవర్:** అలా ఆర్డర్ చేయగానే ఇలా సరుకులు, ఫుడ్ ఇంటికి వచ్చే రోజులు పోతున్నాయి. ఇలా క్విక్ కామర్స్ కంపెనీలు తమ మధ్య ఉన్న పోటీతో గిగ్ వర్కర్ల ప్రాణాలపైకి వస్తోందనే ఆందోళనలు దేశవ్యాప్తంగా పెరుగుతున్న వేళ తాజా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

తాజాగా కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా జోక్యంతో క్విక్ కామర్స్ రంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. డెలివరీ భాగస్వాముల భద్రతను దృష్టిలో ఉంచుకుని బ్లింకిట్, జొమాటో తమ ప్లాట్‌ఫారమ్‌ల నుండి '10 నిమిషాల డెలివరీ' నిబంధనను తొలగించాయి. గత కొంతకాలంగా గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న తీవ్రమైన పని ఒత్తిడిని తగ్గించే దిశగా తీసుకున్న కీలకమైన చర్యగా ఇది నిలిచింది.తక్కువ సమయంలో డెలివరీ చేయాలనే నిబంధన కారణంగా గిగ్ వర్కర్లు ప్రాణాలకు తెగించి ట్రాఫిక్‌లో వాహనాలు నడపాల్సి వచ్చేది. కొన్నిసార్లు చాలా మంది సమానికి డెలివరీ ఇచ్చేందుకు రాంగ్ రూట్ లో వెళ్లటం, సిగ్నల్ జంపింగ్ వంటివి కూడా రిపోర్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇది అనేక ప్రమాదాలకు దారి తీయడమే కాకుండా వారి పని పరిస్థితులను దుర్భరంగా మార్చింది. ఈ ఒత్తిడికి నిరసనగా డిసెంబర్ 25, 31 తేదీల్లో లక్షలాది మంది గిగ్ వర్కర్లు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. కార్మిక సంఘాలు, గిగ్ వర్కర్ల సమాఖ్య ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర మంత్రి రంగంలోకి దిగారు. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ, జొమాటో ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో, డెలివరీ డెడ్ లైన్ టైమింట్స్ తొలగించాలని కేంద్ర మంత్రి ఆదేశించిన సంగతి తెలిసిందే.

మంత్రి ఆదేశాలకు సానుకూలంగా స్పందించిన బ్లింకిట్.. తన బ్రాండ్ ట్యాగ్‌లైన్‌ను వెంటనే తొలగించింది. గతంలో "10 నిమిషాల్లో 10 వేల ఉత్పత్తులు" అని ఉన్న ప్రకటనను,.. ఇప్పుడు "మీ ఇంటి వద్దకు 30 వేలకు పైగా ఉత్పత్తులు" అని మార్చేసింది కంపెనీ. డెలివరీ డెడ్‌లైన్ ఒత్తిడిని తొలగించడం ద్వారా వర్కర్ల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని కంపెనీలు భరోసా ఇచ్చాయి. జెప్టో, స్విగ్గీ వంటి ఇతర సంస్థలు కూడా ఇదే బాటలో నడవనున్నాయి. సోషల్ మీడియా ప్రకటనల నుండి కూడా డెలివరీ సమయాన్ని తొలగించేందుకు కంపెనీలు అంగీకరించాయి. ఈ నిర్ణయం గిగ్ వర్కర్ల సంక్షేమానికి, ఆరోగ్యానికి ఎంతగానో ముఖ్యమైనదిగా నిపుణులు చెబుతున్నారు.

## పీఎఫ్ పెన్షనర్లకు శుభవార్త: రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికేట్




**హైదరాబాద్ పెన్ పవర్:** పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త అందించింది. పెన్షన్ పొందేందుకు ప్రతి ఏటా సమర్పించాల్సిన డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ ప్రక్రియను ఇకపై రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగానే మీ ఇంటి వద్దే పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సహకారంతో ఈ ఉచిత డోర్‌స్టెప్ సేవలను ప్రారంభించింది.

**ఇంటికే పోస్ట్‌మ్యాన్:**

చాలా మంది వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న పెన్షనర్లు బ్యాంకులకు లేదా ఈపీఎఫ్ఓ కార్యాలయాలకు వెళ్లడం కష్టంగా మారుతోంది. స్మార్ట్‌ఫోన్ వాడటం తెలియని వారికి కూడా ఇది ఇబ్బందిగా ఉంది. ఇలాంటి వారి కోసం పోస్ట్‌మ్యాన్లు నేరుగా మీ ఇంటికే వస్తారు. మీ వద్ద ఉన్న ఆధార్ కార్డ్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ వివరాలను పరిశీలించి.. ఫేస్ అథెంటికేషన్, బయోమెట్రిక్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్‌ను అక్కడికక్కడే అప్‌లోడ్ చేస్తారు.

గతంలో ఈ సేవలకు కొంత ఛార్జీ వసూలు చేసేవారు. కానీ మార్చిన రూల్స్ ప్రకారం.. పెన్షనర్లు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఆ ఛార్జీలను ఈపీఎఫ్ఓ నేరుగా పోస్టల్ శాఖకు చెల్లిస్తుంది. 5 ఏళ్ల కంటే ఎక్కువ కాలంగా పెన్షన్ నిలిచిపోయిన వారికి లేదా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించని వారికి దీని కింద ఫస్ట్ ప్రయారిటీ ఉంటుందని ఈపీఎఫ్ఓ సంస్థ వెల్లడించింది. మీరు కూడా ఈ సర్వీస్ పొందాలనుకుంటే ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్ 033-22029000 కు కాల్ చేసి ఇంటికి రావాలని కోరొచ్చు. ఒకవేళ పెన్షనర్ మరణించి ఉంటే.. ఆ వివరాలను కూడా డాక్ సేవకులు నమోదు చేసి, చట్టపరమైన వారసులకు పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటారు. ఈ మార్చి 2026 నాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను పూర్తి చేయాలని ఈపీఎఫ్ఓ లక్ష్యంగా పెట్టుకుంది.

## దుబ్బాక మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. గతంకంటే దుబ్బాకలో కాంగ్రెస్ జోష్ కనిపిస్తోంది..ఆ ప్రాంతంలో మెజార్టీ సర్పంచులను కాంగ్రెస్ గెలుచుకుంది.. అదే జోష్ లో మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధించి దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. కాంగ్రెస్ ప్రభుత్వంలో దుబ్బాకలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.15కోట్లతో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలకు రూ. 50లక్షల చొప్పు న నిధులు కేటాయించామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు మంత్రి వివేక్. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నాం.. అర్హత కలిగి ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేశామన్నారు. రైతులకు 2లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్నారు.రుణమాఫీ కాని వారు ఎవరైనా ఉంటే వారి పేర్లు ఇస్తే రుణమాఫీ చేయిస్తానని హామి ఇచ్చారు. గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను ఏనాడు పట్టించుకోలేదు.. పదేళ్లు డబుల్ బెడ్ రూం ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తూ వచ్చారన్నారు మంత్రి వివేక్. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లు 100 ఎకరాల్లో ఫాం హౌస్ లు నిర్మించుకున్నారుగానీ పేదలను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే రాష్ట్రం వ్యాప్తంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించాం.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతోంది..ఇల్లు లేదు దరఖాస్తు చేస్తున్న ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు మంత్రి వివేక్. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం దందా చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

## నాలుగోరోజు కూడా సంక్రాంతి రష్.. కొర్లపహాడ్ టోల్ ప్లాజా దగ్గర ట్రాఫిక్ జామ్



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి సెలవులు రావడంతో పట్నం పల్లె బాట పట్టింది. శనివారం ( జనవరి 10 ) నుంచే స్కూళ్లకు సెలవులు ప్రకటించడంతో ఆదివారం వరకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. ఎల్బీ నగర్, ఎంజీబీఎస్, జేబీఎస్, శివారులోని ఉప్పల్ రింగ్ రోడ్, కూకట్‌పల్లి, ఆరంఘర్ చౌరస్తా, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, లింగంపల్లి, ఎల్బీ నగర్, దిల్ సుఖ్ నగర్ ,హయత్ నగర్ లోని బస్టాండ్లలో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.ఇక సెలవులు ప్రకటించిన నాలుగు రోజుల తర్వాత కూడా నేషనల్ హైవేలపై రద్దీ తగ్గలేదు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ ప్లాజా దగ్గర నాలుగోరోజు కూడా వాహనాల రద్దీ ఉండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.ఇప్పటికే దాదాపు 30 లక్షల మందికి పైగా ప్రయాణికులు సిటీని వదిలి ఊళ్లకు వెళ్లారని సమాచారం. టోల్ గేట్ల దగ్గర ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా నివారణ చర్యలు చేపట్టారు పోలీసులు. ప్రతి 3 సెకండ్లకు ఒక్కొక్క వాహనం కదిలేలా ఏర్పాట్లు చేపట్టారు టోల్ సిబ్బంది. టిజిఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా జనం భారీగా తరలివస్తుండటంతో ఆదివారం బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇదే అదనుగా ప్రైవేటు వెహికల్స్ భారీగా చార్జీలు పెంచి అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రయాణికులు భారీగా తరలిరావడంతో ఆయా రూట్లలో ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ ఏర్పాట్లు చేసిందని అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా వెళ్లే ప్రయాణికుల కోసం బస్సుల సంఖ్య పెంచినట్లు తెలిపారు అధికారులు.

# గ్రీన్ ల్యాండ్ స్వాధీనం కోసం వేగంగా అడుగులు.. బిల్లు పెట్టిన అమెరికా



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్ ల్యాండ్ ను స్వాధీనం చేసుకునేంత వరకు అమెరికా నిద్రపోయేటట్టు లేదు. గ్రీన్ ల్యాండ్ స్వాధీనం దిశగా అమెరికా అడుగులు ముందుకు పడుతున్నాయి అందులో భాగంగా రిపబ్లికన్ పార్టీ సభ్యుడు రాండీఫైన్ – గ్రీన్ ల్యాండ్ విలీనం– రాష్ట్రహోదా – పేరుతో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుతో గ్రీన్ ల్యాండ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ కు అవకాశం లభిస్తుందని రాండీఫైన్ పేర్కొన్నారు. అమెరికా వ్యతిరేక దేశాలు ఆర్కిటిక్ లో పట్టుసాధించే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి ప్రయత్నాలు సాగనివ్వమని తెలిపారు. ఆర్కిటిక్ లో రష్యా,చైనాను ఎదుర్కోవడానికి గ్రీన్ ల్యాండ్ స్వాధీనం చేసుకోవడం చాలా కీలకమని పేర్కొన్నారు.

**గ్రీన్ ల్యాండ్ ప్రజలు ఏమంటున్నారు ..**

గ్రీన్ ల్యాండ్ ప్రజలకు డబ్బు ఇచ్చి తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని అమెరికా ప్రణాళిక రచించింది. కానీ గ్రీన్ ల్యాండ్ నాయకులు మాత్రం అమెరికా ఆఫర్ తిరస్కరించినట్టు తెలుస్తోంది. తమ ప్రాంత భవిష్యత్తును విదేశాలు నిర్ణయించలేవని పేర్కొన్నట్టు తెలుస్తోంది. నాటో దేశాలు కూడా యూఎస్ వైఖరిపై ఆందోళనతో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన గ్రీన్ ల్యాండ్ ప్రజల్లో ఉంది.

**రష్యా, చైనాను బూచిగా చూపి..**

ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యా, చైనాలు పట్టుసాధిస్తున్నాయని ట్రంప్ చెబుతున్నారు. ఆ రెండు దేశాలను ఎదుర్కోవడానికి గ్రీన్ ల్యాండ్ స్వాధీనం కీలకమని మాట్లాడుతున్నారు. కానీ దీనిని అమెరికాలోని మరోవర్గం వ్యతిరేకిస్తోంది. జాతీయ భద్రత పేరుతో గ్రీన్ ల్యాండ్ ఆయిల్, రేర్ ఎర్త్ మెటల్స్, గ్యాస్ పై ట్రంప్ కన్ను వేశారని ఆయన వ్యతిరేకులు ఆరోపిస్తున్నారు. వెనుజులాలో కూడా ఇదే తరహా వ్యవహారం నడిచిందని చెబుతున్నారు. డ్రగ్స్ సరఫరా ఆరోపణలతో వెనుజులా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేసి, ఆదేశంలోని ఆయిల్, గ్యాస్, ఖనిజ సంసదపైన పట్టుసాధించారన్న ఆరోపణలు ఉన్నాయి.

**నాటో దేశాలు ఎలా రియాక్ట్ అవుతాయి ?**

డెన్మార్క్ , అమెరికా రెండూ నాటో దేశాలు. డెన్మార్క్ భూభాగమైన గ్రీన్ ల్యాండ్ స్వాధీనం చేసుకుంటే.. నాటో లక్ష్యం నీరుగారుతుంది. అప్పుడు నాటో దేశాలు ఎలా స్పందిస్తాయన్నది ప్రశ్న. అదే సమయంలో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన నాటో .. అమెరికా చర్యలతో కకావికలం అవుతుందా అన్న ప్రశ్న కూడా ఉంది. ఎందుకంటే, ఇతర దేశాల నుంచి రక్షణ కోసం నాటో ఏర్పడింది. ఇప్పుడు నాటో దేశాల మధ్య సమస్య వస్తే నాటోకు అర్థం ఉండదు. నాటో ఉన్నా లేనట్టే అన్న వాదన ఉంది. కాబట్టి నాటో దేశాలు ట్రంప్ చర్యలపై ఎలా స్పందిస్తారు అన్నది ఇక్కడ కీలకం.

# ఫెయిల్యూర్ ముద్ర చెరిపేసుకోవాలనుకుంటున్న కేటీఆర్ గేమ్ మొదలెట్టారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధమవుతుంది. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి షాకిచ్చే విధంగా ఫలితాలు ఉండాలని భావిస్తుంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు తమకు సానుకూలంగా ఫలితాలువస్తాయన్న ఫుల్లు కాన్ఫిడెన్స్ తో గులాబీ పార్టీ ఉంది. మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడక ముందే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ క్యాడర్ లో జోష్ నింపుతున్నారు. వచ్చేది మన ప్రభుత్వమేనని భరోసా ఇస్తున్నారు. పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలు కావడంతో పాటు ఈవీఎంలు కావడంతో ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి ప్రజల నుంచి వెలువడుతుందన్న భావనలో కారు పార్టీ నేతలున్నారు. రాష్ట్రంలో 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి.

**అన్ని మున్సిపాలిటీల్లో...**

ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు అన్ని మున్సిపాలిటీల్లో వార్డు సభ్యులుగా తమ పార్టీ వారిని ఎంపిక చేసి జాబితాను సిద్ధం చేసి పెట్టుకున్నారు. గత రెండేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు టిక్కెట్ ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది. అందుకే ముఖ్య కార్యకర్తలు, ఈ రెండేళ్ల పాటు జెండాను వదలకుండాట్టుకుని ఉన్నవాళ్లని ఎంపిక చేయాలని స్థానిక నియోజకవర్గ ఇన్ ఛార్జులకు ఇప్పటికే సమాచారం పంపారు. ఈ మేరకు జాబితాను రూపొందించి పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపాలని, ఇక్కడి నుంచి అభ్యర్థుల ఎంపిక ఉంటుందని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ ఎన్నికలను సవాల్ గా తీసుకుని ప్రతి ఒక్కరూ పనిచేస్తేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందన్న సిగ్నల్స్ కూడా హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాలకు వెళ్లాయి.

**పార్టీ గుర్తులుండటంతో...**

పట్టణ ఓటర్లు కావడంతో కేవలం డబ్బుకు ప్రలోభపడటమే కాకుండా ఆలోచించి, ప్రభుత్వ పనితీరును కూడా అంచనా వేసి ఓట్లు వేస్తారు కాబట్టి బీఆర్ఎస్ నేతలు మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎక్కువ స్థానాల్లో ఎగురవేయాలని భావిస్తున్నారు. మరొకవైపు కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికయిన తర్వాత జరుగుతున్న వరస ఉపఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు,పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలు కావడంతో ఈ ఎన్నికల్లో తన నాయకత్వం అంటే ఏంటో చూపాలని కేటీఆర్ భావిస్తున్నారు. తనపై పడిన ఫెయిల్యూర్ ముద్రను చెరిపేసుకోవాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. అందుకోసం పార్టీ నేతలతో పాటు శ్రేణులను కూడా మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. మొత్తం మీద మున్సిపల్ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయో తెలియదు గులాబీ పార్టీ నాయకత్వంలో మాత్రం భారీ ఆశలే ఉన్నట్లున్నాయి.

# పందెం కోళ్లు ఎన్ని రకాలో.. 'కుక్కుట శాస్త్రం' ఏమిటో తెలుసా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి సందడి మొదలైపోయింది. దేశవిదేశాల్లో ఎక్కడెక్కడో ఉన్నవారు సొంత ఊర్లకు చేరుకున్నారు. ఈ సమయంలో కోడి పందేళ సందడి మొదలైపోయింది. ఎక్కడికక్కడ బరులు దర్శనమిస్తున్నాయి. వాటిని రంగు రంగు కాగితాలతో, మెరుపులతో అలంకరించేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రధానంగా గోదారి జిల్లాల్లో ఈ సందడి మామూలు లేదనే చెప్పాలి! ఈ సందర్భంగా ఈ పందెం కోళ్లు ఎన్ని రకాలు.. వాటికి ఎన్ని నక్షత్రాలు ఉంటాయి.. వాటిని ఎలా పెంచుతారు.. ఏ రోజున ఏ దిక్కుకు తిరిగి కోడిని వదిలితే మంచి జరుగుతుంది మొదలైన విషయాలో ఉన్న కోడి పంచాంగం కుక్కట శాస్త్రం గురించి మొదలైన విషయాలు తెలుసుకుందాం..!

అవును... సంక్రాంతి సంబరాలు మొదలైపోయాయి. కోడి పందెంలకు బరులు సిద్ధమైపోయాయి. ఈ సందర్భంగా పందెం కోళ్లు ఎన్ని రకాలు ఉంటాయనేది తెలుసుకుందామ్..! వాటి వాటి రంగుని బట్టి వాటిని ప్రత్యేకమైన పేరు ఉంటుంది. ఇక వీటికి సంబంధించిన "కుక్కుట శాస్త్రం" లో 27 నక్షత్రాలు ఉండగా.. అందులో ఏ నక్షత్రంలోని కోడి మరే నక్షత్రంలో కోడిపై గెలుస్తుంది.. ఓడిపోతుంది.. ఏ రోజున కోడిని ఏ దిశలో ఉండి పందెం బరిలోకి వదలాలి మొదలైన లెక్కలన్నీ ఆ శాస్త్రంలో పొందు పరచబడ్డాయి. పందెం కోళ్లు దాదాపు 10 నుంచి 15 రకాలు ఉంటాయి! ఇందులో దాని రంగుని బట్టి రకరకాల జాతులుగా విభజించారు. ఆ జాతులు.. వాటి ప్రత్యేకత ఇప్పుడు చూద్దామ్..!

**కోడి పందాల రకాలు!:**

ఇక కోడి పందాలు రెండు రకాలుగా ఉంటాయి! అవి.. కత్తి పందెం, డింకీ పందెం! ఈ సమయంలో.. కత్తి పందెంకు దించాలా లేక డింకీ పందెంకు దించాలా అనేది పూర్తిగా కోడి యజమాని ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. పోటీల్లో పాల్గొనే కోడి పుంజుల కాళ్లకు కత్తులు కట్టి బరిలో దించితే దాన్ని కత్తిపందెం అంటారు. ఈ పందెంలో కత్తి దెబ్బ తట్టుకుని చివరి వరకూ ఏ పుంజు నిలుస్తుందో అదే విజేత అవుతుంది. ఈ పోటీ చాలా తక్కువ సమయమే జరుగుతుందని చెప్పొచ్చు. ఇదే క్రమంలో.. కత్తులు లేకుండా కోడి పుంజులను బరిలోకి దించితే దాన్ని డింకీ పందెం అని అంటారు. ఈ పోటీ పూర్తిగా కోడి శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. రెండూ మంచి శక్తిసామర్థ్యాలు కలిగి ఉంటే. ఒక్కోసారి ఫలితం చాలా ఆలస్యం అవుతుంటుంది. సాధారణంగా కత్తి పందెంలో పాల్గొనఏ కోళ్ల కంటే.. డింకీ పందెంలో పాల్గొనే కోళ్లు చాలా ధృడంగా ఉంటాయి!

**అత్యంత శ్రద్ధంగా పెంపకం!:**

పందెం కోళ్ల పెంపమకం అంటే సామాన్యమైన విషయం కాదు. సమయానికి నాలుగు గింజలు పడేస్తే సరిపోదు. వీటికి చిన్న సైజు మిలటరీ శిక్షణ ఇస్తారని చెప్పినా అతిశయోక్తి కాదేమో. వీటికి బలవర్ధకమైన ఆహారం తినిపించడంతోపాటు రన్నింగు, స్విమ్మింగు కూడా చేయిస్తరు. శిక్షణ అనంతరం ఒంటినొప్పులు పోయేందుకు మసాజ్ చేస్తారు. ఈ క్రమంలో తొలుత ఉదయాన్నే కోడిపుంజును పరుగెత్తించి.. అది అలిసిపోయాక నోట్లో నీరు కొట్టి కఫాన్ని బయటకు తెప్పిస్తారు. అనంతరం.. పచ్చి కోడి గుడ్డు తెల్ల సొన తినిపిస్తారు. కాసేపు విశ్రాంతి అనంతరం జీడిపప్పు, బాదం, ఎండు ద్రాక్ష, ఖర్జూరం, నల్ల జీలకర్ర – గసగసాలు – తెల్ల జీలకర్ర కలిపి దంచిన మిశ్రమాన్ని ముద్దగా చేసి తినిపిస్తారు. భోజనం అనంతరం రెండు గంటలు రెస్ట్ ఇచ్చి.. ఆ తర్వాత ఈత కొట్టిస్తారు. మసాజ్ అనంతరం రాత్రికి మళ్లీ మంచి భోజనం పెట్టి విశ్రాంతి ఇస్తారు. తక్కువలో తక్కువ వీటి ఆహారానికి ఒక్కో కోడికి వారానికి 2 నుంచి 5 వేల రూపాయల వరకూ ఖర్చవుతుంది!కుక్కుట శాస్త్రంలో కోడి పుంజులకు సంబంధించి మొత్తం 27 నక్షత్రాలు ఉంటాయి. ఇక ప్రధానంగా ఏ జాములో ఏ జాతి కోడికి విజయవకాశాలు ఎక్కువగా ఉంటాయో కూడా ఈ శాస్త్రం చెబుతోంది.

ఇందులో భాగంగా... భోగి రోజు ఉదయం 6:00 గంటల నుంచి 8:24 వరకూ కాకి, సేతు, నెమలి, నల్ల కొక్కిరాయి.. ఉదయం 8:24 నుంచి 10:48 వరకూ నెమలి, తెల్ల కొక్కిరాయి.. 10:48 నుంచి మధ్యానం 1:12 వరకూ డేగ, ఎర్ర కొక్కిరాయి, సేతు, మైల, గెరువ.. 1:12 నుంచి 3:36 వరకూ కాకి, నెమలి, నల్ల కొక్కిరాయి, నల్ల బొట్ల సేతు, మైల, డేగ.. 3:36 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నెమలి, ఎర్ర మైల.. 6:00 నుంచి మరుసటి రోజు తెల్లవారే వరకూ కాకి, నల్లబొట్ల సేతు, నెమలికి విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు! ఈ రోజు తూర్పు వైపు నుంచి పడమర వైపుకు విడిచి పెడితే విజయావకాశాలు ఎక్కువని చెబుతున్నారు!ఇక సంక్రాంతి రోజు ఉదయం 6:00 గంటల నుంచి 8:24 వరకూ డేగ, పింగళ, కొక్కిరాయి, గెరువ.. ఉదయం 8:24 నుంచి 10:48 వరకూ కాకి, నెమలి, నల్ల కొక్కిరాయి, సేతువ.. 10:48 నుంచి మధ్యానం 1:12 వరకూ నెమలి, మైల, .. 1:12 నుంచి 3:36 వరకూ పింగళ, కాకి, నల్లబొట్ల సేతు, నల్లకొక్కిరాయి.. 3:36 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నెమలి, తెల్లకొక్కిరాయి.. 6:00 నుంచి మరుసటి రోజు తెల్లవారే వరకూ డేగ, కొక్కిరాయి, ఎర్ర మైల, గెరువకు విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు! ఈ రోజు పడమర వైపు నుంచి పడమర తూర్పుకు విడిచి పెడితే విజయావకాశాలు ఎక్కువని చెబుతున్నారు!

కనుమ రోజు ఉదయం 6:00 గంటల నుంచి 8:24 వరకూ డేగ, మైల.. ఉదయం 8:24 నుంచి 10:48 వరకూ కాకి, నల్లబొట్ల సేతువ, నెమలి, నల్ల కొక్కిరాయి.. 10:48 నుంచి మధ్యానం 1:12 వరకూ నెమలి, తెల్ల కొక్కిరాయి, కాకి .. 1:12 నుంచి 3:36 వరకూ డేగ, ఎర్ర కొక్కిరాయి, మైల, గెరువ.. 3:36 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నెమలి, కాకి, నల్ల కొక్కిరాయి, నల్లబొట్ల సేతువ, మైల.. 6:00 నుంచి మరుసటి రోజు తెల్లవారే వరకూ డేగ, మైల, గెరువకు విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు! ఈ రోజు దక్షిణం వైపు నుంచి పడమర ఉత్తరం వైపుకు విడిచి పెడితే విజయావకాశాలు ఎక్కువని చెబుతున్నారు!

# ఇరాన్ తో వ్యాపారం చేస్తే.. 25 శాతం టారిఫ్



**హైదరాబాద్ పెన్ పవర్:** మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ఉంది ఇరాన్ పరిస్థితి. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పుడు తాజాగా ట్రంప్ తీసుకున్న చర్యలు మరింత ఇబ్బందికరంగా మారబోతున్నాయి. ఇరాన్ తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం సుంకం విధించినట్టు ట్రంప్ ప్రకటించారు. దీంతో ఇరాన్ కు మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇరాన్ తో చైనా, భారత్, టర్కీ, యూఏఈ, ఇరాక్ దేశాలు వ్యాపారం చేస్తున్నాయి. ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఈ దేశాలపై 25 శాతం టారిఫ్ లు ఉండే అవకాశం ఉంది.

**25 శాతం టారిఫ్ లు ..**

ఇరాన్ తో వ్యాపారం చేస్తున్న దేశాలు.. అమెరికాకు వస్తువులు ఎగుమతి చేస్తే ఆ ఎగుమతులపైన ట్రంప్ 25 శాతం టారిఫ్ విధిస్తారు. ఫలితంగా ఆయా దేశాల వస్తువుల ధరలు అమెరికాలో పెరుగుతాయి. దీంతో అమెరికన్లు ఆ వస్తువులకు బదులుగా తక్కువ ధరకు వచ్చే వస్తువులు కొనుగోలు చేస్తారు. దీంతో క్రమంగా అమెరికాకు ఎగుమతులు తగ్గుతాయి. అది వాణిజ్య లోటుకు దారితీస్తుంది. ఇప్పటికే భారత్ పై 50 శాతం టారిఫ్ విధించారు. ఇప్పుడు ఇరాన్ తో వ్యాపారం కొనసాగితే .. 50 శాతానికి అదనంగా 25 శాతం టారిఫ్ లు విధించవచ్చు.

**ఇరాన్ తో వ్యాపారం ఆగతుందా ?**

ట్రంప్ 25శాతం టారిఫ్ విధించడంతో చైనా, ఇండియా, టర్కీ, యూఏఈ, ఇరాక్ లాంటి దేశాలు ఇరాన్ తో వ్యాపారం ఆపుతాయా అన్న ప్రశ్న వినిపిస్తోంది. చైనా ఎట్టిపరిస్థితుల్లోనూ అమెరికా ఆంక్షలకు వెనక్క తగ్గదు. ఇరాన్ తో వ్యాపారం కొనసాగిస్తుందనే వాదన ఉంది. అదే సమయంలో ఇండియా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఆధారపడి ట్రంప్ టారిఫ్ లు భారత ఎగుమతులపై ప్రభావం చూపుతాయి. రష్యాతో వ్యాపారం చేయొద్దన్నా.. ఇండియా వ్యాపారం కొనసాగిస్తోంది. మరి ఇరాన్ విషయంలో భారత్ ఎలాంటి వైఖరి ప్రదర్శించబోతుందన్న చర్చ ఉంది.

**కరెన్సీ విలువ భారీ పతనం..**

13-1-2026 రోజున ఉన్న సమాచారం మేరకు ఒక అమెరికన్ డాలర్ తో దాదాపుగా 10 లక్షల ఇరాన్ రియాల్ లు కొనుగోలు చేయవచ్చు. దీనిని భారీ పతనంగా చూడవచ్చు. ఆర్థిక పతనం అంచున ఇరాన్ ఉన్నట్టు అంచనా ఉంది. ఇరాన్ ప్రభుత్వంపై ట్రంప్ సైనిక చర్య చేపడతారనే ప్రచారం ఉంది. అందుకే అమెరికా ఇరాన్ లోని తన పౌరులకు కీలక సూచన చేసింది. వీలైనంత త్వరగా ఇరాన్ వదలాలని సూచించింది. లేదంటే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపింది. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన ఉంది.

# వైసీపీ కమిటీలు...డెడ్ లైన్ ఇచ్చినా ?




**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీలో బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయాలని అధినాయకత్వం పార్టీ నేతలను కోరుతోంది. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంచార్జిలను ఎనాడో పార్టీ నియమించింది. అంతే కాదు పాతిక దాకా ఉన్న లోక్ సభ సీట్లకు కూడా ఇంచార్జిలను నియమించారు. ప్రతీ రీజియన్ కి ఒక కో ఆర్డినేటర్ ని వేశారు. అలాగే రీజనల్ స్థాయిలో వర్కింగ్ ప్రెసిడెంట్లు అని అన్ని అనుబంధ విభాగాలకు నియమించారు ఇదే స్ట్రక్చర్ తో బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయాలని అధినాయకత్వం కోరుతోంది. అయితే ఆ దిశగా యాక్టివ్ గా ఎంత మంది ఉన్నారు అన్నదే చర్చగా ముందుకు వస్తోంది.

**నర్సీపట్నం ఫస్ట్ :**

ఇక ఏపీలోనే నర్సీపట్నం నియోజకవర్గం బూత్ లెవెల్ దాకా కమిటీలు వేసి ఫస్ట్ ప్లేస్ లోకి వచ్చింది. జగన్ ఈ విషయంలో వైసీపీ నియోజకవర్గం ఇంచార్జి పెట్ల ఉమాశంకర్ గణేష్ ని అభినందించారు. ఇదే స్థాయిలో అందరూ పనిచేసి తొందరగా కమిటీల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. సంస్థాగతంగా పార్టీ పటిష్టంగా ఉంటే మిగిలిన వాటి విషయంలో దృష్టి పెట్టాలని వైసీపీ భావిస్తోంది.

**సభ్యత్వ నమోదు కూడా :**

కమిటీల ప్రక్రియ ఒకసారి పూర్తి అయితే సభ్యత్వ నమోదు ని పూర్తి చేసి ఆ మీదట బూత్ లెవెల్ నుంచి కూడా పార్టీని కదం తొక్కించాలన్నది వైసీపీ పెద్దల ఆలోచన. అయితే కమిటీలు పూర్తి చేసే పనిలో మాత్రం నేతలు ఎందుకో నెలలు గడిపేస్తున్నారు. నియోజకవర్గం మండలాలు, గ్రామాలు వార్డులు బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయాలని అంటున్నారు. వేలాది మంది క్యాడర్ కి ఈ విధంగా పదవులు వస్తాయని కూడా అధినాయకత్వం చెబుతోంది. పనిచేసే వారికి పెద్ద పీట వేయాలని కూడా సూచిస్తోంది. కానీ ఆచరణలో మాత్రం ఆలస్యం అలా జరుగుతూనే ఉంది.

**జిల్లాలలో కదలిక :**

పార్టీ అధినాయకత్వం పదే పదే సూచించడంతో జిల్లాల స్థాయిలో నాయకత్వాలు ముందుకు కదులుతున్నాయి. తమ జిల్లా పరిధిలో ఏ నియోజకవర్గంలో ఎన్ని కమిటీలు పూర్తి చేశారు ఏమిటి అన్నది సమీక్ష నిర్వహిస్తున్నారు. తాజాగా చూస్తే అటు రాయలసీమ నుంచి ఇటు గోదావరి జిల్లాల దాకా వైసీపీ ముఖ్య నేతలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం గురించే చర్చ సాగింది అని చెబుతున్నారు. కమిటీలను తొందరగా పూర్తి చేయడమే కాకుండా వాటిని డిజిటలైజేషన్ చేయాలని కూడా పార్టీ పెద్దలు సూచిస్తున్నారు.

**గుర్తింపు కార్డుతో :**

ఇక వైసీపీలో ఉన్న ప్రతీ సభ్యుడికీ గుర్తింపు కార్డుని ఇవ్వాలని కూడా నిర్ణయించారు. దాని వల్ల పార్టీలో పనితీరుని ఎప్పటికపుడు బేరీజు వేసుకుని రేపటి రోజున కార్యకర్తలను కానీ తృతీయ శ్రేణి ఆ తరువాత శ్రేణులకు చెందిన నాయకులకు అవకాశాలు ఇవ్వాలని కూడా పార్టీ భావిస్తోంది. దాంతో కమిటీల కూర్పు అన్నది ఇపుడు పెద్ద చర్చగా మారుతోంది. మరో వైపు కమిటీల ఏర్పాటు పూర్తి అయితే జగన్ జిల్లా పర్యటనలు కూడా ఉంటాయని అంటున్నారు. మరి ఎక్కడ ఆలస్యం అంటే నాయకుల దగ్గరే అని చెబుతున్నారు. కమిటీలు వేయడానికి జాప్యం ఎందుకు జరుగుతోంది ఎవరికి ఉత్సాహం తగ్గింది, అధినాయకత్వం ఆదేశాలను ఎందుకు పెద్దగా పట్టించుకోవడం లేదు అన్నదే ఇపుడు సాగుతున్న చర్చగా ఉంది.

# 'ఈ విజయం నా తల్లి పడ్డ కష్టానికి ప్రతిఫలం'.. రంజనా భావోద్వేగం!

**హైదరాబాద్ పెన్ పవర్:** మనిషికి కష్టాలు ఎందుకు వస్తాయంటే.. ఆ మనిషి జీవితంలో మరింత రాటు దేలుతాడని అంటారు! అయితే ఈ కష్టాలు వచ్చినప్పుడు చాలామంది కృంగిపోతే.. మరికొంతమంది మాత్రం నికార్సుగా నిలబడి పోరాడతారు.. పోరాడి గెలుస్తారు.. నిలుస్తారు.. వాళ్లే ఎంతో మందికి ఆదర్శంగా మారతారు. అలాంటి ఓ అమ్మాయే జార్ఖండ్ కు చెందిన రంజనా కుమారి. 9 ఏళ్ల ప్రాయంలోనే తండ్రిని పోగొట్టుకున్నా.. పేదరికంతో కొట్టుమిట్టాడినా.. పోరాడి నిలిచి గెలిచింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ గా ఎంపికైంది. అవును... కొంతమంది జీవితం పూలపై నడకలా సాగితే.. మరికొంతమంది జీవితం మాత్రం ముళ్లతో, రాళ్లు రప్పలతో నిండిన రోడ్లపై పరుగులా ఉంటుంది. ఈ రెండో కేటగిరీకి చెందిన జీవితమే రంజనా కుమారిది. హజారీభాగ్ జిల్లాకు చెందిన ఈమె 9 ఏళ్ల వయసులో ఉండగా 2013 జనవరి 1 నూతన సంవత్సర వేడుకల వేళ హోటల్ కార్మికుడైన ఆమె తండ్రి మనోజ్ కుమార్ హత్యకు గురయ్యారు. దీంతో.. ఈమె జీవితం ఒక్కసారిగా తలకిందులైపోయింది. కుటుంబానికి ఏకైక ఆధారమైన తండ్రి చనిపోవడంతో ఫ్యామిలీ పరిస్థితి దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఈ సమయంలో రంజనా తల్లి నూతన్ దేవి గుండె నిబ్బరాన్ని కోల్పోలేదు. ముగ్గురు కుమార్తెలను చదివించాలని నిర్ణయించుకుని అంగన్వాడీ కార్యకర్తగా చేరింది. ఈ సమయంలో.. కుటుంబ పరిస్థితిని అర్థం చేస్తున్న రంజన.. ఓ పక్క చదువుకుంటూనే తన వంతు సహాయం చేయాలనుకుంది. ఇందులో భాగంగా హైస్కూల్ చదువుతూ సుమారు 40 మందికి ట్యూషన్ చెప్పింది. ఆ విధంగా కుటుంబానికి ఆసరాగా ఉంటూ చరిత్రలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఈ క్రమంలో 2024లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలో



రంజనా సత్తా చాటింది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)కు ఎంపికైంది. అనంతరం.. పశ్చిమ బెంగాల్ లోని సిలిగురిలో ఏడాది పాటు కఠినమైన శిక్షణ పూర్తి చేసుకుని.. ఇటీవల జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్ లో యూనిఫాం ధరించి తల్లికి కనిపించింది. దీంతో.. తల్లి కళ్లలో ఆనందబాష్పాలు రాలాయి! ఈ సందర్భంగా స్పందించిన రంజనా... తాను మొదటిసారి ఈ యూనిఫాం ధరించినప్పుడు కళ్ల ముందు నాన్న ముఖమే కదిలింది.. ఈ విజయం నా తల్లి పడ్డ కష్టానికి ప్రతిఫలం అంటూ భావోద్వేగంతో చెప్పింది.

తన విజయం పేదరికంలో పెరుగుతున్న బాలికలకు అంకితం అని తెలిపింది. ప్రస్తుతం భారత్ పాకిస్థాన్ సరిహద్దులోని జైసల్మేర్ సెక్టార్ లో తన మొదటి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తోంది. రమజానా సక్సెస్ స్టోరీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకం కదా!!

# 400 కేజీల గోల్డ్ దోపిడీ.. 'పాజెక్ట్ 24కే' లో బిగ్ అప్ డేట్..!



**హైదరాబాద్ పెన్ పవర్:** స్విట్జర్లాండ్ లోని జూరిచ్ నుంచి 2023 ఏప్రిల్ 17వ తేదీన ఒక కార్గో విమానం టొరంటో విమానాశ్రయానికి చేరుకుంది. అందులో సుమారు 400 కిలోల స్వచ్ఛమైన బంగారం, \$2.5 మిలియన్స్ విదేశీ కరెన్సీ ఉన్నాయి. ఈ క్రమంలో విమానాశ్రయ ప్రాంగణంలోని ఒక సురక్షిత ప్రాంతానికి ఈ మొత్తాన్ని తరలించిన కొద్దిసేపటికే అది అదృశ్యం అయింది. ఎయిర్ కెనడా వ్యవస్థలను మోసం చేసి, నకిలీ పత్రాల ద్వారా పలువురు దుండగులు ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పుడో కీలక అప్ డేట్ తెరపైకి వచ్చింది. అవును... కెనడా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్నట్లుగా జరిగిన ఈ 400 కేజీల బంగారు దోపిడీ కేసు సంచలనంగా మారగా.. తాజాగా ఆ దేశ పోలీసులు ఈ కేసులో ఓ కీలక విజయాన్ని అందుకున్నారు. ఇందులో భాగంగా... 'ప్రాజెక్ట్ 24కే' పేరుతో జరుగుతున్న ఈ దర్యాప్తులో భాగంగా.. అరెసలాన్ చౌదరి (43)ని పీల్ రీజినల్ పోలీసులు అరెస్ట్ చేశారు. దుబాయ్ నుంచి వస్తున్న సమయంలో.. టొరంటో పియర్సన్ ఎయిర్ పోర్ట్ లోకి అడుగు పెట్టగానే అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడ మరో కీలక విషయం ఏమిటంటే.. ఈ కేసు దర్యాప్తు వ్యవహారం భారత్ వరకూ పాకింది. ఇందులో భాగంగా... ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సిమ్రాన్ ప్రీత్ పనేసర్ (33) ప్రస్తుతం భారత్ లో తలదాచుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఎయిర్ కెనడా మాజీ ఉద్యోగి అయిన ప్రీత్ పనేసర్.. ఎయిర్ లైన్ సిస్టమ్స్ ను మార్చడం ద్వారా ఈ కార్గో షిప్ మెంట్ ను పక్కదారి పట్టించాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో అతడు భారత్ లోనే ఉన్నాడని కెనడా పోలీసులు నమ్ముతున్నారు. వాస్తవానికి గతేడాది ఇతడిని చండీగఢ్ శివార్లలోని ఒక ఫ్లాట్ లో గుర్తించినప్పటికీ.. అతడు తప్పించుకుని పారిపోయాడు. ఈ భారీ దోపిడీకి సంబంధించి ఇప్పటి వరకు పది మందిపై ఆరోపణలు రాగా వారిలో ఎక్కువ మంది భారత సంతతి వ్యక్తులే కావడం గమనార్హం. 2024 మేలో భారత్ నుంచి కెనడాకు వస్తుండగా అర్చిత్ గ్రోవర్ అనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ఇదే సమయంలో.. పరంపాల్ సిద్ధూ, అమిత్ జలోటా, ప్రసాత్ పరమలింగం, అలీ రజా తదితరులు ఇప్పటికే అరెస్టు అయ్యారు. ఈ సందర్భంగా స్పందించిన పీల్ రీజినల్ పోలీస్ చీఫ్ నిషాన్ దురైయప్ప.. ప్రాజెక్ట్ 24కే అనేది అంతర్జాతీయ నేర ముఠాలను ఎలా అణిచివేయొచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణ అని.. ఈ కేసుతో ప్రమేయం ఉన్నవారు ఎక్కడ దాక్కున్నా, ఎంత దూరంలో ఉన్నా.. వెతికి పట్టుకుని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.

# ఇంట్రస్టింగ్ మూవ్... విజయ్ 'జన నాయగన్' కోసం రంగంలోకి రాహుల్ గాంధీ!

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడులో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఈ సారి ఎన్నికల్లో అధికార డీఎంకే, విపక్ష అన్నా డీఎంకేలతో పాటు సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) పోటీ చేయబోతోంది. ఇకపై తన జీవితం ప్రజలకు సేవచేయడానికే అంకితం అని విజయ్ ప్రకటించారు. "జన నాయగన్" తన చివరి చిత్రం అని వెల్లడించారు. అయితే జనవరి 9న విడుదల కావాల్సిన ఆ చిత్రానికి ప్రభుత్వం నుంచి సమస్యలు వచ్చాయని అంటున్నారు! ఈ సమయంలో రాహుల్ గాంధీ స్పందించారు. అవును... విజయ్ నటించిన జన నాయగన్ సినిమా విడుదల విషయం ఇప్పుడు అటు సినిమా ఇండస్ట్రీలోనూ, ఇటు రాజకీయాల్లోనూ కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమా విడుదల ఆగడాన్ని బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యగా పలువురు అభివర్ణిస్తున్నారని అంటున్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించారు.. విజయ్ కు మద్దతుగా వాయిస్ వినిపించారు. దీంతో ఈ అంశం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

'జన నాయగన్ ను నిరోధించడానికి ఐ&బీ మంత్రిత్వ శాఖ చేసిన ప్రయత్నం తమిళ సంస్కృతిపై దాడి.. మిస్టర్ మోడీ, తమిళ ప్రజల గొంతును అణచివేయడంలో మీరు ఎప్పటికీ విజయం సాధించలేరు' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. దీంతో.. ఈ విషయం ఇప్పుడు సినిమా, రాజకీయాలతో పాటు సాంస్కృతికంగానూ చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు! నేరుగా జన నాయగన్ సినిమా ఆగడాన్ని తమిళ సంస్కృతిపై దాడిగా రాహుల్ అభివర్ణించడంతో ఈ విషయం మరింత పెద్దదైందని అంటున్నారు. కాగా... 'జన నాయగన్' సమస్య సినిమా వివాదం కంటే పెద్దదిగా మారిందనే సంగతి తెలిసిందే! ఈ సినిమా సర్టిఫికేషన్ అడ్డంకులు, చట్టపరమైన పరిశీలన, దాని కంటెంట్ కు సంబంధించిన అభ్యంతరాలు, వివాదాల కారణంగా ఆలస్యమైంది. దీనిపై కోర్టులో సినిమా నిర్మాతలు, అధికారుల మధ్య వాదనలు జరిగాయి. ఈ సినిమాను కావాలనే అడ్డుకుంటున్నారంటూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ వాయిస్ ను బలంగానే వినిపించారు! తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా సినిమాలను అన్యాయంగా లక్ష్యంగా చేసుకోకూడదనే వాదనను సమర్థించారు. ఈ పరిణామాల నేపథ్యంలో.. రాహుల్ గాంధీ కూడా ఎంట్రీ ఇవ్వడంతో ఇది రాజకీయంగా మరింతగా చర్చనీయాంశం అయ్యిందని అంటున్నారు. పైగా టీవీకే తో జత కట్టాలని, అది పార్టీకి మంచి చేస్తుందని కాంగ్రెస్ లోని ఓ వర్గం పట్టుబడుతుందనే చర్చా నడుస్తుంది. విజయ్ కు ప్రత్యేకంగా యువతలోనూ, తొలిసారి



ఓటు వేసే వారిలోనూ ఫుల్ క్రేజ్ ఉందని గుర్తుచేస్తున్నారు. అయితే, కాంగ్రెస్ లోని కొంతమంది సీనియర్లు మాత్రం టీవీకేతో జతకట్టే విషయంపై ఏకీభవించడం లేదని అంటున్నారు. డీఎంకేతో ఉన్న దీర్ఘకాలిక పొత్తుకు కట్టుబడి ఉండాలని భావిస్తున్నారని అంటున్నారు. ఈ భాగస్వామ్యం చాలా సంవత్సరాలుగా రాజకీయ ప్రయోజనాన్ని తెచ్చిపెట్టిందని వారు గుర్తు చేస్తున్నారు. ఏది ఏమైనా.. జన నాయగన్ కోసం రాహుల్ కల్పించుకుని, మోడీని టార్గెట్ చేయడం మాత్రం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతుందని మాత్రం చెప్పొచ్చు!

# బాలయ్య పాట.. దేవాన్ష్ ఆట.. నారావారిపల్లెలో ఒకరోజు ముందే సందడి

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత ఊరు నారావారిపల్లెలో సంక్రాంతి సందడి నెలకొంది. కుటుంబ సభ్యులు అందరితో కలిసి రెండు రోజుల ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నారావారిపల్లెకు చేరుకున్నారు. సోమవారం రాత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులు అంతా స్వగ్రామానికి చేరుకున్నారు. చంద్రబాబు భార్య భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, ఆయన భార్య బ్రహ్మణి, చంద్రబాబు మనవడు దేవాన్ష్ నారావారిపల్లె వచ్చారు. వీరితోపాటు చంద్రబాబు వియ్యంకుడు ఎమ్మెల్యే, నటసింహం బాలకృష్ణ సతీమణి వసుంధర, బాలయ్య చిన్నల్లుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఆయన భార్య తేజస్విని కూడా నారావారిపల్లెకు వచ్చారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు అందరూ రావడంతో నారావారిపల్లెలో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి చంద్రబాబు గ్రామస్థులతో కలిసి సరదాగా గడుపుతున్నారు. సుమారు రెండు గంటల పాటు చుట్టుపక్కల గ్రామాల పిల్లల ఆటల పోటీలను చంద్రబాబు తిలకించారు. చంద్రబాబు మనవడు దేవాన్ష్ కూడా తోటిపిల్లలతో ఆడుతూ సందడి చేశాడు. ఇక దేవాన్ష్ ఆడుతుండగా, తాత బాలయ్య పాట వేసి ఉర్రూతలూగించారు. సంబరాల్లో భాగంగా గ్రామంలోని చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్



రేస్, లెమన్ అండ్ స్పూన్, కాక్ ఫైట్, త్రీలెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్ వంటి పలు క్రీడలను నిర్వహించారు. వీటన్నింటినీ సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించి సంతోషంగా గడిపారు. చిన్నారులందరితో ఫోటోలు దిగిన సీఎం చంద్రబాబు వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. దాదాపు రెండు గంటల సేపు గ్రామస్తులు, చిన్నారులతో సీఎం చంద్రబాబు గడిపారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి వారికి బహుమానాలు అందించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను అందుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఏటా సంక్రాంతి నాడు నారా, నందమూరి కుటుంబాలు నారావారిపల్లెలో సంతోషంగా గడుపుతుంటారు. ఈ పండగ సందర్భంగా గ్రామ దేవత నాగాలమ్మను ఈ ఇరు కుటుంబాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అలాగే తల్లిదండ్రుల సమాధులను సైతం చంద్రబాబు సందర్శించుకొని వారికి ఘన నివాళులు అర్పిస్తుంటారు. రాజకీయ హడావుడికి దూరంగా, గ్రామీణ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు స్థానికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అదే సమయంలో సొంతూరిలో గడిపేందుకు చంద్రబాబు చాలా ఆసక్తి కనిపించారు. భద్రతా వలయాన్ని ఛేదించుకుని గ్రామస్తులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు తమతో ముచ్చటించేందుకు అవకాశం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇక చంద్రబాబుతోపాటు మంత్రి లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణితో ఫొటోలు దిగేందుకు గ్రామస్తులు పోటీపడ్డారు.

## స్కూల్ కి వచ్చి పిల్లల్ని ఎత్తుకుపోతున్నాడు..

# బిగ్ ట్విస్ట్ ఏమిటంటే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలోని ధారవాడలో స్కూల్ పిల్లల కిడ్నాప్ కు యత్నించిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. దీంతో.. లంచ్ బ్రేక్ కాస్తా పిల్లల సెర్చింగ్ గందరగోళంతో నిండిపోయిందని అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన దుండగుడు ఇద్దరు పిల్లల్ని అపహరించుకుపోవడం చర్చనీయాంశమైంది. ఇక్కడ బిగ్ ట్విస్ట్ ఏమిటంటే.. ఊహించని రీతిగా అన్నట్లుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ పిల్లలు కిడ్నాపర్ బారినుంచి బయటపడ్డారు. అతడు పిల్లల్ని కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అవును.. కర్ణాటకలోని ధారవాడలోని కమలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడోతరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలు మధ్యాహ్న భోజనం తర్వాత తిరిగి క్లాస్ రూమ్ లోకి రాలేదు. దీంతో.. టీచర్లు, సిబ్బంది వెతకడం ప్రారంభించారు. వీరంతా ఎంత వెతికినా ఆ ఇద్దరు పిల్లలు కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులను ఆరా తీశారు. పిల్లలు ఇళ్లకు కూడా వెళ్లలేదని వారు చెప్పారు. దీంతో.. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించడం మొదలుపెట్టారు. ఆ దృశ్యాల్లో.. లంచ్ బ్రేక్ సమయంలో ఓ వ్యక్తి స్కూల్ ప్రాంగణంలోకి వచ్చి పిల్లలతో మాట్లాడినట్లుగా సీసీటీవీలో రికార్డ్ అయ్యింది. ఆ తర్వాత పిల్లలిద్దరినీ బైక్ పై ఎక్కించుకొని అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయాడు. దీంతో స్కూల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారమిచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పిల్లల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. సరిగ్గా ఇక్కడే బిగ్ ట్విస్ట్ నెలకొంది.. ఓ రోడ్డు ప్రమాదం జరిగింది.

ఇందులో భాగంగా.. దండేలీ ప్రాంతంలో పిల్లలను తీసుకెళ్తున్న బైక్ కు ప్రమాదం జరిగింది. ఈ సమయంలో అక్కడకు చేరుకున్న పోలీసులు.. ఆరాతీయగా అతడు పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో పిల్లలను కిడ్నాప్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. ధారవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని అరెస్ట్ చేసి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పిల్లల్లో ఒకరికి నిందితుడు తెలుసని, జాతర చూపిస్తానని తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

# వీధికుక్కల దాడిలో ఎవరైనా మరణిస్తే వారిదే బాధ్యత -సుప్రీం కోర్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని పలు ప్రాంతాలలో కోతుల బెడద ఏ విధంగా అయితే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందో.. అలాగే వీధి కుక్కల దాడులు కూడా అంతేవేగంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్దులపై ఈ వీధి కుక్కల దాడులు బాధిత కుటుంబాలలో విషాదాన్ని నింపుతున్నాయి. ఈ వీధి కుక్కలు వారిపై దాడి చేయడమే కాకుండా అన్యం పుణ్యం తెలియని చిన్నారుల ప్రాణాలను కూడా కబలిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వీధి కుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలించాలని కొంతమంది డిమాండ్ చేస్తుంటే.. వాటి తరపు మాట్లాడేవారు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు దేశాన్ని అట్టుడికిస్తున్న ఈ వీధి కుక్కల చర్చ ఏకంగా సుప్రీంకోర్టు మెట్లెక్కింది. ఈ విషయంపై విచారణ జరిపిన ధర్మాసనం వీధి కుక్కల పై పలు కామెంట్లు చేస్తూనే.. ఈ వీధి కుక్కల దాడిలో ఎవరైనా మరణిస్తే వారిదే బాధ్యత అంటూ తెలిపింది.

వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు రోజువారీ విచారణ కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు జనవరి 13న మంగళవారం నాటి విచారణలో కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేసి గాయపరిచినా లేదా ప్రాణాలు తీసినా ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని, అందుకు నష్టపరిహారం కూడా చెల్లించాలని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ముఖ్యంగా కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా ఆ వీధి కుక్కలను తమ ఇళ్ళకే తీసుకెళ్లాలని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ తెలిపారు. ప్రస్తుతం ఈ విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

నిజానికి గతంలో బస్ స్టాండ్ లు, క్రీడా ప్రాంగణాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, రైల్వేస్టేషన్ల నుంచి ఈ వీధి కుక్కలను తొలగించి, నిర్దేశిత కేంద్రాలకు వాటిని తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఆయా ప్రాంతాలలోకి ఈ వీధి కుక్కలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వాటిని పట్టుకున్న చోటే తిరిగి వదలకూడదు అని కూడా ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు ఈ వీధికుక్కల దాడుల అంశాన్ని సుమోటోగా సుప్రీంకోర్టు స్వీకరించి.. విచారణ చేపట్టింది. పైగా నిత్యం అధికారులు క్రమం తప్పకుండా ప్రభుత్వ ప్రజా సంస్థల ప్రాంగణాలలో కుక్కలు లేవని నిర్ధారించుకోవడానికి తనిఖీలు చేయాలి అని, ఇలాంటి చోట్ల కుక్కల దాడులు జరగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని కూడా కోర్టు అభిప్రాయపడింది. వీధి కుక్కల సమస్య చాలా తీవ్రంగా ఉందని, వీటిని బయటకు వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. ముఖ్యంగా వీటిని తరలించడాన్ని అడ్డుకునే వ్యక్తులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇక అలా నిత్యం జరుగుతున్న దాడులను తగ్గించడానికి ప్రతిరోజు విచారణ జరుగుతున్న నేపథ్యంలోనే ఇప్పుడు సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేసింది. ఇకనైనా ప్రజలు, అధికారులు అప్రమత్తమయి ఇకపై వీధి కుక్కల దాడులు జరగకుండా చూడాలని కూడా బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# టీసీఎస్‌కు 'కార్మిక' కష్టాలు
# క్షీణించిన మూడో త్రైమాసిక లాభం

**కొత్త లేబర్ కోడ్ అమలు ప్రభావం**
**11,000కు పైగా తగ్గిన ఉద్యోగుల సంఖ్య**
**రూ.57 డివిడెండు ప్రకటన**

**హైదరాబాద్ పెన్ పవర్:** "దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఆర్థిక ఫలితాల్లో డీలా పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో కంపెనీ నికరలాభం రూ.10,657 కోట్లకు పరిమితమైంది. 2024-25 ఇదే కాల లాభం రూ.12,075 కోట్లతో పోలిస్తే, ఇది 13.91% తక్కువ. కొత్త కార్మిక చట్టాలను అమలు చేయడం వల్లే, సంస్థ లాభంపై ప్రభావం పడిందని వివరించింది. ఇవీ కారణాలుసమీక్షా త్రైమాసికంలో కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు రూ.2,128 కోట్లు పక్కనపెట్టింది. ఇందులో రూ.1,800 కోట్లు గ్రాట్యుటీ, రూ.300 కోట్లు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకోకపోతే లాభం 8.5% వృద్ధితో రూ.13,438 కోట్లకు చేరి ఉండేది. ఈ కోడ్‌ల వల్ల మార్జిన్లపై భవిష్యత్తులోనూ 0.10-0.15% ప్రభావం పడొచ్చని సీఎఫ్‌ఓ సమీర్ సక్సేరియా పేర్కొన్నారు. 2025 జులైలో ప్రకటించిన పునర్నిర్మాణ కార్యక్రమం వల్ల ఏర్పడ్డ వ్యయాలూ ప్రభావం చూపాయి. అమెరికాలో కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ)తో ఎప్పటి నుంచో కొనసాగుతున్న న్యాయ వివాదం నేపథ్యంలో, పరిహారం కింద రూ.1,010 కోట్లను కేటాయించాల్సి వచ్చింది.మళ్లీ తగ్గిన ఉద్యోగుల సంఖ్య2025 డిసెంబరు 31 నాటికి సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,82,163కు పరిమితమైంది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, అక్టోబరు-డిసెంబరులో ఉద్యోగుల సంఖ్య 11,151 తగ్గింది. 12,000 మందిని లేఆఫ్ చేయనున్నట్లు ఈ ఆర్థిక సంవత్సరం మొదట్లో టీసీఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు త్రైమాసికంలో 19,755 మేర సిబ్బంది సంఖ్య తగ్గిందని తెలిపింది. తాము ప్రకటించిన పునర్నిర్మాణ కార్యకలాపాల వల్ల 6,000 మంది ఉద్యోగులపైనే ప్రభావం పడిందని కంపెనీ తెలిపింది.రెట్టింపు సంఖ్యలో తాజా ఉత్తీర్ణుల నియామకాలుతాజా ఉత్తీర్ణుల (గ్రాడ్యుయేట్ల)ను రెట్టింపు సంఖ్యలో తీసుకున్నామని కంపెనీ చీఫ్ హెచ్‌ఆర్‌ఓ సుదీప్ కున్నుమల్ పేర్కొన్నారు. ఆగస్టులో చేపట్టిన పునర్నిర్మాణ కార్యక్రమం కారణంగా 1800 నిష్క్రమణలు చోటు చేసుకున్నాయని ఆయన అన్నారు.పెరిగిన ఆదాయాలు 2025-26 అక్టోబరు-డిసెంబరులో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.67,087 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.63,973 కోట్లతో పోలిస్తే, ఇది 4.86% అధికం. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఆపరేటింగ్ లాభాల మార్జిన్ స్థిరంగా 25.2% వద్ద నిలిచింది. 2024-25 ఇదే సమయంలోని 24.5 శాతంతో పోలిస్తే, ఈసారి అధికంగా ఉంది.2 డివిడెండ్ల ప్రకటన: ఒక్కో షేరుకు రూ.11 మధ్యంతర డివిడెండు, రూ.46 ప్రత్యేక డివిడెండు (మొత్తం రూ.57)ను సంస్థ ప్రకటించింది. జనవరి 17ను రికార్డు తేదీగా నిర్ణయించింది. ఫిబ్రవరి 3న చెల్లింపులు జరుగుతాయి. సమీక్షా త్రైమాసికంలో లభించిన కాంట్రాక్టు విలువ 9.3 బి. డాలర్లు (దాదాపు రూ.83,700 కోట్లు)గా నిలిచింది. ఉత్తర అమెరికా ఆదాయం 1.3% పెరగ్గా, బ్రిటన్ నుంచి 3.2% తగ్గింది. భారత వాటా 9.8% నుంచి 6.1 శాతానికి తగ్గింది. బీఎస్‌ఈలో కంపెనీ షేరు 0.86% లాభంతో రూ.3,235.70 వద్ద స్థిరపడింది.

## విపణిలోకి బ్రిటన్ మడ్డీఫాక్స్ సైకిళ్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్ సంస్థ మడ్డీఫాక్స్ 18 మోడళ్ల సైకిళ్లను దేశీయ విపణిలోకి విడుదల చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. రోమ్, కైలాన్ బైసైకిల్ బ్రాండ్లను కలిగి ఉన్న అనంత వెంచర్స్‌తో ఇందుకోసం ఒప్పందంపై సంతకం చేసినట్లు మడ్డీఫాక్స్ తెలిపింది. భారత్‌లో తమ ప్రత్యేక డిస్ట్రిబ్యూటర్‌గా అనంత వెంచర్స్ ఉంటుందని పేర్కొంది. 'ఐరోపాలో ప్రాచుర్యం పొందిన తాము, భారతీయ వినియోగదార్ల అవసరాలకు తగ్గట్లు మారేందుకు సిద్ధంగా ఉన్నామ'ని మడ్డీఫాక్స్ ఆసియా పసిఫిక్ ప్రాంత ఎండీ సాహిల్ మెహ్రోత్రా వెల్లడించారు. కంపెనీ ఉత్పత్తి శ్రేణిలో రోడ్లపై, పర్వత ప్రాంతాల్లో సైక్లింగ్‌కు తోడ్పడేవి, హైబ్రిడ్ బైక్‌లు ఉన్నాయి. మహిళలు-పిల్లల కోసం ప్రత్యేక బైక్‌లు ఉన్నాయని సంస్థ పేర్కొంది. 'ధరలు బేరీజు వేసుకునే వినియోగదార్ల కోసం మా వద్ద రోమ్, కైలాన్ బ్రాండ్లు ఉన్నాయి. అధిక-నాణ్యత, ప్రీమియం బ్రాండ్ ఉత్పత్తులు, గొప్ప రైడింగ్ అనుభూతి కోసం మడ్డీఫాక్స్ ఉత్పత్తులు లభిస్తాయని' అనంత వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అజిత్ గాంధీ వెల్లడించారు.

## రిటెయిల్ ధరలు పెరుగుతున్నాయ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆహార వస్తువుల ధరలు పెరగడంతో, 2025 డిసెంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం మూడు నెలల గరిష్ఠమైన 1.33 శాతానికి పెరిగింది. గతేడాది అక్టోబరులో రికార్డు కనిష్ఠమైన 0.25%, నవంబరులో 0.71 శాతంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం నమోదైన సంగతి విదితమే. 2024 డిసెంబరులో మాత్రం ఇది 5.22 శాతంగా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) ఈ గణాంకాలను సోమవారం విడుదల చేసింది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కవేసే రిటెయిల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత 4% కంటే దిగువనే నమోదు కావడం విశేషం. డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం -2.71 శాతంగా నమోదైంది. వరుసగా ఏడో నెలా ఆహార ద్రవ్యోల్బణం ప్రతికూలంగానే కొనసాగింది. కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, సుగంధ ద్రవ్యాలు, పప్పుల ధరలు పెరగడంతో, అక్టోబరు-నవంబరుతో పోలిస్తే, డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం అధికమైంది. ద్రవ్యోల్బణం పట్టణ ప్రాంతాల్లో 2.03 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 0.76 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ (9.49%), కర్ణాటక (2.99%), ఆంధ్రప్రదేశ్ (2.71%), తమిళనాడు (2.67%), జమ్మూ కశ్మీర్ (2.26%) ఉన్నాయి. అస్సాం, బిహార్, హరియాణా, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లో ప్రతి ద్రవ్యోల్బణం నమోదైంది.

## యూఎస్‌లో లక్షకు పైగా వీసాల రద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:** నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో 2025లో అమెరికా లక్షకు పైగా వీసాలను రద్దు చేసింది. వాటిలో సుమారు 8,000మంది విద్యార్థుల వీసాలు ఉన్నాయి. "అమెరికాను సురక్షితంగా ఉంచే చర్యల్లో భాగంగా మేము ఈ నేరస్తులను బహిష్కరిస్తూనే ఉంటాము" అని విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. "విదేశాంగశాఖ ఇప్పుడు లక్ష వీసాలను రద్దు చేసింది. వాటిలో సుమారు 8,000 విద్యార్థి వీసాలు మరియు నేరపూరిత కార్యకలాపాలకు సంబంధించి అమెరికా చట్ట అమలు సంస్థల విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తులకు చెందిన 2,500 ప్రత్యేక వీసాలు కూడా ఉన్నాయి" అని పేర్కొంది.ఏడాది కంటే తక్కువ సమయంలో ట్రంప్ యంత్రాంగం లక్ష వీసాలను రద్దు చేసిందని స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ డిప్యూటీ స్పోక్‌పర్సన్ టామీ పిగోట్ పేర్కొన్నారు. దాడి, దొంగతనం మరియు మద్యం సేవించి వాహనం నడపడం వంటి నేరాలకు పాల్పడిన వారు లేదా దోషులుగా తేలిన వేలాది మంది విదేశీ పౌరుల వీసాలు కూడా ఇందులో ఉన్నాయని ఆయన తెలిపారు. రద్దైన ప్రత్యేక వీసాల్లో సగం డ్రంక్ అండ్ డ్రైవింగ్ కాగా, 30శాతం దాడి, నిర్బంధ ఆరోపణలు, మిగిలిన 20శాతం దొంగతనం, చిన్నారులపై వేధింపులు, డ్రగ్స్ వినియోగం మరియు పంపిణీ, మోసం మరియు అపహరణ ఆరోపణలకు సంబంధించినవి ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికాను అగ్రస్థానంలో నిలపడమే ట్రంప్ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రజా భద్రత మరియు జాతీయ భద్రతకు ప్రమాదం కలిగించే విదేశీ పౌరుల నుండి దేశాన్ని కాపాడనున్నట్లు తెలిపారు.రెండవసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్ వలసలపై అణచివేతను తీవ్రతరం చేసింది. వృత్తులు, అధ్యయనానికి సంబంధించిన వీసాలపై నిబంధనలను కఠినతరం చేసింది. డిసెంబర్ 15 నుండి యుఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్.. సోషల్‌మీడియా ప్రొఫైల్స్ తనిఖీలు సహా హెచ్1బి, హెచ్-4 వీసా దరఖాస్తులపై పర్యవేక్షణ ప్రారంభించింది. భారత్‌లో షెడ్యూల్ చేయబడిన హెచ్-1బి వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. చాలా మంది దరఖాస్తులు స్టాంపింగ్ కోసం నెలల తరబడి నిలిచిపోయిన సంగతి తెలిసిందే.

## బంగ్లాదేశ్‌లో ఆగని మైనార్టీల హత్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువుల హత్యలు ఆగడం లేదు. సోమీర్ కుమార్ అనే ఆటో డ్రైవర్ పై దాడి మూక దాడి జరిగింది. దాస్‌ను కొట్టి, ఆపై కత్తితో పొడిచి చంపారు.ఆ తర్వాత మృతుని ఈ-ఆటో రిక్షాతో దుండగులు పారిపోయారు. ఇది ముందస్తు పథకం ప్రకారం జరిగిన హత్య అని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు నిందితుల్ని గుర్తించేందుకు ఆపరేషన్ ప్రారంభించారు. మండలి, దేశవ్యాప్తంగా మైనారిటీ వర్గాలపై పెరుగుతున్న దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్న తరుణంలో మైనారిటీలపై హింసాత్మక దాడులు ఎక్కువయ్యాయి.బంగ్లా తాత్కాలిక దేశాధినేత మహ్మద్ యూనస్ ఈ మారణకాండను అడ్డుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లోని తీవ్రవాదులు మైనారిటీలపై, వారి ఇళ్ళు, సంస్థలు, వ్యాపార సంస్థలపై ఆందోళనకరమైన దాడులను మేము చూస్తూనే ఉన్నాము. ఇటువంటి మత సంఘటనలను త్వరగా మరియు దృఢంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఓఇం) ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు

# అస్థిరతను అధిగమించేలా బంధాల బలోపేతం

**గాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరం**
**మోదీతో భేటీలో జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్**
**అహ్మదాబాద్‌లో గాలిపటాన్ని ఎగరేస్తున్న ఫ్రెడ్రిక్, మోదీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** అహ్మదాబాద్: ప్రపంచవ్యాప్త అస్థిర పరిస్థితుల్లో సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు పరస్పరం సహకరించుకోవాలని భారత్, జర్మనీ ప్రతిపాదించుకున్నాయి. ఆ మేరకు బంధాలు బలోపేతం చేసుకోవాలని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయించుకున్నారు. మహాత్మాగాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరమని ఫ్రెడ్రిక్ పేర్కొన్నారు. భారత్‌లో రెండ్రోజుల పర్యటన కోసం సోమవారం వచ్చిన ఆయన అహ్మదాబాద్‌లో మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరువురు కలిసి సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. పతంగుల పండుగలో పాల్గొన్నారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, విలువైన ఖనిజాలు, సెమీ కండక్టర్లు, శాస్త్ర-సాంకేతిక రంగాలు, విద్య, నైపుణ్యం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు ఇరువురు నేతల సమక్షంలో 19 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రక్షణరంగ పరిశ్రమలు, ఉన్నత విద్యారంగంలోనూ సహకారానికి మార్గసూచీ రూపొందించుకోనున్నాయి. టెలికాం రంగంపై విడిగా ఒక ఒప్పందం కుదిరింది. మొత్తం వాణిజ్యరంగ విస్తరణకు భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా కొలిక్కి తీసుకురావాలని నేతలిద్దరూ ప్రతిపాదించారు. భారత్‌లో ఉన్న వ్యాపార పరిమాణం, జర్మనీ నవకల్పనలు చేతులు కలిపితే రెండు దేశాలకే కాకుండా ప్రపంచానికంతటికీ సుస్థిర పరిష్కారాలు చూపించవచ్చని మోదీ చెప్పారు. భారత్-జర్మనీ సీఈవోల వేదిక సమావేశంలోనూ ఆయన ప్రసంగించారు. జర్మనీ మీదుగా వెళ్లే భారతీయులకు వీసా-రహిత ట్రాన్సిట్ అవకాశాన్ని కల్పిస్తామని ఫ్రెడ్రిక్ ప్రకటించారు.గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ గాలిపటాల పండగలో సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ఎఫ్‌టీఏ పూర్తయితే కొత్త శిఖరాలకు సంబంధాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పూర్తయితే భారత్-జర్మనీ, భారత్-ఈయూ సంబంధాలు కొత్త శిఖరాలకు చేరుకుంటాయని ఫ్రెడ్రిక్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చల అనంతరం మోదీ, ఆయన సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మా ప్రభుత్వ హయాంలో వ్యాపారానికి, వ్యాపార సహకారానికి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. భారత్‌లో వ్యాపార అవకాశాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి మన రెండు దేశాలకు అనేక అవకాశాలున్నాయి' అని ఫ్రెడ్రిక్ చెప్పారు. భారత్ నుంచి నైపుణ్య కార్మికులు, నర్సుల అవసరం తమ దేశానికి ఎక్కువగా ఉంటోందన్నారు. నేతలిద్దరూ సబర్మతి నదీ తీరానికి చేరుకున్నారు. భారత్-జర్మనీ సీఈవోల ఫోరం సమావేశంలో మోదీ ప్రసంగించారు.పదపదవే వయ్యారి గాలిపటమా..! అంతర్జాతీయ పతంగుల పండుగ-2026ని మోదీ ప్రారంభించగా ఇద్దరు అగ్రనేతలు కలిసి గాలిపటాలను వీక్షించారు. వాటిని ఎలా తయారుచేస్తారో మహిళా కళాకారుల్ని అడిగి తెలుసుకున్నారు. పైకప్పులేని వాహనంలో మైదానంలో విహరించారు. స్వయంగా గాలిపటాలు ఎగరవేసి ఆనందించారు. గాలిపటాలు ఎగురవేయడంలో ప్రావీణ్యం ఉన్న 135 మంది ప్రతినిధులు 50 దేశాల నుంచి వచ్చి దీనిలో పాల్గొన్నారు. మరో వెయ్యి మందివరకు ఔత్సాహికులు పాలుపంచుకుంటున్నారు. ఈ నెల 14 వరకు ఇది కొనసాగనుంది. ఐదు లక్షలమంది పర్యాటకులు వీటిని వీక్షించడానికి వస్తారని అంచనా.

# చెత్త సేకరిస్తుంటే.. 45 సవర్ల బంగారం దొరికింది!

**పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయతీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికురాలు**

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై :రోడ్డుపై చెత్త సేకరిస్తుండగా దొరికిన సుమారు రూ.45 లక్షల విలువైన 45 సవర్ల బంగారు ఆభరణాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయతీ చాటుకున్నారో పారిశుద్ధ్య కార్మికురాలు. చెన్నై టీనగర్‌లో పద్మ అనే కార్మికురాలు ఆదివారం మధ్యాహ్నం చెత్త సేకరణ విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రోడ్డుపై పడి ఉన్న ఓ బ్యాగును ఆమె గమనించి తెరచి చూడగా బంగారు ఆభరణాలు కనిపించాయి. వెంటనే బ్యాగును పాండిబజార్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు దర్యాప్తు జరిపి ఆ బ్యాగు నంగనల్లూర్‌కు చెందిన రమేశ్‌దిగా గుర్తించారు. బ్యాంకుల్లో వేలం వేసే బంగారు నగలను ఆయన దక్కించుకుని విక్రయిస్తుంటారని, అలా వేలంలో పొందిన నగలను తీసుకుని వెళు ్తుండగా టీనగర్‌లో ఆయన పడేసుకున్నట్లు తేలింది. ముందుగానే ఆయన పాండిబజార్ పోలీస్‌స్టేషన్‌లో నగల బ్యాగు పోయిందని ఫిర్యాదు చేశారు. రూ.45 లక్షల విలువైన బంగారు నగలను నిజాయతీగా అప్పగించిన పద్మను పోలీసులు, నగల యజమాని అభినందించారు.

# గ్రీన్‌లాండ్ విలీనం కోసం.. అమెరికాలో బిల్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌లాండ్ ను స్వాధీనం చేసుకునే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తాజాగా రిపబ్లికన్ పార్టీకి చెందిన చట్టసభ సభ్యుడు రాండీఫైన్ 'గ్రీన్‌లాండ్ విలీనం - రాష్ట్ర హోదా' పేరుతో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుతో ఆ ద్వీపాన్ని అమెరికాలో విలీనం చేసుకునేలా ట్రంప్ చర్యలు చేపట్టేందుకు అవకాశం లభిస్తుందని రాండీ అభిప్రాయం వ్యక్తంచేశారు. అమెరికా విరోధులు ఆర్కిటిక్‌లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని, తాము అలా జరగనివ్వబోమని వ్యాఖ్యలు చేశారు. ఆర్కిటిక్‌లో రష్యా, చైనాను ఎదుర్కోవడానికి ఈ చర్యలు కీలకమని వెల్లడించారు. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురో నిర్బంధం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై కన్నేశారు. ఆ ద్వీపాన్ని డెన్మార్క్ నుంచి దూరం చేసేందుకు.. అక్కడి ప్రజలకు డబ్బును ఎరగా వేయాలని యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఒక్కో వ్యక్తికి 10వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల (భారత కరెన్సీలో రూ.8 లక్షల నుంచి రూ.89 లక్షల) మధ్య డబ్బు ఇచ్చేందుకు అమెరికా అధికారులు ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఇంకో 20 రోజుల్లో ఈ ద్వీపం గురించి మాట్లాడదామంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. యూఎస్ నగదు చెల్లింపు ప్రణాళికలను గ్రీన్‌లాండ్ నాయకులు తిరస్కరించారు. తమ ప్రాంత భవిష్యత్తును విదేశాలు నిర్ణయించలేవని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. నాటో దేశాలు కూడా యూఎస్ ప్రణాళికపై ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ ద్వీపంలో మొత్తం 57 వేల మంది ప్రజలు ఉన్నారు.

# కెనడాలో భారీగా బంగారం దోపిడీ కేసు

**హైదరాబాద్ పెన్ పవర్:** కెనడాలోని టొరంటో ఎయిర్‌పోర్టులో బంగారంతో ఉన్న ఓ కంటైనర్‌ను మూడేళ్ల క్రితం కొందరు దుండగులు దోపిడీ (అజీనిజీటజీ ఃతిణణవబబి ఉనీశ్రీట ఊవతిబ బి) చేశారు. ఈ కేసులో ముమ్మర దర్యాప్తు చేస్తోన్న కెనడా పోలీసులు తాజాగా ఓ నిందితుడిని అరెస్టు చేశారు. అతడి పేరు అర్సలాన్ చౌధరీ అని వెల్లడించారు. అతడికి ఒక చిరునామా అంటూ ఏమీ లేదని, దుబాయ్ నుంచి టొరంటో పియర్సన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే ఈ కేసులో కీలక నిందితుడు సిమ్రన్‌ప్రీత్ పనేసర్ భారత్‌లోనే ఉన్నట్లు సమాచారం.కేసు నేపథ్యమిదీ..2023 ఏప్రిల్‌లో స్విట్జర్లాండ్ నుంచి ఓ కార్గో విమానం టొరంటో ఎయిర్‌పోర్టులో దిగింది. అందులోని ఓ కంటైనర్‌లో 400 కేజీల బరువైన 6,600 బంగారు కడ్డీలు ఉన్నాయి. అప్పట్లో వాటి విలువ 20 మిలియన్ కెనడియన్ డాలర్లు (ఉనీశ్రీట ఊవతిబబి). బంగారంతో పాటు కంటైనర్‌లో 2.5 మిలియన్ కెనడియన్ డాలర్ల నగదు కూడా ఉంది. టొరంటోలోని ఓ బ్యాంక్‌లో భద్రపర్చేందుకు వీటిని తీసుకొచ్చారు. విమానం దిగగానే కంటైనర్‌ను ఎయిర్‌పోర్టులోని వేర్‌హౌస్ ఫెసిలిటీలో భద్రపర్చారు. అయితే, ఆ మరుసటి రోజు పోలీసులు వెళ్లి చూడగా.. కంటైనర్‌లోని బంగారం, నగదు మాయమైంది.కెనడా చరిత్రలోనే అతిపెద్ద దోపిడీగా అప్పట్లో ఈ ఘటన పెను సంచలనం సృష్టించింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా నకిలీ పత్రాలతో వేర్‌హౌస్‌లోని సిబ్బందే దాన్ని మాయం చేసినట్లు తెలిసింది. ఘటన సమయంలో ఇద్దరు భారతీయులు సిమ్రన్‌ప్రీత్, పరంపాల్ సిద్ధు వేర్‌హౌస్ ఫెసిలిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పోలీసులు వీరిద్దరితో సహా 9 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే పరంపాల్‌ను అరెస్టు చేయగా.. సిమ్రన్‌ప్రీత్ పరారీలో ఉన్నట్లు కెనడా పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు ఆ బంగారాన్ని పోలీసులు గుర్తించలేదు. కొంత మొత్తం నగదును మాత్రం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## అశ్వం 'కాకా'.. రేటు కేక!

**హైదరాబాద్ పెన్ పవర్:** హరియాణా కురుక్షేత్రలోని గీతా జయంతి మైదానంలో జరుగుతున్న మేళాలో పలు మేలుజాతి పశువులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వాటిలో మరీ ముఖ్యంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 'కాకా' అనే గుర్రం. పంజాబ్‌లోని లుధియానా నుంచి సన్నీ అనే వ్యక్తి దాన్ని పశువుల మేళాకు తీసుకొచ్చారు. నుక్రే జాతికి చెందిన ఈ అశ్వం విలువ ఏకంగా రూ.5 కోట్లు. ఇది తల నుంచి పాదాల వరకు తెలుపు రంగులో మెరిసిపోతూ ఉంటుంది. వయసు నాలుగేళ్లు. కాకా ఇప్పటివరకూ కురుక్షేత్ర ప్రదర్శన సహా 21 పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. దీని తండ్రి గుర్రమైన 'కింగ్', తల్లి అశ్వమైన 'నాజ్' కూడా గతంలో పలు పోటీల్లో విజేతలుగా నిలవడం గమనార్హం.

## స్కూల్‌కు వచ్చి పిల్లల కిడ్నాప్..

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలోని ధారవాడలో స్కూల్ పిల్లల కిడ్నాప్‌నకు యత్నించిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన దుండగుడు పిల్లల్ని అపహరించుకుపోవడం (ఐతిటనిజీజూ) చర్చనీయాంశమైంది. అయితే, అనుకోనివిధంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ పిల్లలు కిడ్నాపర్ బారినుంచి బయటపడ్డారు. అసలేం జరిగిందంటే..ధారవాడలోని కమలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడోతరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలు మధ్యాహ్నభోజనం తర్వాత తిరిగి క్లాస్‌రూమ్‌లోకి రాలేదు. స్కూల్ యాజమాన్యం, సిబ్బంది ఎంత వెతికినా కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులను ఆరా తీశారు. పిల్లలు వారి ఇళ్లకు కూడా వెళ్లలేదని తెలియడంతో స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను చూశారు. దీంతో వారు కిడ్నాప్‌నకు గురైనట్లు తెలిసింది.లంచ్ బ్రేక్ సమయంలో ఓ వ్యక్తి స్కూల్ ప్రాంగణంలోకి వచ్చి పిల్లలతో మాట్లాడినట్లుగా సీసీటీవీలో రికార్డ్ అయ్యింది. ఆ తర్వాత పిల్లలిద్దరినీ బైక్‌పై ఎక్కించుకొని ఆ వ్యక్తి అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయాడు. దీంతో స్కూల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారమిచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పిల్లల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.అదే సమయంలో పిల్లలను తీసుకెళ్తుండగా ఉత్తర కన్నడ జిల్లాలోని దండేలీ ప్రాంతంలో దుండగుడు నడుపుతున్న బైక్‌కు ప్రమాదం జరిగింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఆరాతీయగా అతడు పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో పిల్లలను కిడ్నాప్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. ధారవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని కరీమ్ మేస్త్రీగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఆమె నిర్ణయం మార్చుకోవాల్సిందే..

**హైదరాబాద్ పెన్ పవర్:** మనకు నచ్చిన వ్యక్తితో జీవితం సంతోషంగా ఉంటుంది. అదే మనల్ని ఇష్టపడే వ్యక్తితో మరింత సంతోషంగా ఉంటుంది. కానీ ఈ అవకాశం చాలా మందికి దొరకదు. కొందరైతే మనల్ని కోరి వచ్చిన వారిని అహంకారంతో వదులుకుంటారు. ఒక్కసారి వదులుకున్నామా ఆ తర్వాత ఎంత బాధపడినా ఇక ఫలితం ఉండదు. ఇలా బాధపడేవారు కూడా మన చుట్టూ కొందరుంటారు. ఇక వాళ్లు మనకు దొరకు అనుకున్నప్పుడు మొండి పట్టుదల వదిలి జీవితంలో ముందుకు పోవడమే ఉత్తమం. లేదంటే అసలు బతుకే లేకుండా పోతుంది. అలాంటి కథనమే ఈ వారం కథనం మీ కోసం ఐద్వా అదాలత్(ఐలమ్మ ట్రస్ట్)లో చూద్దాం?సంధ్యకి సుమారు 30 ఏండ్లు ఉంటాయి. ఇంకా పెండ్లి కాలేదు. ఆమెకు ఓ అన్న, చెల్లి ఉన్నారు. వీళ్లిద్దరికీ పెండ్లి జరిగింది. పిల్లలు కూడా ఉన్నారు. సంధ్యని పెండ్లి చేసుకోమంటే, ఆసక్తి చూపించలేదు. 'నాకు పెండ్లిపై నమ్మకం లేదు' అంటూ చేసుకోలేదు. ఇంట్లో పెండ్లి గురించి ఒత్తిడి మొదలుపెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మా దగ్గరకు వచ్చి 'ప్రస్తుతం నేను రాజు అనే వ్యక్తిని ప్రేమిస్తున్నాను. ఒప్పుడు అతను కూడా నన్ను ప్రేమించాడు. అయితే ఇప్పుడు పెండ్లి చేసుకుందామంటే ఒప్పుకోవడం లేదు. అతను ప్రేమిస్తున్నాను అని చెప్పినప్పుడు నేను ఒప్పుకోలేదు.కాబట్టి ఇప్పుడు నేను ప్రేమిస్తున్నాను అంటే అతను ఒప్పుకోవడం లేదు. మీరే ఎలాగైనా అతనితో మాట్లాడి మా పెండ్లి జరిపించాలి' అంది. మేము సరే అని రాజుకి ఫోన్ చేసి పిలిపించాము. అతను చెప్పేది విన్నాక మాకు ఆశ్చర్యమేసింది. అది ఏమిటంటే 'నేను సంధ్యను ప్రేమించిన విషయం వాస్తవమే, చదువుకునే రోజుల్లో ఆమంటే నాకు పిచ్చి. సంధ్య లేకుండా నేను ఉండలేను అనేంతగా ఇష్టపడే వాడిని. ఆ విషయం నా స్నేహితులందరికీ తెలుసు. అందరూ ఆమెను ఒప్పించడానికి ప్రయత్నించారు. కానీ అప్పుడు ఆమె ఒప్పుకోలేదు. అందరి ప్రయత్నం విఫలం కావడంతో నేను వేరే చోటికి వెళ్లిపోయాను. అక్కడే ఉద్యోగం చూసుకున్నాను.ఆమెకు దూరంగా ఉంటేనైనా మరచిపోయే అవకాశం ఉంటుందనుకున్నాను. కానీ నా వల్ల కాలేదు. నా బాధ చూసి మా చెల్లి కూడా సంధ్యతో మాట్లాడింది. అయినా ఇష్టం లేదనే చెప్పింది. చివరకు మా అమ్మానాన్న కూడా వాళ్ల ఇంటికి వెళ్లి నా ప్రేమ గురించి చెప్పి ఇద్దరికీ పెండ్లి చేస్తామన్నారు. నేను ఇన్ని ప్రయత్నాలు చేసినా సంధ్య ఒప్పుకోలేదు. 'నా అందం చదువుకు నువ్వు సరిపోవు' అంది. అందరి ముందు నన్ను అవమానించింది. ఆ బాధ నుండి నేను బయటకు రావడానికి చాలా సమయం పట్టింది. సంధ్య నన్ను కాదన్న తర్వాత చాలా కుంగిపోయాను. ఉద్యోగం మానేశాను. తాగుడుకు బానిసయ్యాను. వీటి నుండి బయటకు రావడానికి నా చిన్ననాటి స్నేహితురాలు రవళి సహాయం చేసింది. నా కుటుంబం కూడా అండగా నిలబడింది. దాదాపు రెండు మూడేండ్లు పట్టింది తిరిగి మామూలు మనిషిని కావడానికి. అప్పుడు నాకు అర్థమయింది ఏమిటంటే ప్రేమించడం అంటే వ్యాపారం కాదు, తిరిగి ఆశించడానికి. నేను ప్రేమించిన వ్యక్తి బాగుండాలి. నేను ఏమైనా ఫర్వాలేదనుకున్నాను. అయితే రవళి నన్ను చిన్నప్పటి నుండి ప్రేమిస్తుంది. కానీ నేను ఎప్పుడూ ఆమెను ఆ దృష్టితో చూడలేకపోయాను.

ఆమె కూడా నాకెప్పుడూ తన ప్రేమ గురించి చెప్పలేదు. సంధ్య దూరమైన తర్వాత నా కుటుంబ సభ్యులు కూడా 'ఒక స్త్రీ కోసం తాగుడుకు బానిసయ్యావు' అంటూ కోప్పడ్డారు. కానీ రవళి మాత్రం నన్ను జాగ్రత్తగా చూసుకుంది. ఆమె చూపించిన ప్రేమతోనే నేను ఇప్పుడు జీవితంలో నిలబడ్డాను. వ్యాపారం కూడా చేస్తున్నాను. రవళీ నేను రెండేండ్ల కిందటే పెండ్లి చేసుకున్నాము. ఇప్పుడు మాకు ఒక పాప కూడా ఉంది. పాప నా జీవితంలోకి రావడంతో సంధ్య గురించి పూర్తిగా మర్చిపోయాను. సంధ్య నాకు రెండు నెలల కిందట కలిసింది. అప్పటి నుండి 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను, పెండ్లి చేసుకుంటాను' అంటుంది. ఆమె కలిసిన మొదటి సారే నేను సంధ్యకు చెప్పేశాను. నాకు పెండ్లి అయింది ఒక పాప కూడా ఉందని. కానీ దానికి ఆమె ఒప్పుకోవడం లేదు. పైగా రవళితో మాట్లాడి ఒప్పిస్తాననంటుంది. ఈ సమస్య నుండి ఎలా బయటపడాలో అర్థం కావడం లేదు. ప్రస్తుతం సంధ్యపైన నాకు ఎలాంటి ప్రేమ లేదు. ఇప్పుడు నా భార్య, పాపనే నా ప్రపంచం. మీరే నాకు న్యాయం చేయండి' అన్నాడు.అంతా విన్న తర్వాత 'సంధ్యా అతనికి పెండ్లి అయిపోయింది. నిన్ను కోరి వచ్చినప్పుడు వద్దనుకున్నావు. ఇప్పుడు అతని జీవితంలో భార్యా, పాప ఉన్నారు. అలాంటి వ్యక్తిని కోరుకోవడం మంచిది కాదు. పైగా ఇప్పుడు అతనికి నీపై ప్రేమ కూడా లేదు. పిచ్చిగా ఆలోచించడం మానేసి, నీ నిర్ణయం మార్చుకుంటే మంచిది. లేదంటే నీ వల్ల ముగ్గురి జీవితాలు నాశనం అవుతాయి. నీకు మంచి ఉద్యోగం ఉంది. హాయిగా బతకగలిగే ధైర్యం ఉంది. అనవసరంగా ఇంకొకరి భర్తను కోరుకొని ఇబ్బందులు పడొద్దు. గడిచిపోయిన కాలాన్ని తలచుకుంటే మిగిలేది బాధనే. నీ తల్లిదండ్రులు చూసిన వ్యక్తిని చూసి పెండ్లి చేసుకొని కొత్త జీవితం ప్రారంభించు. నువ్వు ఇలాగే మొండిగా ఉంటే నీకు భవిష్యత్తే లేకుండా పోతుంది. ఇప్పుడు నీ జీవితం నీ చేతుల్లోనే ఉంది. మంచి నిర్ణయంతో తీర్చిదిద్దుకుంటావో లేదా ఇలాగే అతని గురించి ఆలోచిస్తూ బతుకుతావో నీ ఇష్టం. కానీ అతను మాత్రం ఇక నీ జీవితంలోకి రాడనే వాస్తవాన్ని మాత్రం గర్తించు అని చెప్పి పంపించాము.

# టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ పాసింజర్స్ వెహికల్స్.. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.5.59 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. నేటి నుంచి (జనవరి 13) బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో హ్యుందాయ్ ఎక్స్‌టర్, నిస్సాన్ మాగ్నైట్, రెనో కైగర్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ వంటి కార్లతో ఇది పోటీ పడనుంది.టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్.. పంచ్.ఈవీని పోలి ఉంటుంది. కొత్త పంచ్‌లో ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్‌ను రీడిజైన్ చేశారు. డీఆర్ఎల్స్‌ను కొత్తగా తీర్చిదిద్దారు. స్పోర్టియర్ బంపర్స్, సరికొత్త అల్లాయ్ డిజైన్, కొత్త ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్ క్లస్టర్ ఆకట్టుకుంటాయి. ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్స్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, రేర్ వాషర్ వైపర్స్‌ను ఇచ్చారు. కొత్తగా సైంటిఫిక్, కారామెల్, బెంగాల్ రూజ్, కూర్గ్ క్లౌడ్స్ వంటి కలర్ ఆప్షన్స్‌తో పంచ్ లభిస్తుంది.ఇంటీరియర్ పరంగానూ పలు మార్పులు చేశారు. ఇందులో 26.03 సెంటిమీటర్ల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ యూనిట్, 17.8 సెంటిమీటర్ల డిజిటల్ క్లస్టర్ ఉన్నాయి. 360 డిగ్రీల సరౌండ్ వ్యూ, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, ఆటోడిమ్మింగ్ ఐఆర్‌వీఎం వంటివి ఉన్నాయి. అడల్ట్, చైల్డ్ సేఫ్టీ పరంగా 5 స్టార్ రేటింగ్ ఉంది. 6 ఎయిర్‌బ్యాగులు ఇచ్చారు. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ 1.2 లీటర్ ఐటర్బో పెట్రోల్ ఇంజిన్, 1.2 లీటర్ రెవోట్రాన్ (పెట్రోల్ ఇంజిన్), సీఎన్‌జీ వంటి ఇంజిన్ ఆప్షన్లతో లభిస్తుంది. మొత్తం ఆరు వేరియంట్లు అందుబాటులో ఉంటాయి.

# డి-మార్ట్‌లో సరుకుల రేట్స్ ఎందుకు అంత తక్కువగా ఉంటాయి?




**హైదరాబాద్ పెన్ పవర్:** డి మార్ట్ ప్రస్తుతం భారతదేశంలో మధ్యతరగతి కుటుంబాలకు అత్యంత విశ్వసనీయమైన సూపర్ మార్కెట్‌లో ఒకటి. చిన్న మ్యాగీ నుండి బిస్కెట్లు, చాక్లెట్లు, ఇలా ఇంట్లోకి ఏ నిత్యావసర వస్తువుల కావాలన్నా డిమార్ట్ వెళ్లాల్సిందే.ఎందుకంటే అక్కడ ప్రతిదానిపై మన డిస్కౌంట్ లభిస్తుంది.. ఇతర మార్కెట్‌లో పోల్చుకుంటే అక్కడ తక్కువ ధరకు సరుకులు దొరుకుతాయి. ఉదాహరణకు, డి మార్ట్ రూ.149 విలువైన పాల ఉత్పత్తులను ఆఫర్ కింద రూ.99లకే పొందచ్చు. అలానే రూ. 99 ఉన్న మ్యాగీని రూ.73కి విక్రయిస్తుంది. అందుకే చాలా మంది డీమార్ట్ వెళ్లి షాపింగ్ చేస్తారు. ఈ ఆఫర్‌ల కారణంగా డీమార్ట్ ఇతర మార్కెట్‌లను వెనక్కి నూకి టాప్‌లో ఉంటుంది.తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలుఅయితే ఇక్కడ చాలా మందికి వచ్చే డౌట్ ఏమిటంటే..తక్కువ ధరకే సరుకులు ఇవ్వడం ద్వారా డీమార్ట్‌కు నష్టాలు రావా అని.. చాలా మందికి తెలియన విషయం ఏమిటంటే.. డీ మార్ట్ అనే కంపెనీ ఎక్కువ లాభం పొందడం కంటే తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలు చేయడంపై దృష్టి పెడుతుంది. డి మార్ట్‌లో రోజువారీ నిత్యావసర వస్తువులు ఎక్కువగా అమ్ముడవుతాయి. దీంతో స్టాక్‌ను త్వరగా అమ్మివేసి, దాని పెట్టుబడిపై త్వరగా రాబడిని పొందుతుంది.ఇక్కడ మీరు తెలుసుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, డీమార్ట్ కంపెనీ సరఫరాదారులతో వ్యవహరించే విధానం. సాధారణంగా ఇతర రిటైల్ కంపెనీలు విక్రేత బిల్లులను క్లియర్ చేయడానికి టైం తీసుకుంటారు. కానీ డీమార్ట్ మాత్రం ప్రతి నెలా బిల్స్ క్లియర్ చేస్తుంది. దీంతో తయారీ దారుకుల కూడా కాస్తా తక్కువ ధరకే డీమార్ట్‌కు వస్తువుల సరఫరా చేస్తారు. అలాగే ఒకేసారి బల్క్‌లో వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా కంపెనీకి భారీ లభిస్తుంది.ఖర్చుల విషయంలో జాగ్రత్తలుడి మార్ట్ తన ఖర్చుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. డిమార్ట్ ఎక్కువగా సొంతం స్థలంలోనే సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసుకుంటుంది. ఎక్కడైనా రెంట్ తీసుకోవాల్సి వాటిని దీర్ఘకాలిక లీజులకు తీసుకుంటుంది. అందుకే ఖాళీ షెటర్‌లను అద్దెకు ఇస్తుంది.తద్వారా, అద్దె ఖర్చు తగ్గుతుంది. డి మార్ట్ ఖరీదైన ఇంటీరియర్స్, భారీ ఎయిర్ కండిషనింగ్, మ్యూజిక్ సిస్టమ్స్ మొదలైన వాటిపై పెద్దగా ఖర్చు చేయదు దాని వల్ల ఆదా చేసిన డబ్బును డిస్కౌంట్ల రూపంలో కస్టమర్లకు అందిస్తుంది.డీ-మార్ట్ ఓనర్ విజన్, అనుభవండిమార్ట్ ఇంత సక్సెస్ కావడానికి మెయిన్ రీజన్.. ఈ కంపెనీ యజమాని అయిన రాధాకిషన్ దమానికి ఉన్న అనుభవం. స్టాక్ మార్కెట్లో తాను సంపాదించిన అనుభవాన్ని రిటైల్ రంగంలో ఉపయోగించుకుని అతను డీమార్ట్‌ను ఈ స్థాయికి తీసుకొచ్చారు. కేవలం ఒక్క స్టోర్‌తో ప్రారంభమైన అతని ప్రయాణం ఇప్పుడు దేశవ్యాప్తంగా వందలాది స్టోర్‌లకు చేరుకుంది. మొత్తంగా చూసుకుంటే తక్కువ ఖర్చులు, త్వరితగత చెల్లింపులు, నిత్యావసరాలపై దృష్టి పెట్టడంతో డి-మార్ట్ ప్రజలకు తక్కువ ధరలతో సరుకులను అందించగలుగుతుంది.

# మన అక్షరం సమసమాజానికి నాంది కావాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నపూర్ణ.. పాతూరి నరసింహారావు, మాణిక్యమ్మల దంపతులకు నాలుగో సంతానంగా బొబ్బిలి నగరంలో పుట్టారు. ఈమె బాల్యమంతా తాతా, నాయనమ్మల వద్దనే జరిగింది. వీరి తాత బొబ్బిలి రాజా వారి ఆస్థానంలో సివిల్ ఇంజనీర్. ఆ కారణంగా అన్నపూర్ణ అక్కడ జన్మించారు. ఆయన పదవీ విరమణ తర్వాత బాపట్లకు మకాం మార్చారు. అన్నపూర్ణ ప్రాథమిక విద్యాభ్యాసమంతా బాపట్ల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. తాత గారికి ముద్దుల మనవరాలు అన్నపూర్ణ. ఐదో తరగతి నుండి ఆయన అన్నపూర్ణతో చందమామ, బాలమిత్రలోని కథలు బాగా చదివించేవారు. పెద్దబాలశిక్ష ప్రతిరోజు వల్లె వేయించేవారు. నాయనమ్మ కూడా సుమతి, వేమన, దాశరథి, కుమారి శతకాలు, చిన్నచిన్న నీతి కథలు చదివించేవారు.స్కూల్ విద్యార్థిగా?ఒకవైపు పాఠశాలలో ఉపాధ్యాయులు ఇష్టపడే శిష్యురాలుగా మరోవైపు ఇంట్లో ఇస్తున్న ప్రోత్సాహం వల్ల అన్నపూర్ణకు చిన్నతనంలోనే తెలుగు భాషపై మక్కువ ఏర్పడింది. అంతేకాదు మంచి పట్టు కూడా వచ్చింది. భవిష్యత్తులో ఆమె ఎన్నో పుస్తకాలు రాసేందుకు, సాహిత్య కార్యక్రమాలు చేసేందుకు ఈ శిక్షణ ఎంతగానే ఉపయోగపడింది. ఆరేడు తరగతులు బాపట్లలో పూర్తి చేసి తాత, నాయనమ్మలతో కలిసి నెల్లూరులో ఉండే తల్లితండ్రుల వద్దకు వచ్చేశారు. పదో తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. అన్నపూర్ణకు కూచిపూడి నృత్యంలో కూడా ప్రవేశం ఉన్నది. బాపట్లలో ఉన్నప్పుడు వేదాంతం సత్యనారాయణ శిష్యుల వద్ద నృత్యం నేర్చుకున్నారు. నెల్లూరుకు వచ్చాక దాన్ని కొనసాగించలేకపోయారు. కానీ నృత్యం పట్ల ఆసక్తి మాత్రం ఉండేది. పాఠశాల కార్యక్రమాలలో నృత్య ప్రదర్శనలు ఇచ్చేవారు.ఉపాధ్యాయినిగా?పదవ తరగతిలో ఆమె 'వసంత రుతువు' కవిత పాఠశాల మ్యాగజైన్లో అచ్చయింది. అది చదివిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో మెచ్చుకున్నారు. తర్వాత నెల్లూరులోనే ఇంటర్, బి.ఏ డిగ్రీ పూర్తి చేశారు. కాలేజీ రోజుల్లో ఆమె కల్చరల్ సెక్రటరీగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డిగ్రీ తర్వాత చతుర్వేదుల శ్యామక్రిష్ణతో వివాహం కావడంతో హైదరాబాదుకు వచ్చేశారు. భర్త బ్యాంకు ఉద్యోగి. వీరికి ఇద్దరు పిల్లలు. అమ్మాయి స్రవంతి, అబ్బాయి తారక రామ్. వీరు 1980 నుండి 1990 వరకు హైదరాబాదులో ఉన్నారు. ఓ స్కూల్‌లో ఉపాధ్యాయినిగా పనిచేశారు. అప్పటినుండి ఆమె దృష్టి సాహిత్యం వైపు మళ్ళింది. దానికి కారణం ఆంధ్ర ప్రభలో 'ఒక అమ్మ కథ' అనే కథ అచ్చయింది. ఆ తర్వాత ఆంధ్రభూమిలో మొదటిసారిగా ఆమె కవితలు వచ్చాయి. ఆ కవితలపై ప్రశంసలు కురిపిస్తూ ఎందరో ఉత్తరాలు కూడా రాశారు. ఇదే ఆమెకు సాహిత్యంపై మక్కువ కలగడానికి కారణం అయింది. తర్వాత ఎన్నో పత్రికలలో కథలు, కవితలు, వ్యాసాలు రాయడం ప్రారంభించారు.కలం ఆమె బలం1990 తర్వాత వీరి కుటుంబం నెల్లూరుకు మారింది. అక్కడ కూడా ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా చేరారు. 1992లో ఆమెను ప్రభుత్వ ఉద్యోగం వరించింది. నెల్లూరు జిల్లా పల్లెపాడు గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా మొదలైన ఆమె జీవితం ఎన్నో విజయాలను సాధించింది. 'కలం ఆమె బలం', 'అక్షరం ఆమె ఆయుధం'గా ముందుకు దూసుకు వెళ్లారు. 1992లో నెల్లూరు జిల్లా రచయితల సంఘంలో సభ్యురాలయ్యారు. 2006లో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అప్పటి నుండి ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎందరో గొప్ప గొప్ప సాహితీవేత్తలను నెల్లూరుకి ఆహ్వానించారు. ఎన్నో సాహిత్య ఉపన్యాసాలు విని సాహిత్యంపై మంచి పట్టు సంపాదించారు.తల్లి ప్రోత్సాహం2003లో ఆమె మొదటి పుస్తకం 'అడవి ఉరేసుకుంది' కవితా సంపుటి అచ్చులోకి వచ్చింది. ఇక్కడ ఆమె తల్లి మాణిక్యమ్మ గురించి రెండు మాటలు చెప్పక తప్పదు. అన్నపూర్ణ సాహిత్య రంగంలో ముందుకు వెళ్లేందుకు తల్లి ప్రోత్సాహం ఎంతో ఉంది. నెల్లూరులో జరిగితే ప్రతి సాహిత్య కార్యక్రమానికి ఆమె హాజరయ్యేవారు. కూతుర్ని అందరూ మెచ్చుకుంటుంటే చాలా సంతోషించేవారు. అందుకే అన్నపూర్ణ తన తల్లి మరణానంతరం 2013 నుండి 'పాతూరి మాణిక్యమ్మ రాష్ట్ర స్థాయి స్మారక సాహిత్య పురస్కారం' ద్వారా ఉత్తమ కవితా, కథా సంపుటులకు నగదు పురస్కారాలు ప్రారంభించారు. ఈ పురస్కారం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగు వారికి కూడా వర్తిస్తుంది. ప్రస్తుతం ఈ అవార్డు ద్వారా ఎందరో యువ కవులు స్ఫూర్తి పొందారు.అచ్చయిన పుస్తకాలుఅన్నపూర్ణ రాసిన అడవి ఉరేసుకుంది, నిశ్శబ్దాన్ని వెతక్కు, మనసు తడి, నడిచొచ్చిన దారంతా అనే కవితా సంపుటులు, పెన్నా తీరాన నానీలు, హృదయ అక్షరాలు అనే నానీల సంపుటులను అచ్చులోకి తెచ్చారు. అంతేకాదు వీరి సంపాదకత్వంలో 'మనసు చెప్పిన కథలు', 'కాలుతున్న కాలం(కరోనా పై కథలు)', 'మేం అడగాలా జిల్లాలకు మహిళల పేర్లు పెట్టమని' అనే కవితా సంకలనాలు అచ్చులోకి వచ్చాయి. దాదాపు 50కి పైగా కథలు వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. కొన్ని కథలకి జాతీయ స్థాయిలో బహుమతులు వచ్చాయి. ఆన్లైన్‌లో ఆమె కథలు వేరే వారు కూడా చదువుతున్నారు. ఆమె కృషిని మెచ్చి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం అందించింది. నెల్లూరు జిల్లా సాంస్కృతిక మండలి నిర్వహణలో ఉగాది పండగ రోజున కవి సమ్మేళనం దాదాపు ఏడెనిమిదేండ్ల పాటు నిర్వహించిన తీరు కూడా వీరికి పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టింది. ఆల్ ఇండియా రేడియో ద్వారా కూడా కవితలు, కథలు చదువుతున్నారు. 2011 నుండి అన్నపూర్ణ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ సంస్థ ద్వారా పుస్తకాలను కూడా తీసుకొస్తున్నారు. స్త్రీల సమస్యలపై పోరాటాలు సైతం చేస్తున్నారు.సాహిత్య సేవ చేస్తూనే ఉంటానాద

కుటుంబం ముఖ్యంగా మావారు నాకు చాలా సహకరిస్తారు. ఆయనకు సాహిత్య పట్ల పెద్దగా ఆసక్తి లేకపోయినా నన్ను మాత్రం అడ్డుకోరు. మా పిల్లలు కూడా అంతే. ఉద్యోగం, కుటుంబం, సాహిత్యం అన్నీ ముఖ్యమైనవే. దేన్నీ నిర్లక్ష్యం చెయ్యకూడదు. అందుకే దేని టైమ్ దానికి కేటాయించుకుని పని చేస్తుంటాను. అన్నిటికి కారణం నా మనసు. అది ఆలోచిస్తూనే ఉంటుంది. మనం ఏం చేయాలన్నా మన ఆరోగ్యం చాలా ముఖ్యం. సాహితీసేవ ఇంకా చేయగలననే నమ్మకం ఉంది. సమాజానికి పనికొచ్చే విధంగా మన రచనలు ఉండాలి. యువతరాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేయాలి. పుస్తక పఠనం నేర్పాలి. ఇతరులు రాసిన పుస్తకాలు చదవడం, వీలైతే మంచి రచనలు చెయ్యడం నాలక్ష్యం. పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు భాషమీద, సాహిత్యం మీద చైతన్యం, అభిలాష కల్పించాలని నా కోరిక.

# ఇరాన్‌తో వ్యాపారం చేస్తే 25శాతం టారిఫ్‌లు..




**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా ఇప్పటికే 50శాతం సుంకాలను ఎదుర్కొంటోన్న భారత్‌కు తాజాగా మరో సవాల్ ఎదురైంది. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనే ఇందుక్కారణం. ఎందుకంటే ఇరాన్ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో భారత్ ఇరాన్-భారత్ వాణిజ్యం ఇలా..టెహ్రాన్‌లోని భారత ఎంబసీ గణాంకాల ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం 1.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఇరాన్‌కు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో 0.44 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను టెహ్రాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అంటే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ దాదాపు 1.68 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.15వేల కోట్లకు పైమాటే.భారత్ నుంచి ప్రధానంగా బియ్యం, తేయాకు, చక్కెర, ఫార్మా, ఆర్గానిక్ రసాయనాలు వంటివి ఇరాన్‌కు ఎగుమతి అవుతున్నాయి. వీటిలో అత్యధికంగా సేంద్రియ రసాయనాల ఎగుమతుల విలువ 512.92 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇక, టెహ్రాన్ నుంచి మనం పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్, పండ్లు, నట్స్ వంటి వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 311.60 బిలియన్ డాలర్ల విలువైన పిస్తా, ఇతర ఎండుఫలాలు, నట్స్ ఇరాన్ నుంచి దిగుమతి అయ్యాయి. అయితే ట్రంప్ నిర్ణయం వాణిజ్యపరంగానే గాక, భారత వ్యూహాత్మక ప్రయోజనాల పైనా ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. భారత ప్రాంతీయ అనుసంధాన ప్రణాళికలు, సరఫరా గొలుసుకు ఇరాన్‌తో కలిసి చేపడుతోన్న చాబహార్ పోర్ట్ ప్రాజెక్ట్ అత్యంత కీలకం. గతంలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలు విధించిన సమయంలో ఈ పోర్ట్‌కు కొన్ని మినహాయింపులు కల్పించింది. ఇప్పుడు తాజా టారిఫ్‌ల ప్రకటనతో ఈ ప్రాజెక్ట్ భవితవ్యంపై అనిశ్చితి నెలకొంది.75శాతం బాదుడు తప్పదా?రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో ఇప్పటికే భారత ఉత్పత్తులపై ట్రంప్ 50శాతం సుంకాలను (౧తీబీఎజూ ౧జీతీతిటటబ నీని ఎనిటతిజీ) వసూలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రెండు దేశాలు ట్రేడ్ డీల్ చేసుకునేందుకు గత కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నాయి. ఈ పరిణామాల వేళ తాజా టారిఫ్‌ల ప్రకటనతో భారత్-అమెరికా వాణిజ్యఒప్పందంపై మరోసారి సందిగ్ధత నెలకొంది. అంతేకాదు.. ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగితే.. భారత ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 75 శాతానికి పెరుగుతాయి. అది మన దేశంలోని పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. అయితే, ట్రంప్‌హాజాగా ప్రకటించిన టారిఫ్‌లు ఎంతవరకు అమల్లో ఉంటాయనే దానిపైనా స్పష్టత లేదు. ఎందుకంటే.. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు విధిస్తున్న టారిఫ్‌లకు చట్టబద్ధత ఉందా? లేదా అన్నదానిపై అగ్రరాజ్యం లోని సుప్రీంకోర్టు బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) కీలక తీర్పు వెలువరించనుంది.సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "టారిఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తే అమెరికా వందల కొద్దీ బిలియన్ డాలర్లను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మన దేశంలోకి పెట్టబడులు కూడా తగ్గుతాయి. ఇతర దేశాలు మన దగ్గరకు వచ్చి ఫ్యాక్టరీలు, ప్లాంట్లను నిర్మించరు. ఈ టారిఫ్‌లతో ఇప్పుడు అమెరికా వెలిగిపోతోంది. ఇదిలాగే కొనసాగాలి. జాతీయ భద్రతకు సంబంధించిన ఈ విషయంలో సుప్రీం తీర్పు వ్యతిరేకంగా వస్తే మాత్రం అది అమెరికాకు తీవ్ర ఇబ్బందే" అని ట్రంప్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

# హెచ్‌సీఎల్' ఆదాయం పెరిగినా.. లాభం తగ్గింది




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరులో రూ.4,076 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.4,591 కోట్లతో పోలిస్తే ఇది 11.2% తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.29,890 కోట్ల నుంచి 13.3% పెరిగి రూ.33,872 కోట్లకు చేరింది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, నికర లాభం 3.7% తగ్గినా, ఆదాయం 6% పెరిగింది.'సమీక్షా త్రైమాసికంలో బలమైన ఆదాయం నమోదు కావడంతో, ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 15 బి.డాలర్లు (సుమారు రూ.1.35 లక్షల కోట్లు) అధిగమించే అవకాశం కనిపిస్తోంది. కొత్త ఆర్డర్లు 3 బి.డాలర్ల (రూ.27,000 కోట్ల) మేర లభించాయి. సాఫ్ట్‌వేర్ ఆదాయం స్థిర కరెన్సీ ప్రకారం త్రైమాసిక ప్రాతిపదికన 28.1%, వార్షిక ప్రాతిపదికన 3.1% పెరిగాయి. క్లయింట్ల ఏఐ గిరాకీకి తగ్గట్లు, మేం రూపాంతరం చెందుతున్నామ'ని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సి.విజయకుమార్ వెల్లడించారు. సమీక్షా త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ 2,852 మంది తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను తీసుకుంది. డిసెంబరు ఆఖరుకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,26,379కు చేరింది.ఫ్రెషర్లలో అత్యున్నత నైపుణ్యాలుంటే: ఎలైట్ ఇంజినీర్ల నియామక వ్యూహంలో భాగంగా, అధునాతన నైపుణ్యాలున్న తాజా ఉత్తీర్ణులకు వార్షికంగా రూ.18-22 లక్షల వేతనం చెల్లించేందుకు కంపెనీ సిద్ధమైంది. ప్రామాణిక ప్రారంభ స్థాయి ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే ఇది 3-4 రెట్లు ఎక్కువ.విక్రయ వృద్ధి అంచనాల్లో మార్పులుహెచ్‌సీఎల్ టెక్ 2025-26 విక్రయాల్లో గరిష్ఠ వృద్ధి అంచనాను 5% నుంచి 4.5 శాతానికి కుదించినా, కనిష్ఠ వృద్ధి అంచనాను 3% నుంచి 4 శాతానికి పెంచింది. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, విక్రయాల అంచనాల్లో వృద్ధి స్థిర కరెన్సీ ప్రాతిపదికన 4-4.5 శాతంగా ఉంచింది. సెప్టెంబరు త్రైమాసికం ఆఖర్లో ఇది 3-5 శాతంగా తెలిపింది. సేవల విభాగంలో 2025-26 విక్రయాల వృద్ధి అంచనాను 4-5% నుంచి 4.75-5.25 శాతానికి పెంచింది. డిసెంబరు త్రైమాసికంలో స్థిర కరెన్సీ వద్ద ఈ విభాగంలో ఆదాయ వృద్ధి 5 శాతంగా నమోదైంది.కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను 17-18% వద్ద మార్పు లేకుండా ఉంచింది. కొత్త లేబర్ కోడ్‌ల అమలు నేపథ్యంలో, గ్రూప్‌లోని ఉద్యోగుల ప్రయోజనాల కోసం, ఏక కాల కేటాయింపులు రూ.9,560 కోట్లు జరిపినట్లు .. ఈ ప్రభావాన్ని మినహాయిస్తూ, ఇచ్చిన ఎబిటా మార్జిన్ అంచనా ఇది. అని వివరించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.12 చొప్పున మధ్యంతర డివిడెండు చెల్లించనున్నారు.

# టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేసే పండు

జీవనశైలిలో, ఆహారపు అలవాట్లల్లో వచ్చిన మార్పులే ఈ సమస్య బారిన పడడానికి ప్రధాన కారణాలు అని చెప్పవచ్చు. డయాబెటిస్ కారణంగా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేసే పండు ఇది.. రోజూ తినాలి..!

ఎజూవ 2 ఆతిజీఎవబివబ । టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు రోజురోజుకీ పెరుగుతున్నారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లల్లో వచ్చిన మార్పులే ఈ సమస్య బారిన పడడానికి ప్రధాన కారణాలు అని చెప్పవచ్చు. డయాబెటిస్ కారణంగా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కనుక డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. సరైన జీవన శైలితో పాటు డయాబెటిస్ ను అదుపులో ఉంచే ఆహారాలను తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ను మనం అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. మనం తీసుకునే ఆహారాలే డయాబెటిస్ నిర్వహణలో ముఖ్య పాత్ర పోషిస్తాయని వారు తెలియజేస్తున్నారు. టైప్ 2 డయాబెటిస్ ఉన్న వారు తమ అల్పాహారంలో భాగంగా అవకాడోను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు అల్పాహారంలో భాగంగా అవకాడోను తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వైద్యులు వివరిస్తున్నారు.



**ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు..**

అవకాడోలో మన ఆరోగ్యానికి మేలు చేసే కొవ్వులు, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉంటాయి. 150 గ్రాముల అవకాడోలో 22 గ్రాముల కొవ్వులు, 10.1 గ్రాముల ఫైబర్ ఉంటుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. అవకాడోను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. అలాగే అవకాడోలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అదే విధంగా అవకాడోలో పొటాషియం అధికంగా ఉంటుంది. డయాబెటిస్ మాత్రమే కాకుండా అధిక రక్తపోటుతో బాధపడే వారు దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. అవకాడోను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ విధంగా డయాబెటిస్ తో బాధపడే వారికి అవకాడో ఎంతో మేలు చేస్తుంది.

**ఇతర ఆహారాలు కూడా..**

ఇక అవకాడోలు మాత్రమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచే ఇతర ఆహారాలను కూడా డయాబెటిస్ తో బాధపడే వారు తీసుకోవచ్చు. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు తక్కువ కార్బొహైడ్రేట్స్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాలను తీసుకోవాలి. బ్రౌన్ రైస్, తృణ ధాన్యాలు, ఓట్ మీల్స్, తాజా పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, గింజలు వంటి ఆహారాలను తీసుకోవాలి. అలాగే డయాబెటిస్ తో బాధపడే వారు కొన్ని ఆహారాలను ఎల్లప్పుడూ దూరంగా ఉండాలి. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. చక్కెర పానీయాలు, మద్యం, వేయించిన ఆహారాలు, కార్బొనేటెడ్ పానీయాలు, జంక్ ఫుడ్, ప్రాసెస్డ్, ప్యాక్ చేసిన ఆహారాలు, తీపి పదార్థాలు, మైదాతో చేసిన ఆహారాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయి. ఈ విధంగా తగిన ఆహారాలు తీసుకుంటూ చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవచ్చు. తద్వారా శరీర మొత్తం ఆరోగ్యం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

# పరోపకారి



నరహరిపురంలోని శరభయ్య ఒకసారి పొరుగూరుకు కాలినడకన తన చేతిలో డబ్బు సంచీతో పనిమీద బయలుదేరాడు. అతడు ఆ ఊరుకు వెళ్లాలంటే ఒక అడవిని దాటాల్సి ఉంది. ఆ అడవిలో క్రూరమృగాలు లేవు. అందువల్ల శరభయ్య ఎవ్వరూ తోడు లేకుండా ఒంటరిగా బయలుదేరాడు. అతడు ఆ అడవిని సమీపించగానే అకస్మాత్తుగా వెనుకనుండి ఒక కోతి వచ్చి అతని సంచిని లాక్కొని మెరుపులా మాయమైంది. శరభయ్య దాని వెంబడి పరిగెత్తినా లాభం లేకపోయింది. తన అజాగ్రత్తకు తనను తానే తిట్టుకున్నాడు శరభయ్య. ఆ సంచిలో చాలా డబ్బు ఉంది. "అయ్యో! ఇప్పుడు నా సంచి ఎలా దొరుకుతుంది? డబ్బు లేకుండా నేను పొరుగూరు వెళ్లి ఏం ప్రయోజనం? అది లేకుండా నా పని పూర్తి కాదే! ఇప్పుడు నేను ఏం చేయాలి?" అని ఏడవసాగాడు. ఇంతలో రామయ్య అనే వ్యక్తి ఎదురుగా వచ్చి ఎందుకు ఏడుస్తున్నావని ఆ శరభయ్యను ప్రశ్నించాడు? శరభయ్య తాను డబ్బు సంచి పోగొట్టుకున్నట్లు చెప్పాడు. అప్పుడు రామయ్య "మీరేం బాధపడకండి! మీ సంచి మీకు తప్పకుండా దొరుకుతుంది. మీరు ఇంకొంచెం ముందుకు వెళ్ళితే అక్కడ చేమంతిపురం అనే ఊరు వస్తుంది. అక్కడ ధర్మయ్య అనే పరోపకారికి ఈ కోతుల గురించి బాగా తెలుసు. చాలా కోతులు ఆయన ఇంటికి ఆహారం కొరకు వస్తాయి కూడా! బహుశా ఈ కోతి కూడా ఆయన ఇంటికి వెళ్లి ఉంటుంది. అక్కడ మీ సంచి దొరకవచ్చు" అని సలహా ఇచ్చాడు. వెంటనే శరభయ్య ఆ ఊరికి చేరి ధర్మయ్యను కలిసి తన డబ్బు సంచి ఒక కోతి ఎత్తుకుపోయిందని చెప్పాడు. తర్వాత శరభయ్య "అయ్యా! మీ ఇంటికి ఈరోజు కోతులు వచ్చాయా! వాటి చేతుల్లో మీరు నా సంచిని చూశారా?" అని ధర్మయ్యను ప్రశ్నించాడు. అప్పుడు ధర్మయ్య "కోతులు వచ్చాయి గాని వాటి చేతుల్లో నేను ఆ సంచిని చూడలేదు. నీవేం భయపడకు! అవి తినే పదార్థాలు కావు కాబట్టి నీ సంచి ఎక్కడికీ పోదు. తప్పకుండా దొరుకుతుంది. అది అందులో ఏదైనా ఆహార పదార్థాలు ఉన్నాయేమోనని ఎత్తుకెళ్లింది. కోతికి డబ్బులు ఎందుకు? ఒక్క దొంగలకు మాత్రం ఆ సంచి దొరకకుంటే చాలు" అని ధైర్యం చెప్పాడు. అప్పుడు శరభయ్య చాలా నిరాశ పడ్డాడు. అది గమనించిన ధర్మయ్య "ఒక పని చేద్దాం. రేపు మళ్లీ కోతులు వస్తాయి. అవి ఒకవేళ నీ సంచి తెచ్చినా ఫరవాలేదు. లేకుంటే మనమే వాటిని వెంబడించి వెళ్దాం! అంతవరకు నువ్వు మా ఇంట్లోనే ఉండు" అని అతనికి అతిథ్యం ఇచ్చాడు. అందుకు శరభయ్య సంతోషించాడు. మరునాడు కోతులు వచ్చాయి. కానీ వాటి చేతుల్లో డబ్బు సంచి మాత్రం లేదు. వెంటనే ధర్మయ్య శరభయ్యతో పాటు కోతుల వెంబడి వాటిని అనుసరించి వెళ్ళాడు. అవి కొద్దిదూరం వెళ్ళిన తర్వాత అడవిలోని చెట్లల్లో మాయమయ్యాయి. అప్పుడు శరభయ్య చాలా నిరాశ పడ్డాడు. ధర్మయ్య అతనికి ధైర్యం చెప్పి తిరిగి వస్తుండగా ఒక చెట్టుకు ఆ సంచి వేలాడుతూ కనిపించింది. ధర్మయ్య వెంటనే దాన్ని తీసి చూశాడు. అందులో శరభయ్య డబ్బు సురక్షితంగా ఉంది. వెంటనే అతడు దానిని శరభయ్యకు అప్పగించాడు. శరభయ్య ఎంతో సంతోషించి "అయ్యా! మీలాంటి పరోపకారులు ఉండడం వల్లనే నాలాంటి వారికి మేలు జరుగుతున్నది. మీ సహాయాన్ని నేను మరవలేను" అంటూ తన సంచిని వెతుకుటలో తనకు సహకరించినందుకు ధర్మయ్యకు తన ధన్యవాదాలను తెలిపాడు.

# కండరాలు పెరిగి చక్కని దేహం కావాలలి



కండరాలను పెంచుకోవడానికి చాలా మంది జిమ్ చేస్తూ ఉంటారు. జిమ్ చేయడం, బరువులు ఎత్తడం వల్లనే కండరాలు దృఢంగా తయారవుతాయని చాలా మంది భావిస్తారు. కానీ కండరాల పెరుగుదలకు వ్యాయామం చేయడం ఒక్కటే మార్గం కాదు. కండరాల పెరుగుదల మీరు జిమ్ చేసే ముందు, చేసిన తరువాత తీసుకునే ఆహారాలపై కూడా ఆధారపడి ఉంటుంది. మీరు తీసుకునే ఆహారంపైనే కండరాలు ఎంత వేగంగా పెరుగుతాయి, ఎంత త్వరగా కోలుకుంటాయి అనేది ఆధారపడి ఉంటుంది. ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, సరైన కార్బొహైడ్రేట్లు వంటి పోషకాలను తీసుకున్నప్పుడే కండరాల పెరుగుదల, మరమ్మత్తు వేగంగా ఉంటుంది. ఏం తినాలో.. ఎప్పుడు తినాలో.. తెలుసుకున్నప్పుడే మన శరీర కండరాలు ఆరోగ్యంగా, దృఢంగా ఉంటాయి. కండరాలను పెంచుకోవాలనుకునే వారు వ్యాయామం చేయడంతో పాటు తీసుకోదగిన ఆహారాల గురించి.. అలాగే వీటిని ఎప్పుడు తీసుకోవాలి.. అన్న వివరాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

పెరుగు..

ప్రోటీన్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉండే ఆహారాల్లో చికెన్ బ్రెస్ట్ ఒకటి. దీనిలో 26 నుండి 31 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. గ్రిల్ చేసుకుని లేదా తక్కువ నూనెతో ఫ్రై చేసుకుని దీనిని తీసుకోవచ్చు. జిమ్ కు ముందు లేదా తర్వాత అయినా దీనిని తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్ తో ఈ చికెన్ బ్రెస్ట్ ను తీసుకుంటే త్వరగా కోలుకుంటారు. అలాగే పెరుగును తీసుకోవడం వల్ల కూడా మన శరీరానికి తగినంత ప్రోటీన్ అందుతుంది. దీనిలో ఎక్కువ ప్రోటీన్ ఉంటుంది. పెరుగును తీసుకోవడం వల్ల కండరాలకు ఆమైనో ఆమ్లాలు స్థిరంగా అందుతాయి. వ్యాయామం తరువాత లేదా పడుకునే ముందు పెరుగును తీసుకోవడం మంచిది. కండరాలకు అవసరమయ్యే అమైనో ఆమ్లాలు, విటమిన్ బి12, విటమిన్ డి, వ్యాయామం తరువాత తిరిగి శక్తిని పొందడానికి అవసరమయ్యే కొవ్వులు ఉండే ఆహారాల్లో గుడ్డు ఒకటి.

కోడిగుడ్లు..

రోజూ ఒక ఉడికించిన గుడ్డును పచ్చసొనతో సహా తీసుకోవడం వల్ల కండరాల పెరుగుదల వేగంగా ఉంటుంది. ఇక ప్రోటీన్ తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉండే ఆహారాల్లో చేపలు ఒకటి. ఇవి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లతో నిండి ఉంటాయి. చేపలను తీసుకోవడం వల్ల కండరాల మరమ్మత్తు వేగంగా ఉంటుంది. వారానికి రెండు సార్లు మధ్యాహ్న భోజనంలో లేదా రాత్రి భోజనంలో వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. సలాడ్ రూపంలో, గ్రిల్ రూపంలో వీటిని తీసుకునే ప్రయత్నం చేయాలి. మొక్క ఆధారిత ప్రోటీన్ ను కలిగి ఉండే వాటిలో కినోవా ఒకటి. వీటిలో తొమ్మిది రకాల అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఫైబర్, ఐరన్, మెగ్నిషియం వంటి పోషకాలు కూడా ఇందులో ఉంటాయి. ఈ పోషకాలన్నీ కండరాలు బాగా పనిచేయడానికి, శక్తిని పెంచడానికి దోహదపడతాయి. కండరాల పెరుగుదలకు రాత్రి భోజనంలో కినోవాను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

పనీర్..

కాటేజ్ చీజ్ లేదా పనీర్ ప్రోటీన్ తో నిండి ఉంటుంది. ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది. కనుక గంటల తరబడి కండరాలకు కావల్సిన శక్తి లభిస్తుంది. దీనిని రాత్రిపూట తీసుకోవడం మంచిది. సలాడ్, గ్రిల్ వంటి వాటితో దీనిని తీసుకోవడం వల్ల కండరాలకు కావల్సిన శక్తి లభిస్తుంది. అలాగే తృణ ధాన్యాలను, గింజలను తీసుకోవడం వల్ల కండరాల మరమ్మత్తు వేగంగా ఉంటుంది. వీటిలో ఉండే మెగ్నిషియం కండరాల పనితీరును, వాటిని మరమ్మత్తు చేయడంలో సహాయపడుతుంది. వీటిని స్నాక్స్ గా తీసుకోవడం మంచిది. ప్రోటీన్స్, మంచి కొవ్వులు, ఇతర పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల కండరాల పెరుగుదల వేగంగా ఉండడంతో పాటు వాటి మరమ్మత్తు కూడా చక్కగా జరుగుతుంది. ఇక వ్యాయామం చేసిన 30 నుండి 90 నిమిషాల వ్యవధిలో కొంత ప్రోటీన్, కార్బొహైడ్రేట్స్ తీసుకోవాలని ఒక లక్ష్యంగా పెట్టుకుని సరైన ఆహారాన్ని తీసుకోవాలి. వ్యాయామం చేయడంతోపాటు ఇలా చక్కటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల మనం ఆరోగ్యకరమైన, ధృడమైన కండరాలను సొంతం చేసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.


# వంటలో 'బహుమతి

**హైదరాబాద్ పెన్ పవర్:** అనగనగా ఒక రాజు. ఆ రాజుకు షష్ఠిపూర్తి ఉత్సవం రంగరంగ వైభవంగా జరగింది. ఈ ఉత్సవంలో రాజు "వచ్చే ఆదివారం నేనొక ప్రశ్న వేస్తాను. దానికి జవాబు చెప్పినవారికి వెయ్యి బంగారు కాసులు ఇస్తాను. కొలువులో ఉద్యోగం కూడా ఇస్తాను" అని ఒక ప్రకటన చేశాడు. మహారాజు ఏం ప్రశ్న వేస్తాడో, ఏమో, జవాబు చెప్పగల అదృష్టవంతులెవరో అని చర్చ ప్రారంభమైంది. జనం ఇదే మాట్లాడుకోసాగారు. ఇక పండితులు, మేధావులు సరేసరి. తమ అదృష్టాన్ని, తెలివిని పరీక్షించుకుందామని తహతహలాడసాగారు. కొందరైతే శాస్త్రాలు తిరగెయ్యసాగారు. అలా అలా ఈ వార్త గ్రామాల్లోకి పాకింది. ఒక రైతు కూతురు వెన్నెల అనే అమ్మాయి చెవిలో కూడా ఈ వార్త పడింది. వెన్నెల చాలా తెలివైన పిల్ల. తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. తను కూడా రాజధానికి వెళతానని వెన్నెల మారాం చేసింది. అమ్మా నాన్నా వొప్పుకొన్నారు. ఆదివారం రానే వచ్చింది. జనం తండోపతండాలుగా రాజధానికి చేరుకొన్నారు. పండితులు, విద్యావేత్తలు, ఎక్కడెక్కడి నుంచో శాస్త్రాలు పట్టుకొని బయలుదేరి వచ్చారు. వెన్నెల కూడా వాళ్లమ్మా నాన్నలతో పాటు వచ్చింది. జనం కిటకిటలాడుతున్నారు. అయినా చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దం. అందరూ రాజు ప్రశ్నకోసం ఎదురు చూస్తున్నారు. రాజు ఇలా చెప్పాడు? "మహారాణి గారికి గుత్తి వంకాయ కూర తినాలన్పించింది. వెంటనే వంటవాడిని పిలిచింది. మసాలా బాగా వెయ్యి. ఘుమఘుమలాడేలా గుత్తి వంకాయ కూర చెయ్యి, అని ఆజ్ఞాపించింది. వంటవాడు రంగంలో దిగాడు. సన్నికల్లు మీద మసాలా నూరుతున్నాడు. కూర వండకముందే వాసన గుబాళించేస్తోంది. వంటవాడి కూతురు ఉయ్యాల్లో ఏడుస్తోంది. పొయ్యిదగ్గర వున్న నీళ్ళ గంగాళం పట్టుకొని వంటవాడి కొడుకు ఆడుకొంటున్నాడు. ఆ నీళ్ళు పడి మంటలు ఆరుతున్నాయి. వంటవాడికి ఎక్కడలేని కోపం వస్తోంది. ఈ సంగతి వంటవాడి భార్య చూసింది. ఒరే పొయ్యి దగ్గరేం ఏ పనిరా? పొయ్యిలో పడ్డావంటే నీ చావు మూడుతుంది. జాగ్రత్త', అని వాణ్ణి తిట్టి దూరంగా లాగింది. ఎలాగైతేనేం గుత్తి వంకాయకూర తయారైంది. దాని రుచిని మహారాణిగారు మహదానందపడిపొయ్యారు. సంతోషం పట్టలేక ఆమె వంటవాణ్ణి పిలిచింది. బంగారుకాసులు బహుమానంగా ఇచ్చింది. కథ బాగా విన్నారుగా. రాణీగారు వంటవాడికి ఎన్ని బంగారు కాసులిచ్చింది? ఇదీ ప్రశ్న. సమాధానం కథలోనే వుంది. ఎవరు జవాబు చెబుతారో చెప్పండి" అని ముగించాడు రాజు. పండితులందరూ తలలు గోక్కున్నారు. కొందరు చెత్త ప్రశ్న అన్నారు. కొందరు ఇదెక్కడా శాస్త్రంలో కన్పించలేదు అని గొణుక్కొన్నారు. వెన్నెల వాళ్ళ నాన్న భుజాల మీది కెక్కి 'రాజా, జవాబు నేను చెబుతా' అంటూ పెద్దగా అరిచి చేతులూపింది. రాజు ఆ పిల్లను దగ్గరికి పిలిచాడు. "చెప్పమ్మా. పెద్దవాళ్ళే జవాబు చెప్పనక్కరలేదు. తెలివిలో ఎవరు పెద్దయితే వాళ్ళే పెద్ద" అని ఆప్యాయంగా అడిగాడు. "రాజా! రాణిగారిచ్చిన కాసులు వెయ్యిన్నూట పదహారు" అని జవాబు చెప్పింది వెన్నెల. రాజు ఆ పిల్లను దగ్గరకు తీసుకొన్నాడు. 'శభాష్! చిన్నదానివైనా సరిగ్గా చెప్పావు. సరేగానీ జవాబు ఎలా చెప్పగలిగావు?' అని వెన్నెలని అడిగాడు. "జవాబు మీ కథలోనే వుంది రాజా. మసాలా వెయ్యిలో 'వెయ్యి' వుంది. నూరుతున్నాడులో 'నూరు' వుంది. ఏడుస్తోందిలో 'ఏడు' వుంది. 'ఆరుతున్నాయిలో 'ఆరు' ఉంది. మూడుతుందిలో 'మూడు' వుంది. మొత్తం కలిపితే 'వెయ్యిన్నూట పదహారు' గదా అంది వెన్నెల. సభ కళతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది.

# తెలివే గెలిచింది

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక దట్టమైన అడవిలో అనేక రకాల జంతువులు నివసించేవి. ఎండాకాలంలో వాటికి ఒకే ఒక నీటి ఆధారం అడవి మధ్యలో ఉన్న చిన్న కొలను. ఎండ తీవ్రంగా ఉండడంతో, చిన్న చిన్న నీటి గుంటలన్నీ అడుగంటాయి. దాహం తీర్చుకోవడానికి మిగిలిన జంతువులన్నిటికీ ఆ కొలనే దిక్కు. అదే అడవిలో ఒక పొగరుబోతు ఏనుగు ఉండేది. అది తన బలాన్ని చూసుకుని చాలా అహంకారంగా ఉండేది. ఆ పొగరుతో కొలనును పూర్తిగా తన సొంతం చేసుకుంది. ఏ జంతువునూ నీళ్లు తాగనిచ్చేది కాదు. చిన్న జంతువులు దాహం వేసి బతిమాలినా, వాటిని తరిమికొట్టి, దాడిచేసి బాధపెట్టేది. ఆ ఏనుగు వల్ల, జంతువులన్నీ దాహం తీర్చుకోవడానికి పది క్రోసుల దూరంలో ఉన్న ప్రమాదకరమైన దారిలో నదికి వెళ్లాల్సి వచ్చేది. ఏనుగు ఆగడాలు ఎక్కువ కావడంతో, జంతువులన్నీ సమావేశమై ఆ తీవ్రమైన సమస్యను గురించి మాట్లాడుకున్నాయి. ఏనుగును బతిమాలినా లాభం లేదని, ఎలాగైనా దాన్ని వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఆ సమయంలో, చిన్నదైనా చాలా తెలివైన ఒక కుందేలు ముందుకు వచ్చింది. ఆ పొగరుబోతు ఏనుగును తనే లొంగదీస్తానని ధైర్యం చెప్పింది. అప్పుడు జంతువులు, "ఒకప్పుడు పులి మీసాలు మెలివేసిన దానివి, ఈ ఏనుగు మదాన్ని తప్పక అణచేస్తావు" అంటూ కుందేలుపై నమ్మకం ఉంచాయి.?కుందేలు బాగా ఆలోచించి, తన ప్రణాళికతో ఆ రాత్రి చీకటిలోనే పది క్రోసుల దూరం నడిచి నది దగ్గరకు వెళ్లింది. నీటిలో ఉన్న మొసళ్ళ నాయకుడిని పిలిచి, తమ అడవిలోని కష్టాన్ని వివరించింది. "మిత్రమా, మీరు మాకు ఈ సాయం చేస్తే, మేము మీకు అడవిలోని మంచి పండ్లు, దుంపలు తెచ్చిపెడతాము, మీ మేలు మర్చిపోము. మీకు కూడా కావలసినంత రుచికరమైన ఏనుగు మాంసం దొరుకుతుంది" అంటూ మొసళ్లకు ఆశచూపుతూ బతిమాలింది. "పని పూర్తికాగానే కొలను ఖాళీ చేసి వెళ్ళాలి" అని షరతుపెట్టింది. మొసళ్లు ఏనుగు మాంసానికి ఆశపడి ఆ షరతును అంగీకరించి, సాయం చేయడానికి వెంటనే బయలుదేరాయి. ఆ రాత్రే, కుందేలుతో కలిసి కొన్ని మొసళ్ళు కొలను దగ్గరకు వచ్చి దాక్కున్నాయి. ఏనుగు మేతకు వెళ్లిన వెంటనే, మొసళ్లు కొలనులోకి చేరి, నీటిలో కనబడకుండా మాటు వేశాయి. మేతమేసి తిరిగి వచ్చేదాక కొలను వద్ద ఎదురుచూచి, ఏనుగు దగ్గరకు రాగానే కుందేలు, "ఏనుగా! నా మాట విని నీ గర్వాన్ని వదిలి, అందరితో కలిసిపో. సాటి జంతువులకు నీళ్లు తాగే అవకాశం ఇవ్వు. ఇది నీకు నా చివరి అవకాశం," అని గట్టిగా చెప్పింది. ఆ మాటలకు ఏనుగుకు కోపం వచ్చింది. "చిన్న జీవివి నాకే సలహా చెబుతావా? నిన్ను తొక్కి చంపుతాను! వెంటనే ఇక్కడి నుంచి వెళ్ళు" అంటూ కోపంగా ఘీంకరిస్తూ కొలనులోకి దిగింది. ఏనుగు నీళ్లు చిమ్ముకుంటూ లోపలికి వెళ్లగానే, అదను చూసి! కొలనులో మాటు వేసి ఉన్న మొసళ్లు ఒక్కసారిగా ఏనుగుపై దాడి చేశాయి. మొసళ్లు గట్టిగా ఏనుగు కాళ్లు, తొండం పట్టుకుని నీటి లోపలికి లాగడం మొదలుపెట్టాయి. ఊహించని ఈ దాడికి ఏనుగు భయపడింది. బాధతో పెద్దగా అరిచింది. తన బలం అంతా ఉపయోగించినా, మొసళ్ల పట్టు నుంచి కదలలేకపోయింది. అహంకారంతో చెలరేగిన ఆ ఏనుగుకు, తోటి జంతువులను బాధపెట్టినందుకు తగిన శిక్ష పడింది. అడవి జంతువులన్నీ వచ్చి కుందేలుకు ధన్యవాదాలు చెప్పాయి. వాటి దాహం తీరింది, ఏనుగు పీడ వదిలింది. ఆనందంగా జంతువులన్నీ, "బలం కంటే తెలివే గొప్పది. తెలివే గెలిచింది. ఇకపై, 'ఏనుగు మదం కుందేలు అణచినట్టు' అనే సామెతను మనం ప్రచారం చేద్దాం!" అని చెప్పుకున్నాయి. చిన్న కుందేలు తెలివి అడవిలో అందరికీ స్వేచ్ఛను, శాంతిని అందించింది.

## మునగతో మాతృత్వపు ఆనందం..



ఇటీవల చాలామంది బాలింతలు ఎదుర్కొంటున్న సమస్యల్లో బిడ్డకు సరిపడా చనుబాలు ఉత్పత్తి కాకపోవడం కూడా ఒకటిగా ఉంటోంది. గర్భవతిగా ఉన్నప్పుడు తగిన పౌష్టికాహారం తీసుకోకపోవడం, హార్మోన్ల అసమతుల్యత, పలు శారీరక అనారోగ్యాలు ఇందుకు కారణం అవుతుంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అయితే వీటన్నింటికీ సహజ సిద్ధమైన ఒక చక్కటి పరిష్కారం ఉంది. ఏంటంటే.. మునగ ఆకులను, కాడలను ఆహారంగా వాడటమే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇవి చిన్న పిల్లల తల్లుల్లో బిడ్డకు సరిపడా పాల ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయని చెబుతున్నారు. అదెలాగో చూద్దాం. లిప్రముఖ బయోమెడికల్ అండ్ లైఫ్ సైన్సెస్ జర్నల్ లో పబ్లిషైన ఒక క్లినికల్ రీసెర్చ్ ప్రకారం కూడా మునగను ఆహారంగా తీసుకున్న తల్లుల్లో చనుబాల ఉత్పత్తిలో పెరిగినట్లు వెల్లడైంది. పరిశోధనలో భాగంగా మునగను ఒక సప్లిమెంట్ మాదిరిగా బాలింతలకు ఇచ్చినప్పుడు కేవలం ఐదవ రోజు నాటికి వారిలో బ్రెస్ట్ మిల్క్ ఉత్పత్తి దాదాపు మూడు రెట్లు పెరిగింది. లిమునగ (మోరింగా) ఆకుల్లో, కాడల్లో ఐరన్, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి వంటి తల్లిపాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి బాలింతలు వాటిని ఆహారంగా తీసుకోవడం మంచిందని నిపుణులు సూచిస్తున్నారు. మునగ ఆకుల్లో బయోయాక్టివ్ ప్లాంట్ కాంపౌండ్స్ ఉంటాయి. కాబట్టి తల్లి పాల ఉత్పత్తికి బాధ్యత వహించే హార్మోన్ అయిన ప్రొలాక్టిన్ స్థాయిలను పెంచుతుంది. చనుబాల నాణ్యత, పరిమాణాన్ని కూడా మెరుగుపరుస్తుంది. కాబట్టి గర్భవతులు, బాలింతలు ఏదో ఒక రూపంలో మునగను ఆహారంగా ఉపయోగించడం వారిలో చనుబాల ఉత్పత్తిని పెంచడం ద్వారా మాతృత్వపు ఆనందాన్ని రెట్టింపు చేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

# టీమిండియాతో సెమీ ఫైనల్లో ఓటమి.. 8 సార్లు వరల్డ్ కప్ విజేత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా తరఫున అత్యుత్తమ మహిళా క్రికెటర్లలో ఒకరైన అలిస్సా హీలీ తన అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించింది. బుధవారం (జనవరి 13) హీలీ తన రిటైర్మెంట్ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. మార్చిలో టీమిండియాతో జరగబోయే వన్డే సిరీస్ తన కెరీర్ లో చివరిదని ఈ ఆస్ట్రేలియా కెప్టెన్ కెప్టెన్ తెలిపింది. ఈ టూర్ లో భాగంగా పెర్త్‌లో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ తో పాటు ఒక టెస్ట్ మ్యాచ్ కు హీలీ చివరిసారిగా నాయకత్వం వహిస్తుంది. అయితే టీ20 సిరీస్ కు మాత్రం ఈ ఆసీస్ దిగ్గజం అందుబాటులో ఉండదు. ఎందుకంటే ఆమె 2026 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ ఆడదు. కాబట్టి టీ20 సిరీస్ ఆడినా పెద్ద ప్రయోజనం ఉండదు. రిటైర్మెంట్ తర్వాత హీలీ మాట్లాడుతూ ఇలా చెప్పుకొచ్చింది. " ఆస్ట్రేలియా తరఫున ఇండియాతో జరగబోయే సిరీస్ నా చివరిది కావడం ఎమోషన్ తో కూడుకుంది. ఆస్ట్రేలియా తరఫున ఆడటం నాకు ఇప్పటికీ ఇష్టమే. కానీ నాలో పోటీతత్వం తగ్గిపోయింది. జట్టును ముందుకు నడిపించడంలో నేను వెనకబడ్డాను. నా రిటైర్మెంట్ కు ఇదే సరైన సమయం అని నేను భావిస్తున్నాను. ఈ సంవత్సరం నేను టీ20 ప్రపంచ కప్ ఆడను. ఇండియాతో జరగబోయే టీ20 సిరీస్ ఆడడం లేదు. చివరిసారిగా ఇండియాతో వన్డే, టెస్ట్ సిరీస్ కు కెప్టెన్ గా అవకాశం వచ్చినందుకు నేను సంతోషంగా ఉన్నాను". అని హీలీ చెప్పుకొచ్చింది.

దశాబ్దానికి పైగా హీలీ ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషించింది. ఈ ఆసీస్ కెప్టెన్ ఓవరాల్ గా ఎనిమిది వరల్డ్ కప్ టైటిల్స్ గెలవడం విశేషం. వీటిలో ఆరు టీ20 వరల్డ్ కప్ ట్రోఫీలతో పాటు రెండు వన్డే వరల్డ్ కప్ టైటిల్స్ ఉన్నాయి. గత ఏడాది భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ లో టీమిండియా చేతిలో ఓడిపోవడం హీలీని తీవ్రంగా బాధించింది. ఆస్ట్రేలియా తరపున 10 టెస్ట్ ల్లో 30.56 సగటుతో 489 పరుగులు.. 123 వన్డేల్లో 35.98 యావరేజ్ తో 3563 పరుగులు.. 162 టీ20ఐ మ్యాచ్‌లలో ఒక సెంచరీతో 25.45 సగటుతో 3054 పరుగులు చేసి ఆస్ట్రేలియా క్రికెట్ ;లో దిగ్గజ క్రికెటర్ గా నిలిచింది.

# విజయ్ హజారే ట్రోఫీ సెమీ ఫైనల్‌కు విదర్భ, పంజాబ్.. సెమీస్ షెడ్యూల్ ఇదే!






**హైదరాబాద్ పెన్ పవర్:** విజయ్ హజారే ట్రోఫీలో సెమీస్ కు వెళ్లిన నాలుగు జట్లేవో తెలిసిపోయింది. మంగళవారం (జనవరి 13) కర్ణాటక, సౌరాష్ట్ర సెమీస్ కు చేరుకున్న సంగతి తెలిసిందే. బుధవారం (జనవరి 13) మరో రెండు జట్లు సెమీస్ కు అర్హత సాధించాయి. మధ్య ప్రదేశ్ తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ భారీ విజయం సాధించింది. బెంగళూరు వేదికగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్ 1 లో జరిగిన మ్యాచ్ లో పంజాబ్ ఏకంగా 183 పరుగులు భారీ తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. ప్రబు సిమ్రాన్ సింగ్ 88 పరుగులు చేసి టప స్కోరర్ గా నిలిచాడు. అల్మొప్రీత్ సింగ్ (70), నేహాల్ వధేరా (56) హాఫ్ సెంచరీలు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడారు. లక్ష్య ఛేదనలో మధ్య ప్రదేశ్ కేవలం 162 పరుగులకే ఆలౌటైంది. చివరి క్వార్టర్ ఫైనల్లో ఢిల్లీపై విదర్భ ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. యాష్ రాథోడ్ 86 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. అథర్వ తైదే (62) హాఫ్ సెంచరీతో రాణించాడు. లక్ష్య ఛేదనలో ఢిల్లీ 224 పరుగులకే ఆలౌటైంది. అనుజ్ రావత్ 66 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది.

**సెమీస్ షెడ్యూల్:**

తొలి సెమీ ఫైనల్ : కర్ణాటక జం విదర్భ: గురువారం (జనవరి 15)

రెండో సెమీ ఫైనల్: పంజాబ్ జం సౌరాష్ట్ర: శుక్రవారం (జనవరి 16)

ఫైనల్ : ఆదివారం (జనవరి 18)

**సెమీస్ కు సౌరాష్ట్ర:**

కెప్టెన్ హర్విక్ దేశాయ్ (100 నాటౌట్) సెంచరీతో చెలరేగడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో సౌరాష్ట్ర సెమీస్‌లోకి అడుగుపెట్టింది. ప్రేరక్ మన్కడ్ (67), చిరాగ్ జైన్ (40 నాటౌట్) బ్యాట్లు ఝుళిపించడంతో.. సోమవారం జరిగిన రెండో క్వార్టర్‌ఫైనల్లో సౌరాష్ట్ర 17 రన్స్ తేడాతో (వీజేడీ పద్ధతి) ఉత్తరప్రదేశ్‌పై గెలిచింది. టాస్ ఓడిన యూపీ 50 ఓవర్లలో 310/8 స్కోరు చేసింది. అభిషేక్ గోస్వామి (88), సమీర్ రిజ్వి (88), ప్రియమ్ గార్గ్ (35), ప్రశాంత్ వీర్ (30) రాణించారు. చేతన్ సకారియా 3, అంకూర్ పన్వర్, ప్రేరక్ మన్కడ్ చెరో రెండు వికెట్లు తీశారు. తర్వాత సౌరాష్ట్ర 40.1 ఓవర్లలో 238/3 స్కోరు చేసింది. ఈ దశలో వర్షం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. అప్పటికే వీజేడీ పద్ధతిలో సౌరాష్ట్ర ఎక్కువ స్కోరు చేసి ఉండటంతో విజేతగా ప్రటించారు.

**వరుసగా నాలుగో సారి సెమీస్ కు కర్ణాటక:**

ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న డిఫెండింగ్ చాంపియన్ కర్నాటక.. వరుసగా నాలుగోసారి విజయ్ హజారే ట్రోఫీ సెమీస్‌లోకి ప్రవేశించింది. ఛేజింగ్‌లో దేవదత్ పడిక్కల్ (81 నాటౌట్), కరుణ్ నాయర్ (74 నాటౌట్) దంచికొట్టడంతో.. సోమవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో కర్నాటక 55 రన్స్ తేడాతో (వీజేడీ పద్ధతి) ముంబైపై నెగ్గింది. టాస్ ఓడిన ముంబై 50 ఓవర్లలో 254/8 స్కోరు చేసింది. శామ్స్ ములానీ (86) టాప్ స్కోరర్. సిద్ధేశ్ లాడ్ (38), సాయిరాజ్ పాటిల్ (33 నాటౌట్), అంగ్‌క్రిష్ రఘువంశీ (27), ఇషాన్ మూల్‌చందానీ (20) రాణించారు.

# ఇండియాలో ఆడే ముచ్చటే లేదు: మరోసారి తేల్చిచెప్పిన బంగ్లాదేశ్.. ఐసీసీ నిర్ణయంపై ఉత్కంఠ




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ కోసం భారతదేశానికి వెళ్లే ముచ్చటే లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) పునరుద్ఘాటించింది. భద్రతా సమస్యల కారణంగా ఇండియాకు వెళ్లలేమని మరోసారి ఐసీసీకి తేల్చి చెప్పింది బీసీబీ. ఇటీవల బంగ్లాదేశ్, భారత్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ స్టూడెంట్ లీడర్ ఉస్మాన్ హాదీ హత్య తర్వాత ఆ దేశంలో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లు క్రమంగా ఇండియాకు వ్యతిరేకంగా మారాయి. బంగ్లాలో పెద్ద ఎత్తున భారత వ్యతిరేక నిరసనలు వ్యక్తం అయ్యాయి. అంతేకాకుండా మైనార్టీలపై ఆ దేశంలో దాడులు పెరిగాయి. ముఖ్యంగా హిందువులను టార్గెట్ చేసి హత్య చేస్తున్నారు. దీంతో ఐపీఎల్‌లో బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఆడకుండా బీసీసీఐ నిషేధం విధించింది. ఈ పరిణామాలతో ఇండియా, బంగ్లా మధ్య సంబంధాలు క్షీణించాయి. దీంతో 2026, ఫిబ్రవరిలో ఇండియా, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ కోసం భారత్‌లో పర్యటించలేమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఐసీసీకి చెప్పింది. ఆటగాళ్ల భద్రతా సాకుగా చూపిస్తూ ఇండియాలో పర్యటించలేమంది. అలాగే.. రాబోయే టీ20 వరల్డ్ కప్‌లో ఇండియాలో జరిగే తమ మ్యాచ్‌లను తటస్థ వేదికకు (శ్రీలంకకు) మార్చాలని ఐసీసీని కోరింది. ఈ అంశంపై చర్చించేందుకు మంగళవారం (జనవరి 13) బీసీబీ సభ్యులతో ఐసీసీ వర్చువల్‌గా సమావేశమైంది. ఈ సమావేశంలో బీసీబీ అధ్యక్షుడు ఎండీ అమీనుల్ ఇస్లాం, ఉపాధ్యక్షులు ఎండీ షకావత్ హుస్సేన్, ఫరూక్ అహ్మద్, క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ డైరెక్టర్, ఛైర్మన్ నజ్ముల్ అబేదీన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిజాం ఉద్దీన్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీబీ అధికారులు తమ వైఖరిని పునరుద్ఘాటించారు. ఆటగాళ్లు, జట్టు అధికారులు, సహాయక సిబ్బంది భద్రత భద్రతా సమస్యల కారణంగా రాబోయే టీ20 వరల్డ్ కప్ కోసం ఇండియాలో పర్యటించలేమని బీసీబీ మరోసారి స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను తటస్థ వేదికలకు మార్చాలని ఐసీసీని కోరింది. అయితే.. టోర్నీ షెడ్యూల్ ఇప్పటికే ఖరారైందని.. తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలని బీసీబీకి ఐసీసీ సూచించింది. కానీ బీసీబీ వెనక్కి తగ్గలేదు. తమ వైఖరిలో మార్పు లేదని బీసీబీ ప్రతినిధులు ఐసీసీకి తేల్చి చెప్పారు. ఒకవైపు షెడ్యూల్ ఖరారు కావడం.. మరోవైపు బీసీబీ వెనక్కి తగ్గకపోవడంతో ఈ అంశంలో ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుబోతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

**ఇండియాలో నాలుగు లీగ్ మ్యాచ్ లు:**

భారత్, శ్రీలంక ఆతిథ్య దేశాలుగా 2026, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు టీ20 వరల్డ్ కప్ జరగనుంది. టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం ఇండియాలో బంగ్లాదేశ్ మొత్తం నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మూడు కోల్‌కతాలో ఒకటి ముంబైలో జరగనుంది. ఫిబ్రవరి 7న వెస్టిండీస్, ఫిబ్రవరి 9న ఇటలీ, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్ తో కోల్‌కతాలో మ్యాచ్ లు ఆడనుంది. ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్ తో మ్యాచ్ ఆడాల్సి ఉంది.




శ్రేయా ధన్వంతరి బ్లాక్ లేస్‌లో గ్లామ్ అందిస్తోంది

# హిట్ మెషిన్ రేసులో ఇద్దరు హీరోలా?



హిట్ మెషిన్ అనీల్ రావిపూడికి ఇంత వరకూ వైఫల్యం ఎదురవ్వలేదు. దర్శకధీరుడు రాజమౌళి తర్వాత అప జయం ఎరుగని మరో దర్శకుడిగా రికార్డు సృష్టించాడు. రాజమౌళి తర్వాత రాజమౌళి అంతటి వాడిగా నీరాజనాలు అందుకుంటున్నాడు. తాను తీసేవి గొప్ప కథలు కాకపోయినా ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేస్తున్నాడు. నిర్మాతకు లాభాలు తెచ్చి పెడుతున్నాడు. హీరోలకు వరుస విజయాలు అందిస్తున్నాడు. ఇప్పటికే ఎనిమిది వరుస విజయాలు అందుకున్న అనీల్ తాజాగా రిలీజ్ అయిన -మనశంకరవ రప్రసాద్ గారు- తో తొమ్మిదవ సక్సెస్ ను కూడా ఖాతాలో వేసుకున్నాడు.

ఈ సంక్రాంతి కూడా అనీల్ దే అనిపించాడు. మిగతా మూడు చిత్రాల రిలీజ్ అనంతరం ఎమ్ ఎస్ జీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుంది? అన్నది ఓ అంచనా వస్తుంది. ఇప్పటికే అనీల్ ఖాతాలో వరుసగా ట్రిపుల్ హ్యాట్రిక్ నమోదైనట్లే. దీంతో అనీల్ 10వ సినిమా ఏ హీరోతో ఉంటుంది? అనే చర్చ మొదలైంది. ఆయన సినిమా మొదలు పెడితే గనుక ఇదే ఏడాదే ఆ సినిమా రిలీజ్ అవుతుంది. అందులో ఎలాంటి డౌట్ లేదు. సంవత్సరాల పాటు హీరో, నిర్మాతల సమయాన్ని తినే దర్శకుడు కాదు. కాబట్టి పదవ సినిమా ఏడాది ముగింపులోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది.అయితే అందులో హీరో ఎవరవుతారు? అన్నదే ఆసక్తికరం. ఇప్పటికే కింగ్ నాగార్జున పేరు జోరుగా వినిపిస్తోంది. అనీల్ కూడా కింగ్ విషయంలో పాజిటివ్ గా ఉన్నాడు. నాగ్ తో పనిచేస్తే సీనియర్లు అందర్నీ కవర్ చేసినట్లు అవుతుందని భావిస్తున్నాడు. ఆ దిశగా అనీల్ సీరియస్ గానే ఆలోచన చేస్తున్నాడు అన్నది కాదనలేని నిజం. ఇదే జరిగితే టాలీవుడ్ లో మొదటి న్యూ-ఏజ్ డైరెక్టర్‌గా అనిల్ అరుదైన గుర్తింపు దక్కినట్లే. ప్రస్తుతం నాగార్జున తన 100వ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా షూటింగ్ పై మరో రెండు నెలల్లో క్లారిటీ వస్తుంది.అనంతరం నాగ్ షెడ్యూల్ కూడా బయటకు వస్తుంది. దాన్ని బట్టి అనీల్ ప్లాన్ చేసే ఛాన్స్ లేకపోలేదు.అలాగే 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి సీక్వెల్ చేసే ఆలోచన ఉన్నట్లు కూడా రావిపూడి ఇప్పటికే హింట్స్ ఇచ్చాడు. కానీ ఈ కాంబినేషన్ ఇప్పటికప్పుడే రిపీట్ అవ్వదు. అందుకు సమయం పడుతుంది. చిరంజీవి-వెంకేటష్ తో మల్టీస్టారర్ కూడా ఉంది కాబట్టి సీక్వెల్ కి కాస్త సమయం తీసుకుంటాడు.వెంకటేష్ కూడా మరో సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. అలాగే దిల్ రాజు బ్యానర్లో అనీల్ మరో సినిమా చేయాల్సి ఉంది. అందులో హీరో ఎవరు? అన్నది ఇంకా డిసైడ్ అవ్వలేదు. పవన్ కళ్యాణ్ తో రాజుగారు ముందుకొచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. కానీ అది జరుగుతుందా? లేదా? అన్నది చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965